నేడు గణతంత్ర దినోత్సవం

పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో భారీ ఏర్పాట్లు
జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న కలెక్టర్
537 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు


విద్యుత్ దీపాలతో ధగధగలాడుతున్న కలెక్టరేట్

ఒంగోలు(కలెక్టరేట్) జనవరి 25 : భారత 75వ గణతంత్ర దిన వేడుకలను ఒంగోలులో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం ఉదయం 9గంటలకు కలెక్టర్ దినేష్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. వేడుకలను తిలకించేందుకు ప్రజా ప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులు, వివిధ వర్గాల ప్రజలు రానుండటంతో అందుకనుగుణంగా అక్కడ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ శకటాలను, స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మరోవైపు లబ్ధిదారులకు ఆయా శాఖల ద్వారా ఉపకరణాలు, చెక్కులతోపాటు జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 537 మందికి పైగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

గణతంత్ర దినోత్సవం కోసం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో చేసిన ఏర్పాట్లను కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికా గర్గ్‌లు గురువారం పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. వేడుకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గర్గ్

పచ్చి మోసం..!

వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధిపొందేందుకు వైసీపీ ప్రభుత్వం వెలిగొండపై ఆరాటపడుతోంది. కీలక పనులన్నీ పెండింగ్‌లో ఉండగా, కేవలం టన్నెల్ తవ్వకాన్ని మమ అనిపించి ప్రాజెక్టును పూర్తిచేశామని అబద్ధపు ప్రచారం మొదలుపెట్టింది. నిబంధనలు పట్టించుకోకుండా, ప్రాజెక్ట్ భవిష్యత్ భద్రత ఆలోచించకుండా మాన్యువల్‌గా తవ్వకాలు చేపట్టింది. ప్రాజెక్టు పూర్తిపై చిత్తశుద్ధితో గత టీడీపీ ప్రభుత్వం నిబంధనల ప్రకారం అనేక క్లిష్ట పరిస్థితులను అధిగమించి అధిక నిధుల వ్యయంతో కీలక పనులను పూర్తిచేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిలో నీరిస్తామని జగన్‌రెడ్డి ఆర్భాటం చేశారు. కానీ మూడేళ్ల క్రితమే తొలి టన్నెల్ తవ్వకం పూర్తయినా ఇంతవరకు నీటి విడుదలపై దృష్టిపెట్టలేదు. నిర్వాసితుల పునరావాసంలో అసాధారణ జాప్యం, నిధుల కొరతే అందుకు ప్రతిబంధకాలు. కాగా ప్రస్తుతం ఎన్నికలు దగ్గరపడుతుండటంతో కృష్ణానది నుంచి నీరు తీసుకునే అవకాశం కూడా లేకపోయినా, ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నా ప్రాజెక్టును ప్రారంభించే యోచన చేస్తుండటం గమనార్హం.

ఎన్నికల వేళ మాయమాటలు
లైనింగ్ లేకుండానే టన్నెళ్ల తవ్వకాలు
పనులన్నీ పూర్తయ్యాయని అబద్ధాలు
టీబీఎం ఇంతవరకు వెనక్కిరాలేదు
ఓట్ల కోసం వెలిగొండపై వైసీపీ ఆరాటం
మూడేళ్ల క్రితమే టన్నెల్-1 పూర్తయినా
నీటి గురించి పట్టించుకోని ప్రభుత్వం
అడుగు ముందుకు పడని పునరావాసం
ఇంకా పెండింగ్‌లోనే అనేక పనులు


వెలిగొండ టనెల్ ముఖద్వారం

ఒంగోలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాతోపాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని సుమారు 4.47 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వం దొంగాట ప్రారంభించింది. కీలక పనులన్నీ పూర్తిచేయకుండానే ప్రాజెక్టు అంతా సిద్ధం అన్నట్లు ఆర్భాటం చేస్తోంది. వివరాల్లోకి వెళితే.. 1996 మార్చిలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. కేంద్ర అనుమతులు, పర్యావరణ, అటవీశాఖ నుంచి క్లియరెన్స్ ప్రక్రియ ఇతర కీలక సర్వేలు టీడీపీ కాలంలోనే జరగ్గా జలయజ్ఞంలో భాగంగా వైఎస్ఆర్ కొన్ని పనులు చేపట్టారు. కృష్ణానదిలో శ్రీశైలం, ఎగువన కొల్లంవాగు ప్రాంతం నుంచి 18.80 కి.మీ. దూరం ఒకటి ఏడు మీటర్లు, మరొకటి 9.2 మీటర్ల వ్యాసంతో రెండు టన్నెళ్లు తవ్వి దోర్నాల మండలం కొత్తూరు దగ్గర నీరు బయటకు తెచ్చి అక్కడి నుంచి 23.36 కి.మీ ఫీడర్ కాలువ ద్వారా నల్లమల సాగర్(రిజర్వాయర్)కు రోజుకు ఒక టీఎంసీ వంతున నింపేలా డిజైన్ చేశారు. పూర్తి నీటి సామర్థ్యం 53.85 టీఎంసీలు కాగా 43.58 టీఎంసీల లైవ్ స్టోరేజీతో రిజర్వాయర్ నిర్మాణం పూర్తయింది.

నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరం

మరోవైపు నిర్వాసితుల పునరావాసం పట్టించుకున్న పాపాన పోలేదు. నాలుగేన్నరేళ్ల వైసీపీ పాలనలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. మొత్తం 11 ముంపుగ్రామాల్లో 10 వేల కుటుంబాలు నిర్వాసితులు అవుతున్నారు. అయితే పదేళ్ల క్రితం నాటి సర్వేలో 7.5వేల కుటుంబాలకు పునరావాస ప్యాకేజి ఇవ్వాల్సి ఉంటుందని గుర్తించారు. అందులో కేవలం 73 కుటుంబాలను మాత్రమే తరలించగా, తదనంతర కాలంలో 18ఏళ్లు నిండిన వారికి కూడా ప్యాకేజీ కావాలన్న డిమాండ్ వచ్చి ప్రస్తుతం నిర్వాసితుల సంఖ్య పెరిగింది. ఇందుకు సర్వేలు కూడా చేశారు. కానీ ఒక్కరికి కూడా పునరావాస ప్యాకేజి ఇవ్వలేదు. కాలనీల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న విధంగా ఉంది.

నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కోసం 2021 ఫిబ్రవరి రూ.1300 కోట్లతో వైసీపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది తప్ప నిధులు ఇవ్వలేదు. మొత్తం వైసీపీ ప్రభుత్వ కాలంలో కేవలం రూ.951 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. గత అంచనా ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.8,100 కోట్లు కాగా దాదాపు రూ.6వేల కోట్లు ఖర్చుచేశారు. తాజాగా అంచనా వ్యయం మరో వెయ్యి కోట్లు పెరగనుంది. అలా మరో రూ.3వేల కోట్లు అవసరం కాగా 2023-24 బడ్జెట్‌లో ప్రభుత్వం కేవలం రూ.101 కోట్లను కేటాయించింది. అలా నిధులు ఇవ్వకుండా, పనులు చేయకుండా, నిర్వాసితులను తరలించకుండా, కేవలం టన్నెళ్ల తవ్వకం పూర్తయిందని ప్రచారం మొదలుపెట్టింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రాజెక్టు ప్రారంభానికి నిసిగ్గుగా సన్నాహాలు వైసీపీ ప్రభుత్వం చేస్తోంది. ఒకవేళ లైనింగ్ చేయకపోయినా టన్నెల్ ద్వారా నీరు తీసుకోవచ్చని అనుకున్న ప్రస్తుతం కృష్ణానదిలో నీరు లేదు. వచ్చే ఆగస్టు తర్వాతనే నదిలోకి నీరు వచ్చేది. అయినా ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రాజెక్టు ప్రారంభం అంటూ ప్రచారం చేస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే మూడేళ్ల క్రితమే పూర్తయిన టన్నెల్-1 ద్వారా నీరు తీసుకునే అవకాశం ఉన్నప్పుడు నిర్వాసితుల పునరావాసం, పెండింగ్ పనులు చేసేవారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

టీబీఎం పక్కనబెట్టి బ్లాస్టింగ్

టీబీఎంతో పక్కాగా చేయాల్సిన టన్నెల్ తవ్వకం పనులను మాన్యువల్‌గా తవ్వుతూ, బ్లాస్టింగ్ చేస్తూ వచ్చారు. ఆ మట్టిని బయటకు తెచ్చేందుకు రెండు, మూడు చోట్ల టన్నెల్-2 నుంచి టన్నెల్ 1లోకి భారీ రంధ్రాలను పెట్టారు. టీఎంబీ ద్వారా పైభాగంలో పెట్టాల్సిన సెగ్మెంట్లు, (లైనింగ్) ఏర్పాటు పట్టించుకోకపోవడంతోపాటు మట్టి తెచ్చే టిప్పర్ల రాకపోకల కోసం టన్నెళ్లు అడుగు భాగంలో రెండు, మూడు అడుగుల ఎత్తులో రోడ్డు మాదిరిగా ఏర్పాటుచేశారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో చేయాల్సిన ఆ పనులను పూర్వ కాలంలో కాలువలు, బావులు తవ్వినట్లు తవ్వేశారు. భవిష్యత్‌లో నీటి విడుదల సమయంలో కొండచరియలు విరిగిపడితే ఎలా అన్నది ప్రశ్నార్థకం. అంతేకాక టన్నెల్ అడుగున రోడ్డులా వేయడంతో దాని వ్యాసం కూడా తగ్గిపోయింది. మరోవైపు ఫీడర్ కాలువలో చాలాచోట్ల స్ట్రక్చర్లు పెండింగ్‌లో ఉండగా, అనేకచోట్ల మట్టి కట్టలు కోతకు గురై లైనింగ్ చేయాల్సి ఉంది. ఇక ఏళ్ల క్రితం తవ్విన కాలువలు పూడిపోయి, చిల్లచెట్లతో నిండాయి.

అంతా టీబీఎంతోనే..

అత్యంత కీలకమైన టన్నెళ్ల తవ్వకాలను జర్మనీ నుంచి తెచ్చిన టన్నెల్ బార్ మిషన్ (టీబీఎం) ద్వారా చేపట్టారు. ఆ మిషన్ ద్వారా ఒకేసారి తవ్వకం, తవ్విన మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా వెలుపలకు తీసుకురావడం, పైభాగంలో సెగ్మెంట్లు(సిమెంట్ లైనింగ్) అమర్చేలా ఏర్పాటు చేశారు. అలానే తొలి నుంచి పనులు జరుగుతూ వచ్చాయి. 2009 వరకు ఒకింత వేగంగానే జరిగిన పనులు తర్వాత మందగించి 2012 నాటికి ఆగిపోయాయి. తిరిగి 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చాక నాటి సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించారు. అప్పటివరకు కేవలం 10 కి.మీ. మాత్రమే తొలి టన్నెల్ పూర్తికాగా దాదాపు ఏడు కి.మీ టీడీపీ కాలంలో పూర్తిచేశారు. అత్యంత క్లిష్టమైన హెడ్ రెగ్యులేటరీ పనులు(తొలి టన్నెల్‌కు)తో పాటు పలు ఇతర పనులు చేశారు. రెండవ టన్నెల్ తవ్వకం కూడా 3కి.మీ.పైగా చేశారు. మొత్తంగా టీడీపీ కాలంలో 2014-19 వరకు సుమారు రూ.1,500కోట్ల వ్యయంతో పాటు నిర్వాసితుల సర్వే, ప్యాకేజీలపైనా దృష్టిసారించారు. అలా వైసీపీ ప్రభుత్వం వచ్చే నాటికి తొలి టన్నెల్ 17కి.మీ. రెండవ టన్నెల్ 11.8కి.మీ. పూర్తితోపాటు పలు ఇతర కీలక పనులు పూర్తయ్యాయి.

చిత్తశుద్ధి లేని పాలకులు

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే వెలిగొండ నీరిస్తానని పాదయాత్రలో, ఎన్నికల ప్రచారంలో జగన్మోహన్‌రెడ్డితోపాటు వైసీపీ నేతలు ఊదరగొట్టారు. చిత్తశుద్ధితో పనులు, నిర్వాసితులకు పునరావాసం పూర్తిచేసి ఉంటే ఏడాదిలోపే నీరిచ్చే అవకాశం ఉండేది. ఎందుకంటే వైసీపీ వచ్చే నాటికి తొలి టన్నెల్ కేవలం 1.80 కి.మీ మాత్రమే పెండింగ్‌లో ఉంది. అయితే నిర్వాసితుల పునరావాసానికి నిధులు ఇవ్వకపోవడంతో వారిని అధికారులు తరలించలేకపోయారు. దీంతో 2021 జనవరిలోనే తొలి టన్నెల్ తవ్వకం పూర్తయినా ప్రాజెక్టులోకి కృష్ణానీటిని తీసుకురాలేకపోయారు. నిధుల ఇవ్వకపోగా నిర్వాసితుల పునరావాస అంశాలను బయటకు రాకుండా ఉండేందుకు ఏటా రెండు, మూడు ముహూర్తాలు పెడుతూ జూన్, ఆగస్టు, డిసెంబరులలో వెలిగొండ నీళ్లంటూ వైసీపీ ప్రభుత్వం మభ్యపెడుతూ వచ్చింది. రెండో టన్నెల్ పనులు చేస్తున్నట్లు చూపేందుకు ప్రయత్నం చేశారు.


మాన్యువల్‌గా తవ్వుతున్న టన్నెల్ ఇదే

జిల్లాలో 730 ఖాళీలు

నేడు డీఎస్సీ నోటిఫికేషన్

ఒంగోలు(విద్య), జనవరి 25 : ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసేందుకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ ప్రకటించి టీచర్ పోస్టులన్నీ భర్తీచేస్తామని ఊదరగొట్టిన విషయం తెలిసిందే. ఆచరణలో మాత్రం అడుగు ముందుకు వేయలేదు. ప్రస్తుతం తీరా ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో మరికొన్ని రోజుల్లో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో డీఎస్సీ ప్రకటనకు శ్రీకారం చుట్టడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు నోటిఫికేషన్ జారీచేస్తే ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం వచ్చాకే నియామకాలు చేపట్టే అవకాశం ఉంది. జిల్లాలో ప్రస్తుతం 730 ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. గరిష్ఠంగా సెకండరీ గ్రేడ్ తెలుగు 240 ఖాళీలు ఉన్నట్లు అంచనా. ఎస్‌జీటీ ఉర్దూ, వివిధ సబ్జెక్టుల స్కూలు అసిస్టెంట్, ఇతర పోస్టులు సమారు 500 ఖాళీలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అయితే శుక్రవారం వెలువడనున్న నోటిఫికేషన్‌లో ఎన్ని ఖాళీలు ప్రకటిస్తారో తెలాల్సి ఉంది.

ప్రతిష్ఠాత్మకమైన ఐపీఎంకు ఎంపికైన పీటీసీ సీఐ

అభినందించిన ప్రిన్సిపాల్ ఏఆర్ దామోదర్


వెంకటేశ్వర్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ దామోదర్

ఒంగోలు (క్రైం) జనవరి 25 : పోలీసు శాఖలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీసు మెడల్‌కు పీటీసీ సీఐ అద్దంకి వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి చేతులమీదుగా ఆ మెడల్‌ను త్వరలో అందుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి వెంకటేశ్వర్లును పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఏఆర్ దామోదర్ అభినందించారు. గురువారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయనను శాలువతో సత్కరించారు. పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరి ఉద్యోగోన్నతిపై ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఇండియన్ పోలీసు మెడల్‌కు ఎంపిక కావడం అభినందనీయమని పలువురు అధికారులు తెలిపారు. వెంకటేశ్వర్లు పోలీసు శాఖకు చేసిన సేవలను కొనియాడారు.

రేపు ఒంగోలుకు పీసీసీ చీఫ్ షర్మిల



ఒంగోలు (క్రైం) జనవరి 25 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డి శనివారం ఒంగోలులో జరగనున్న పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొననున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక గుంటూరు రోడ్డులో గల విష్ణుప్రియ ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యకర్తల సమావేశంలో షర్మిలతోపాటు పార్టీ నాయకులు కొప్పులరాజు, రఘువీరారెడ్డి, కేవీపీ రామచంద్రరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ఉన్న పార్టీశ్రేణులు విరివిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

తప్పనిసరిగా ఓటు వేయాలి

రాజ్యాంగం కల్పించిన హక్కును అందరూ వినియోగించుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి పిలుపు


జ్యోతి వెలిగిస్తున్న ప్రధాన న్యాయాధికారి భారతి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 25 : రాజ్యాంగం ప్రసాదించిన హక్కును, తమపై ఉన్న బాధ్యతను ఓటర్లందరూ గుర్తించి తప్పనిసరిగా ఓటు వేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఏ.భారతి పిలుపునిచ్చారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ప్రకాశం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైందన్నారు. ముందుగా డీఆర్ఆర్ఎం స్కూలు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి స్వేచ్ఛగా ఓటును వినియోగించుకునే హక్కును తెలియజేసేలా కలెక్టర్ భారీ బెలూన్‌ను ఎగురవేశారు. అనంతరం ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వీక్షించారు. ఓటు హక్కు వచ్చిన నాటి నుంచి ప్రతిసారి ఓటు వేస్తున్న సీనియర్ సిటిజన్లు పి.హనుమంతరావు, సివిఎల్.సుబ్రహ్మణ్యం, రంగనాథం, జి.నరసింహరావులను ఈ సందర్భంగా సన్మానించారు. సీనియర్ సిటిజన్, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఏపీ చైర్మన్ ఎం.నాగేశ్వరరావు తొలిసారి ఓటుహక్కును వినియోగించుకోబోతున్న వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే శ్యాంబాబు, ఏఎస్పీ నాగేశ్వరరావు, ట్రైనీ ఐఏఎస్ శౌర్యమన్ పటేల్, డీఆర్వో శ్రీలత, ఆర్డీవో విశ్వేశ్వరరావు, స్వీప్ నోడల్ అధికారి రవి, అధికారులు వసుంధర, రవికుమార్, ఉషారాణి, అర్చన, వెంకటేశ్వరరావు, వీ సుబ్బారావు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఉత్తమ పనితీరు చూపిన దర్శి ఈఆర్వోగా ఉన్న ఎంపీఎస్ లోకేశ్వరరావు, పది మంది బీఎల్‌వోలను సత్కరించారు.

నీళ్లివ్వండి మహాప్రభో!

దాహార్తి తీర్చాలంటూ ఘాట్ రోడ్డుపై బోడేనాయక్ తండావాసుల బైఠాయింపు


రోడ్డుపై నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

పెద్దదోర్నాల, జనవరి 25 : తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బోడేనాయక్ తాండా వాసులు బుధవారం శ్రీశైలం-దోర్నాల ఘాట్‌రోడ్డుపై బైఠాయించారు. రెండు గంటలకుపైగా ధర్నా నిర్వహించారు. దీంతో శ్రీశైలం, దోర్నాల రెండు వైపులా కిలోమీటరు పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. గ్రామంలో డీప్‌బోర్లు అడుగంటాయి. నీటి ఎద్దడి ఎక్కువైంది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేవారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు రెండు రోజులుగా ట్యాంకర్లతో నీటి సరఫరా నిలిపివేశారు. ఆ కాంట్రాక్టర్‌ను అడిగితే బిల్లులు రాకుండా ఎన్నాళ్లు నీళ్లు తోలుతామని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై అంకమరావు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి, ఎంపీడీవో నాసర్‌రెడ్డికి ఎస్సై ఫోన్ ద్వారా విషయం చెప్పారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని శుక్రవారం నుంచి రోజుకు పది ట్రిప్పులు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు ఆందోళన విరమించారు.

కుర్చీ నాదే!

ఉద్యోగోన్నతి కోసం ఓ అధికారి అడ్డదారి
పోస్టింగ్ కోసం తాడేపల్లి చుట్టూ ప్రదక్షిణలు
డిప్యుటేషన్ సమయంలో భారీగా అక్రమార్జన
రూ.50లక్షల సూట్ కేసుతో రాజధానిలో మకాం



పుల్లలచెరువు, జనవరి 25 : అయన ఓ శాఖలో చిన్నస్థాయి అధికారి. కానీ అధికార పార్టీలో మాత్రం పెద్దస్థాయిలో పలుకుబడి ఉంది. నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే ఉద్యోగోన్నతి పొందారు. వాస్తవంగా ఆయనకు ఆ అర్హత లేనప్పటికీ, డిప్యుటేషన్ మీద పైస్థాయికి వెళ్లారు. ఆతర్వాత వైపాలెం నియోజకవర్గంలో అన్నీ తానై చక్రం తిప్పారు. నియోజకవర్గంలో నీళ్లు పారించలేకపోయినా, కాగితాల్లో మాత్రం నిధులు పారించి పెద్ద మొత్తంలో వెనకేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో అయ్యగారిపై అధికారపార్టీలోని సీఎం సామాజికవర్గం నేతల్లో అసంతృప్తి పెరిగింది. ప్రస్తుతం ఆయన డిప్యుటేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. ఈయనకు దన్నుగా ఉన్న నేత కూడా మరో నియోజకవర్గానికి వెళ్లారు. ఇప్పుడు అనివార్యంగా తిరిగి ఆయన కిందిస్థాయికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇన్నాళ్లూ ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న తీరుగా ఆయన వ్యవహారం నడవగా, ప్రస్తుతం అంతా మారిపోయింది. దీనినుంచి బయటపడేందుకు తాడేపల్లి పెద్దల వద్దకు పయనమయ్యాడు. ఒట్టి చేతులతో వెళితే పెద్దగా ప్రయోజనం ఉండదని గ్రహించి గట్టి చేతులతోనే ఆయన తాడేపల్లిలో పాగా వేశాడు. అందుకుగాను రూ.50 లక్షల మేర ముట్టజెప్పేందుకు ఆయన సిద్ధపడినట్లు తెలిసింది. తన మాట వినే ప్రజాప్రతినిధి సిఫారసు ద్వారా ఉద్యోగోన్నతి పొందేందుకు ప్రయత్నిస్తున్నాడు. జిల్లాకు చెందిన ఆ శాఖ ఉన్నతాధికారి కూడా భారీగా ముడుపులు అందుకొని ఆయన ఉద్యోగోన్నతికి పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన ఆ శాఖలో పెండింగ్ బిల్లులు భారీగా ఉన్నాయి.

ఒక్కసారి ఉద్యోగోన్నతి వస్తే పైవారికిచ్చే రూ.50లక్షలు కొద్దిరోజుల్లో తిరిగి సంపాదించుకోవచ్చని ఆయన ఆశలు పెట్టుకున్నట్లు తెలిసింది. అయితే ఆయనకు ఉద్యోగోన్నతి రాకుండా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని సీఎం సామాజికవర్గం నేతలు అడ్డుపడుతున్నారు. ఆ అధికారికి ఉద్యోగోన్నతి ఇవ్వొద్దని జిల్లాకు చెందిన ముఖ్యనేతకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మరి ఆ అధికారి నుంచి ముడుపులు తీసుకొని ఉన్నతాధికారులు ఉద్యోగోన్నతి ఇస్తారో, లేదో వేచిచూడాల్సిందే.

ఇతరులకు ప్రవేశం లేదు..

కీలకమైన ఆ శాఖకు ఇటీవల విజయవాడకు చెందిన ఓ మహిళా అధికారి బదిలీపై వచ్చారు. ఆమెను రెగ్యులర్ అధికారిగా నియమించారు. ఆ కుర్చీపై ఆశ పెట్టుకున్న సదరు అధికారి 26 రోజులకే ఆ మహిళా అధికారిని బలవంతంగా సెలవు పెట్టించారు. ఇప్పటివరకు అయనకు దన్నుగా ఉన్న ముఖ్యనేతే ఆమెతో సెలవు పెట్టించారని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అక్కడ ప్రస్తుతం పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ, కొత్తవారు ఆ వైపు చూడడానికి జంకుతున్నారు.

పర్సెంటేజీ లేనిదే ఫైలు ముట్టుకోరు?

తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన కాలంలో పైసా లేనిదే ఫైలు ముట్టుకోరు. కార్యాలయంలోనే మధ్యవర్తులను పెట్టుకొని వారితో దర్జాగా డబ్బులు వసూలు చేయించారు. మంచినీటి ట్యాంకర్లు, బోర్ల బిల్లులు, జలజీవన్ మిషన్‌కు కనీసం అయన వాటాగా 10శాతం లేనిదే ఫైలు కూడా చూడకుండానే కొర్రీలు పెడతారనే పేరుంది. డబ్బులిస్తే మాత్రం అర్ధరాత్రి అయినా పనిపూర్తి చేసి ఇచ్చేస్తారు. నాలుగేళ్లలో సూమారు రూ.5కోట్లకు పైగానే కుడబెట్టాడని వైసీపీ నేతలే చర్చించుకుంటున్నారు. వైసీపీ నియోజకవర్గ స్థాయి నేతలైనా ఆయన అవినీతి ముందు బలాదూరే అని వారే చెప్పడం కొసమెరుపు.

బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్
చీమకుర్తి, సంతనూతలపాడుల్లో జయహో బీసీ సదస్సులు విజయవంతం

చీమకుర్తి, జనవరి 25: బలహీనవర్గాల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీలు పేర్కొన్నారు. గురువారం చీమకుర్తిలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన జయహో బీసీ సదస్సు విజయవంతమైంది. మండలంలోని ప్రతి గ్రామం నుంచి బీసీలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన విజయ్‌కుమార్, నూకసాని బాలాజీ, రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు ప్రసంగించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కోసం ప్రత్యేకంగా ఒక్క పథకం కూడా ప్రవేశపెట్టకపోగా, సబ్‌ప్లాన్ నిధులను కూడా నిలిపివేసిందని వారు ఆరోపించారు. బీసీ కార్పొరేషన్‌కు చిల్లిగవ్వ కూడా మంజూరు చేయలేదని, ఆదరణ పథకానికి తిలోదకం ఇచ్చారని మండిపడ్డారు. .స్థానికసంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను టీడీపీ హయాంలో పెంచగా, వైసీపీ ప్రభుత్వం తగ్గించిందని చెప్పారు. బీసీలు మనుగడ సాధించాలన్నా, గౌరవం పెరగాలన్నా, అభివృద్ధి జరగాలన్నా, రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చౌట శ్రీనివాసరావు, గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, వేల్పుల శ్రీనివాసరావు, అవనిగడ్డ శేషారావు, బుజ్జిబాబు, నర్రా నాగరాజు, కాటేపల్లి యలమంద పాల్గొన్నారు.


చీమకుర్తిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఎన్, బాలాజీ తదితరులు


సంతనూతలపాడులో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

బీసీలకు సముచిత స్థానం

సంతనూతలపాడు: రాష్ట్రంలో బీసీలకు సముచిత స్థానం కల్పించిన పార్టీ టీడీపీ అని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం రాత్రి సంతనూతలపాడులో జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బీఎన్‌తో పాటు జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి బాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం బీఎన్ మాట్లాడుతూ చంద్రబాబు బీసీలకు తగిన ప్రాధాన్యతను ఇస్తూ అన్నివేళలా అండగా ఉంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రశ్నించే వారిపై దాడులు చేస్తోందని ఆరోపించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. టీడీపీ, జనసేన పొత్తుకు ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. కందుకూరి బాబు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పొత్తు చారిత్రాత్మకం అన్నారు. బీసీలకు తగిన న్యాయం జరగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అనివార్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలా ధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నాయకులు బొమ్మినేని రామాంజనేయులు, తన్నీరు శ్రీను, ఆర్.సురేష్, సీహెచ్.శ్రీను, గొట్టిపాటి రాఘవరావు, ఆర్.అంకారావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి చేసింది టీడీపీనే : ఎమ్మెల్యే స్వామి


పాకలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, జనవరి 25 : ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి కృషి చేసింది టీడీపీనేనని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి చెప్పారు. మండలంలోని పాకల పంచాయతీ పరిధిలోని బంగారుతోట, దేవుడిమాన్యం, పీర్లచావడిలలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో స్వామి మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం యువతులకు దుల్హాన్ పథకం ద్వారా రూ.50 వేల ఆర్థిక సహాయం అందించామని గుర్తు చేశారు. వైసీపీ వచ్చాక ఆ పథకానికి రకరకాల కొర్రీలు పెట్టి నీరు కార్చాడని దుయ్యబటారు. మాజీ మంత్రి దామచర్ల హయాంలో దేవుడి మాన్యంలో ముస్లింలకు 150 పట్టాలు ఇచ్చి కాలనీ నిర్మాణాన్ని చేపట్టారని గుర్తు చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, సర్పంచ్ సైకం చంద్రశేఖర్, నేతలు సంధానిబాషా, సుబ్బారావు, రాజగోపాల్ రెడ్డి, చంటి, మించల బ్రహ్మయ్య యస్దాని, సనాఉల్లా, నరసింహ, కన్నా ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ఎమ్మెల్యే బాలినేని


ఎమ్మెల్యే బాలినేనికి మొక్కను అందజేస్తున్న మహిళా నేతలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 25: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీ గెలుపు కోసం పాటుపడాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక లాయర్‌పేటలోని బాలినేని నివాసంలో గురువారం వైసీపీ జిల్లా మహిళా కమిటీ, నియోజకవర్గ సభ్యులు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసి శాలువతో సత్కరించి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, బత్తుల ప్రమీల, జె.సుబ్బులు, ఇందిర, సాదం విజయలక్ష్మి, ఎస్.నిర్మల, కోటేశ్వరమ్మ, ఎస్‌కే.సగీనా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి

ఒంగోలు(కార్పొరేషన్): నగరంలో పారిశుధ్యంపై ఫిర్యాదులు వస్తున్నాయని, పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య విభాగం అధికారులు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, సిబ్బంది, కార్మికులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యంపై పదేపదే ఫిర్యాదులు అందుతున్నాయని, ఇకనైనా పనితీరు మార్చుకుని నగరాన్ని అందంగా తీర్చిదిద్దడానికి పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనరు ఎం.వెంకటేశ్వరరావు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

దామచర్ల రిపబ్లిక్ డే శుభాకాంక్షలు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 25 : జిల్లా ప్రజలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ రిపబ్లిక్‌డే శుభాకాంక్ష తెలిపారు. వైసీపీ ప్రభుత్వానికి గణతంత్ర దినోత్సవం జరుపుకునే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో అడ్డగోలు విధానంతో, చీకటి జీవోలతో రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. శుక్రవారం ఉదయం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్ల ధర్నా


ధర్నాలో పాల్గొన్న పెన్షనర్లు

చీమకుర్తి, జనవరి 25: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ధర్నా నిర్వహించారు. అడిషనల్ క్వాంటమ్‌ను పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను చెల్లించాలని, 11వ పీఆర్సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని, హెల్త్‌కార్డ్ ద్వారా అన్ని వ్యాధులకు వైద్యం అందించాలని, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ పరిధిని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి లక్ష్మీనారాయణ, సెక్రటరీ బి.డేవిడ్, జానీ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి


ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, పాఠకులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 25: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, దాని విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ విశ్రాంత రీజనల్ ఆర్డీ కరణం రాఘవ రావు పేర్కొన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అధ్యక్షతన ఆయన సిబ్బంది, పాఠకులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజెప్పేందుకు ప్రతి సంవత్సరం జనవరి 25ను జాతీయ ఓటరు దినోత్సవం జరుపుకున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్య పునాదులను పటిష్ఠం చేయటానికి, తమకు మేలు చేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవటానికి రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన గొప్ప ఆయుధం ఓటు అని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, కె.కృష్ణవేణి, ఎం.శ్రీనివాసులు, పి.ఇమ్మానుయేలు, జి.శ్యాంసన్, స్మైలీ, అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రోడ్డునపడ్డ కార్మికులు

టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు ధ్వజం ● ఒంగోలుకు చేరిన చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్ర


నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న రామరాజు

ఒంగోలు (కార్పొరేషన్) జనవరి 25 : వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులు బజారున పడ్డారని, కార్మికుల పాలిట కరోనా జగన్మోహన్‌రెడ్డి అని తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కార్పొరేషన్ (టీఎన్‌టీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రామరాజు ధ్వజమెత్తారు. యూనియన్ ఆధ్వర్యంలో టెక్కలి నుంచి కుప్పం వరకు చేపట్టిన చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర గురువారం ఒంగోలు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక విష్ణుప్రియ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక రేట్లు పెంచేశారన్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులు, దాని అనుబంధ కార్మికులైన 126 రకాల వృత్తి పనుల వారు బజారున పడ్డారన్నారు. నేడు రాష్ట్రంలో అన్ని వర్గాల కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో, చాలీచాలని కూలీలతో అల్లాడిపోతున్నారన్నారు. కనీస రుణాలు కూడా ఇవ్వకుండా సైకో పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు హయాంలో కార్మికులకు స్వర్ణయుగం అయితే, జగన్ పాలనలో రాతియుగంలా మారిందన్నారు. రాష్ట్రంలో సైకో పాలనకు చరమ గీతం పాడాలని కోరారు. అధికార పార్టీల వారికి ఇసుక మైనింగ్‌లు కట్టబెట్టడంతో నేడు సామాన్యులకు ఇసుక దొరికే పరిస్థితి లేదన్నారు. అంతేగాకుండా ఆర్టీసీ చార్జీలు, చెత్తపై పన్నులు, పెట్రోలు, కరెంటు బిల్లులు పెంచేసిన దుర్మార్గపు ముఖ్యమంత్రి జగన్ పాలనకు ముగింపు పలకాలన్నారు. తెలుగుదేశం పాలనలో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటుతో పాటు ప్రమాద బీమా, కార్మికుడు ఆరోగ్యానికి, వారి పిల్లల వివాహాలకు ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగినేని రామారావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలోని కార్మికవర్గం ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై టీఎన్‌టీయూసీ బస్సు యాత్ర కొనసాగుతుందన్నారు. తమ యాత్రలో కార్మికులను కలిసి వారి సమస్యలను గుర్తించి, రాబోయే టీడీపీ ప్రభుత్వంలో అమలు చేయాల్సిన పథకాలను చంద్రబాబుకు వివరిస్తామని తెలిపారు. అంతకు ముందు స్థానిక కర్నూలు రోడ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి బస్సు యాత్ర నగరంలో పర్యటించడంతోపాటు, టీఎన్‌టీయూసీ ప్రతినిధులు కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జోన్ ఇన్‌చార్జులు కొంగటి లెనిన్‌బాబు, ఫణీశ్వరరావు, అంబూరు సింధుజ, పార్లమెంట్ అధ్యక్షులు కొక్కెర నాగరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జెట్టి వెంకటేశ్వర్లు, మల్లయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.

'కొండపి నా రాజకీయ భవిష్యత్‌కు పరీక్ష'

గెలుపోటములు దైవాధీనం
వైసీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి సురేష్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

టంగుటూరు, జనవరి 25 : కొండపి నియోజకవర్గం నా రాజకీయ భవిష్యత్‌కు ఒక పరీక్ష అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. టంగుటూరులో గురువారం నిర్వహించిన మండల వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్ పంపగా తాను కొండపి సమన్వయకర్తగా వచ్చానని, తాను పార్టీ పంపిన సైనికుడనని చెప్పారు. గెలుపోటములు దైవాధీనమని, ఈసారి వైసీపీ కార్యకర్తలు కొండపిలో చరిత్ర తిరగరాయనున్నారని తెలిపారు. వైసీపీ పొత్తు జనంతోనేనని చెప్పారు. సమావేశం ముగియగానే పార్టీ క్యాడర్ ఒక్కొక్కరితో సురేష్ ప్రత్యేకంగా గదిలో మాట్లాడారు. కార్యక్రమానికి కారుమంచి మాజీ సర్పంచ్ ఆనం సత్యనారాయణరెడ్డి అధ్యక్షత వహించగా, ఎంపీపీ కోటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ సుమన్, వైసీపీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు అరుణకుమారి, జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, ఏఎంసీ డైరెక్టర్లు కొమ్ము సురేంద్ర, టంగుటూరి రామకృష్ణ, అనంతవరం ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, పార్టీ ప్రచార విభాగం నేత మన్నం వెంకయ్యలు ఉపన్యసించారు.

దాసరి ప్రసంగాన్ని అడ్డుకున్న శ్రేణులు

మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు దాసరి సుబ్బారావు వేదిక పైకి ఆహ్వానించకపోయినా పార్టీలో తనకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తానని కోరారు. దీనికి సత్యనారాయణరెడ్డి మంత్రి మాట్లాడాక అవకాశం ఇస్తామని చెప్పారు. తన వేదన మంత్రి వినాలని దాసరి పట్టుబట్టడంతో అనుమతించారు. వేదిక ఎక్కిన దాసరి మాట్లాడుతూ తాను పార్టీ ప్రారంభంలోనే ఎక్కువమంది కార్యకర్తలతో మాజీ మంత్రి బాలినేని సమక్షంలో వైసీపీలో చేరానని గుర్తుచేశారు. అలా గత విషయాలు చెబుతుండగా వేదికపై ఉన్న నేతలు అభ్యంతరం చెప్పారు. ఇంతలో మంత్రి సురేష్ కల్పించుకొని సమావేశం ముగిశాక చర్చిద్దామని నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

సెర్ప్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

● కలెక్టరేట్ ఎదుట ధర్నా



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఒంగోలునగరం, జనవరి 25: తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టిన సెర్ప్ ఉద్యోగులు గురువారం ఒంగోలులో స్థానిక ప్రగతిభవనం నుంచి కలెక్టరేట్ వరకు సాగింది. సెర్ప్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరుతూ ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చర్చి సెంటర్ వద్ద మానవహారాన్ని ఏర్పాటు చేశారు. సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించి తమను రెగ్యులర్ చేసి పేస్కేలు అమలు చేయాలని కోరారు. అనంతరం ఉద్యోగులు ప్రకాశంభవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కొండారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించే దాకా ఉద్యమాన్ని ఆపవద్దని పిలుపునిచ్చారు. ఉద్యోగుల కోర్కెలను తీర్చే వరకు ఆందోళనకు సీఐటీయూ మద్దతు ఉంటుందని తెలిపారు. సెర్ప్ ఉద్యోగుల జేఏసీ నాయకులు నరేంద్ర మాట్లాడుతూ వైఎస్సార్‌కేపీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు చాలీచాలనీ వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ సమస్యలను గతంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోగా రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి పట్టించుకోలేదన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎజ్రా, జి.రాంబాబు, గోపీనాథ్, కోటశ్వరరావు, నారాయణ, కృపారావు, డేవిడ్, సీఐటీయూ నాయకులు బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన కల్పించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్


రికార్డుల భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(క్రైం), జనవరి 25: రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవహగాన పెంపొందించుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక ప్రకాశంభవన్ వద్ద ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా జనవరి 20 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ఏడాదితో పోల్చితే రోడ్డుప్రమాదాలలో మరణాల శాతం 15, క్షతగాత్రులు 30శాతం తగ్గిందని వెల్లడించారు. మద్యం తాగి వాహనాలు నడపటం, అతివేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. దీంతో ప్రమాదాలు జరిగిన ప్రాంతాన్ని ఫొటోలు తీసి ఐర్యాడ్ యాప్‌లో అప్‌లోడ్ చేసి ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, రవాణా శాఖ ఉపకమిషనర్ సుశీల, రిమ్స్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్ పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల భవనం ప్రారంభం

స్థానిక ప్రకాశంభవన్‌లో నూతనంగా నిర్మించిన రెవెన్యూ రికార్డు భవనాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం ప్రారంభించారు. రూ.15 లక్షల వ్యయంతో ఆరు నెలల కాలంలో ఈ భవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో డీఆర్వో ఆర్.శ్రీలత, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.భాస్కర్ బాబు, ఏవో చిరంజీవి పాల్గొన్నారు. అనంతరం ప్రకాశంభవన్ మొదటి అంతస్తులో సి, డి సెక్షన్ల కోసం ఆధునికీకరించిన గదులను కలెక్టర్ ప్రారంభించారు.

అవీ..ఇవీ..

ఒంగోలు రూరల్ సీఐగా రాజమోహన్ బాధ్యతలు


ఎస్పీ మలికగర్గ్‌కు బొకేను అందజేస్తున్న రాజమోహన్

ఒంగోలు(క్రైం), జనవరి 25 : ఒంగోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.రాజమోహన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ మలిక గర్గ్, అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ మరియదాస్‌లను కలిసి బొకేలు అందజేశారు. అదేవిధంగా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న టి.విజయకృష్ణ ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

చీమకుర్తి ఇన్‌చార్జి సీఐగా..

చీమకుర్తి ఇన్‌చార్జి సీఐగా ఒంగోలు సీఐ రాజమోహన్‌ను నియమిస్తూ ఎస్పీ మలికగర్గ్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇటీవల చీమకుర్తి పోలీస్‌స్టేషన్ స్థాయి పెంచి ఎస్‌హెచ్‌వోగా ఇన్‌స్పెక్టర్ హోదా కల్పించారు. ఇప్పటి వరకు ఒంగోలు రూరల్ సర్కిల్‌లో ఉన్న చీమకుర్తి ఇక నుంచి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్ విధులు నిర్వహిచాలి. ఈ మేరకు రాజమోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఓటు ప్రాధాన్యతను యువత తెలుసుకోవాలి

● రాజ్యసభ సభ్యుడు రబియా


సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ రబియా

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 25: కొత్తగా ఓటు హక్కు పొందిన యువత దాని ప్రాధాన్యతను తెలుసుకోవాలని రాజ్యసభ సభ్యుడు నాభం రబియా పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల ఆవరణలో గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో నూతన ఓటర్లతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన లైవ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అక్కడ జరిగిన సభలో నాభం రబియా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో దేశ అభివృద్ధికి తోడ్పడే వారికి అండగా నిలువాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న యువత నూరుశాతం ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, ఈదర మోహన్, తోగంటి శ్రీనివాసరావు, అశోక్, నరేష్, నాగేశ్వరరావు, డాక్టర్ కొమ్మి నరసింహారావు, పువ్వాడ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలి



మొక్కను నాటిన వీసీ అంజిరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 25 : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్క విద్యార్థి కృషి చేయాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీ మారెడ్డి అంజిరెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులోని యూనివర్సిటీ ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మండే హర్షప్రీతం కుమార్‌దేవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంజిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ సహాయక ఆచార్యులు సి.వెంకటరావు, ఆర్.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ సయ్యద్‌అసీవుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

మాదాల శ్రీనివాసరావుకు నివాళి

సంతనూతలపాడు, జనవరి 25: సంతనూతలపాడు గ్రామ టీడీపీ ప్రధానకార్యదర్శి మాదాల శ్రీనివాసరావు నిరంతరం పార్టీ అభివృద్ధికి కృషి చేశారని పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు పేర్కొన్నారు. గురువారం మాదాల శ్రీనివాసరావు పెదకర్మకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తన్నీరు శ్రీను, మందాడి వెంకటేశ్వర్లు, ఎం.శ్రీను, ఎస్.శ్రీరామ్మూర్తి, సీహెచ్.శ్రీనివాసరావు, మాధవిలత, సురేష్, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, పెద్దబోస్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలోనే సంతృప్తి


అన్నదానం ప్రారంభిస్తున్న రామారావు

ఒంగోలు(కల్చరల్), జనవరి 25: సమాజానికి శక్తి మేరకు సేవ చేయటంలోనే ఎంతో సంతృప్తి ఉందని రత్నమహల్ థియేటర్ అధినేత ఆలపాటి రామారావు పేర్కొన్నారు. గురువారం తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రిమ్స్ ఆస్పత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి నెలా పౌర్ణమి రోజున అన్నదానం చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, డాక్టర్ మొగిలి దేవ, జి.శివ, బసవపున్నయ్య, దన్నారపు మస్తాన్‌రావు, రామయ్యచౌదరి, రామకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణా కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాగుంట రాఘవరెడ్డి

సింగరాయకొండ, జనవరి 25 : మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పకీరుపాలెంలో మాగుంట రాఘవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ఎంపీ మాగుంట తనయుడు రాఘవ రెడ్డి గురువారం ప్రారంభించారు. 16 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను అందజేశారు. అనంతరం పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సామాజిక పింఛన్ల పెంపుతో ఆసరా

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి 25: సామాజిక పింఛన్ల పెంపుతో లబ్ధిదారులకు ఎంతో ఆసరా లభిస్తుందని రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు సభ్యుడు పెద్దపోగు కోటేశ్వరరావు పేర్కొన్నారు. నాగులుప్పలపాడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం పింఛన్ల పెంపుపై సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

మైనంపాడు విద్యార్థినుల ప్రతిభ

సంతనూతలపాడు, జనవరి 25: సంతనూతలపాడులోని ఇండోర్‌స్టేడియంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి షటిల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా మైనంపాడు డైట్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థినులను, కోచింగ్ ఇచ్చిన పీఈటీ రవికుమార్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ డి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారుణులతో ఉపాధ్యాయులు

రాష్ట్రంలో అరాచకం, విధ్వంసమే!

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజం



పర్చూరు, జనవరి 25: వైసీపీ ప్రభుత్వంలో అక్కా చెల్లెమ్మలకు అసరా కరువైందని, టోకరాగానే మిగిలిందని, రాష్ట్రంలో అభివృద్ధి తప్ప అరాచకం, విధ్వంసమే కొనసాగుతుందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజమెత్తారు. ఈమేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నాడు అధికారం కోసం, నేడు అధికారంలోకి వచ్చాక కల్లబొల్లి మాటలతో మహిళలను నిట్టని లువునా మోసం చేస్తున్నార న్నారు. రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉంటే 79 లక్షల మందికే ఆసరా అంటూ సకాలంలో డ్వాక్రా రుణాలను చెల్లించిన 75శాతం మహిళలకు టోకరా వేయటం మోసం కాదా అని ఏలూరి సాంబశివరావు ప్రశ్నించారు.

నిత్యావసర వస్తువుల ధరలు, అప్పులు, పన్నుల చార్జీలతో ఒక్కో కుటుంబంపై రూ.8లక్షల భారం మోపా రన్నారు. మద్యపాన నిషేధమని చెప్పి అధికారం లోకి వచ్చాక నాసిరకం మద్యంతో మహిళల మంగళసూత్రాలను బలిగొం టున్నారని ఆరోపించారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు అడ్డాగా రాష్ట్రాన్ని మార్చారని మండి పడ్డారు. రానున్న ఎన్ని కల్లో మహిళలు సంఘటితంగా అహంకార, విధ్వంస ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు.

వైసీపీకి నీలం శామ్యూల్ మోజెస్ రాజీనామా

చీరాల, జనవరి 25: వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నీలం శామ్యూల్ మోజెస్ పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధ్యక్షుడికి తన రాజీనామా లేఖను పంపినట్టు తెలిపారు. పలు అంశాలలో తగిన రీతిలో స్పందన లేకపోవటంతో పార్టీ పదవికి రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఏలూరి జన్మదిన వేడుకలు

మార్టూరు, జనవరి 25: తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు 47వ జన్మదిన వేడుకలను శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లుచేశారు. ఉదయం 10 గంటలకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మార్టూరులోని పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం ద్విచక్రవాహనాలపై ర్యాలీగా మార్టూరులో తూర్పు బజారున వినాయకుని విగ్రహం వద్దకు చేరి అక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడినుంచి పడమర బజారు గుండా ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పిస్తారు. అనంతరం ఏలూరికి జన్మదిన శుభా కాంక్షలను తెలియచేస్తూ కేక్ కట్ చేస్తారు. మధ్యాహ్నం భారీగా అన్నదానం ఏర్పాటుచేశారు. జన్మదిన కార్యక్రమాలకు ఏలూరి అందుబాటులో ఉండరని పార్టీ నాయకులు తెలిపారు. మండలంలోని ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వలపర్ల గ్రామంలో కొమ్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తమ అధికారి అవార్డు

చీరాల, జనవరి 25: మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని చీరాల నియోజకవర్గంలో ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారిగా గుర్తించారు. గురువారం బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా రామచంద్రారెడ్డి అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా పలువురు అభినందించారు.

ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కొండపి, జనవరి 25 : కొండపిలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు గురువారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ చేశారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి విద్యార్థులకు తహసీల్దార్ పోపూరి శింగారావు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను తహసీల్దార్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.వి. రమణమూర్తి, ఎంఈవోలు కె.సురేఖ, పి.రామారావు, డిప్యూటీ తహసీల్దార్ సుజాత, ఆర్ఐ సుధాకర్, ఎన్నికల డీటీ హనుమంతరావు, కొండపి గ్రామ పంచాయతీ కార్యదర్శి బిళ్లా అంకయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విక్టోరియారాణి పాల్గొన్నారు. అలాగే స్థానిక గ్రంథాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గ్రంథపాలకుడు బత్తుల కోటేశ్వరరావు పాఠకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ రావూరి నాగేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు ఇడపలపాటి సుబ్బారావు, యనమద్ని చినలక్ష్మయ్య, పెరిదేపి మాజీ సర్పంచ్ గుమ్మళ్ల వెంకటేశ్వర్లు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ బాబూరావు పాల్గొన్నారు. కె.ఉప్పలపాడు గ్రామంలో.. కె.ఉప్పలపాడు గ్రామంలో 159వ పోలింగ్ బూత్ వద్ద బీఎల్వో ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

కుర్చీ నాదే!



● ఉద్యోగోన్నతి కోసం ఓ అధికారి అడ్డదారి
● పోస్టింగ్ కోసం తాడేపల్లి చుట్టూ ప్రదక్షిణలు
● డిప్యుటేషన్ సమయంలో భారీగా అక్రమార్జన
● రూ.50లక్షల సూట్‌కేసుతో రాజధానిలో మకాం

పుల్లలచెరువు, జనవరి 13 : ఆయన ఓ శాఖలో చిన్నస్థాయి అధికారి. కానీ అధికార పార్టీలో మాత్రం పెద్దస్థాయిలో పలుకుబడి ఉంది. నేతల అండదండలతో వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే ఉద్యోగోన్నతి పొందారు. వాస్తవంగా ఆయనకు ఆ అర్హత లేనప్పటికీ, డిప్యుటేషన్‌పై పైస్థాయికి వెళ్లారు. ఆతర్వాత నియోజకవర్గంలో అన్నీ తానై చక్రం తిప్పాడు. నియోజకవర్గంలో నీళ్లు పారించలేకపోయినా, కాగితాల్లో మాత్రం నిధులు పారించి పెద్దమొత్తంలో వెనకేసుకున్నట్లు ఆయనపై ఆరోపణలున్నాయి. దీంతో అయ్యగారిపై అధికారపార్టీలోని సీఎం సామాజికవర్గం నేతల్లో అసంతృప్తి పెరిగింది. అయితే ప్రస్తుతం ఆయన డిప్యుటేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. ఈయనకు దన్నుగా ఉన్న నేత కూడా మరో నియోజకవర్గానికి వెళ్లారు. ఇప్పుడు అనివార్యంగా తిరిగి ఆయన కిందిస్థాయికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇన్నాళ్లూ ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న తీరుగా ఆయన వ్యవహారం నడవగా, ప్రస్తుతం అంతా మారిపోయింది. దీని నుంచి బయటపడేందుకు తాడేపల్లి పెద్దల వద్దకు పయనమయ్యాడు. ఒట్టి చేతులతో వెళితే పెద్దగా ప్రయోజనం ఉండదని గ్రహించి గట్టి చేతులతోనే ఆయన తాడేపల్లిలో పాగా వేశాడు. పైగా లౌక్యం తెలిసిన వ్యక్తి. పచ్చనోట్లను ఎలాగైన పరిచి ఉద్యోగోన్నతి పత్రంతో తిరిగి రావాలని కంకణం కట్టుకున్నాడు. రూ.50 లక్షల మేర ముట్టజెప్పేందుకు ఆయన సిద్ధపడినట్లు తెలిసింది. తన మాట వినే ప్రజాప్రతినిధి సిఫారసు ద్వారా ఉద్యోగోన్నతి పొందేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇక జిల్లాలో ఆ శాఖలో ఆయనపై ఉండే అధికారిని కూడా ఈ పాటికే ప్రసన్నం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లాకు చెందిన ఆ శాఖ ఉన్నతాధికారి కూడా భారీగా ముడుపులు అందుకొని ఆయన ఉద్యోగోన్నతికి పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన ఆ శాఖలో ఇప్పటికే పెండింగ్ బిల్లులు భారీగా ఉన్నాయి. ఒక్కసారి ఉద్యోగోన్నతి వస్తే పైవారికిచ్చే రూ.50లక్షలు కొద్దిరోజుల్లో తిరిగి సంపాదించుకోవచ్చని ఆయన ఆశలు పెట్టుకున్నట్లు తెలిసింది. అయితే ఆయనకు ఉద్యోగోన్నతి రాకుండా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని సీఎం సామాజికవర్గం నేతలు అడ్డుపడుతున్నారు. ఆ అధికారికి ఉద్యోగోన్నతి ఇవ్వొద్దని జిల్లాకు చెందిన ముఖ్యనేతకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మరి ఆ అధికారి నుంచి ముడుపులు తీసుకొని ఉన్నతాధికారులు ఉద్యోగోన్నతి ఇస్తారో, లేదో వేచిచూడాల్సిందే.

ఇతరులకు ప్రవేశం లేదు..

కీలకమైన ఆ శాఖకు ఇటీవల విజయవాడకు చెందిన ఓ మహిళా అధికారి బదిలీపై వచ్చారు. ఆమెను రెగ్యులర్ అధికారిగా నియమించారు. అయితే ఆ కుర్చీపై ఆశ పెట్టుకున్న సదరు అధికారి 26 రోజులకే ఆ మహిళా అధికారిని బలవంతంగా సెలవు పెట్టించారని ఆ శాఖ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. ఇప్పటివరకు ఆయనకు దన్నుగా ఉన్న ముఖ్యనేతే ఆమెతో సెలవు పెట్టించారని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో అక్కడ ప్రస్తుతం పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ, కొత్త వారు ఆ వైపు చూడడం లేదు. అనుమతి లేకుండా ఆ పోస్టులో చేరితే అనంతరం వివాదాలు కొనితెచ్చుకోవాల్సి వస్తుందని మిగిలిన అధికారులు కూడా జంకుతున్నారు.

పర్సెంటేజీ లేనిదే ఫైలు ముట్టుకోరు?

తాను ఇన్‌చార్జీగా బాధ్యతలు నిర్వహించిన కాలంలో పైసా లేనిదే ఫైలు ముట్టుకోరు. కార్యాలయంలోనే మధ్యవర్తులను పెట్టుకొని వారితో దర్జాగా డబ్బులు వసూలు చేయించారు. మంచినీటి ట్యాంకర్లు, బోర్ల బిల్లులు, జలజీవన్ మిషన్‌కు కనీసం ఆయన వాటాగా 10శాతం లేనిదే ఫైలు కూడా చూడకుండానే కొర్రీలు పెడతారనే పేరుంది. డబ్బులు ఇస్తే మాత్రం అర్ధరాత్రి అయిన పనిపూర్తి చేసి ఇచ్చేస్తారు. నాలుగేళ్ల కాలంలో సుమారు రూ.5కోట్లకు పైగానే కుడబెట్టాడని వైసీపీ నేతలే చర్చించుకుంటున్నారు. వైసీపీ నియోజకవర్గ స్థాయి నాయకులైనా ఆయన ముందు బలాదూరే అని వారే చెప్పడం కొసమెరుపు.

వైసీపీని వీడిన 30 కుటుంబాలు

» ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన తుమ్మకుంట బీసీలు



ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన తుమ్మకుంట గ్రామస్థులు

కనిగిరి, జనవరి 25 : వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో గురువారం మండలంలోని తుమ్మకుంట గ్రామానికి చెందిన బీసీ వర్గాలువారు పెద్ద ఎత్తున చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ జగన్‌రెడ్డి అసమర్థ పాలనపట్ల ప్రజలు విసుగుచెందారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మి భారీగా టీడీపీలో చేరుతున్నారన్నారు. వైసీపీ పాలనలో అణగారినవర్గాల వారిని నానా ఇబ్బందులకు గురి చేశారన్నారు. కనిగిరి ప్రాంతంలో వైసీపీ పాలనతో పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు. టీడీపీ పాలనలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని ఉగ్ర గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజా సంక్షమాన్ని కాంక్షించి 5 ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. తాగు, సాగు నీటి ఇబ్బందులు తొలగించి, ఉపాధి, పరిశ్రమలు కల్పనకు కృషి చేస్తానన్నారు. ట్రిపుల్ ఐటీ, నడికుడి రైల్వే లైన్ సాధిస్తానన్నారు. వరుసగా పార్టీలో చేరుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. అందరూ ఐక్యతతో పార్టీ విజయానికి శ్రమించాలని ఉగ్ర కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

కనిగిరి మండలంలోని తుమ్మకుంట గ్రామానికి చెందిన బీసీ వర్గాలు 30 కుటుంబాల వారు వైసీపీని వీడారు. వారంతా ఉగ్ర సమక్షం లో టీడీపీలో చేరారు.

చేరిన వారిలో ఈర్ల వెంకటేశ్వర్లు, ఈర్ల శ్రీను, ఇండ్లా బాలకృష్ణ, గోగు ఆంజనేయులు, చెన్నకేశవులు, రంగయ్య, చిన్నయ్య, గురవ్వడు, బ్రహ్మయ్య, నాగయ్య, సుబ్బయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు. వారందరికీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పొన్నలూరులోని ప్రధాన రోడ్డులో ఏర్పడ్డ గోతిపై కంప అడ్డుగా పెట్టిన దృశ్యాన్ని చూపిస్తున్న మనోజ్‌కుమార్

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

పొన్నలూరు(కొండపి), జనవరి 25 : వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త కనపర్తి మనోజ్‌కుమార్ విమర్శించారు. పొన్నలూరు గ్రామంలోని జడ్పీటీసీ సభ్యుడి ఇంటికి సమీపంలోని రోడ్డులో ఏర్పడ్డ గోతిపై అడ్డుగా చిల్ల కంపను వేసిన దృశ్యాన్ని ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన గురువారం ఉదయం గోతివద్ద నిరసన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో జనసేన నాయకులు కర్ల తిరుమలరెడ్డి, రామరాజు, నవీన్, ప్రేమ్, భరత్, బాలు, లక్ష్మణ్, చందు, రామకృష్ణ, రవిబాబు, సంతోష్, భానుచంద్ర పాల్గొన్నారు.

బీసీలకు టీడీపీ అండ

కురిచేడు, జనవరి 25: బీసీలకు అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య అన్నారు. కురిచేడు మండల అధ్యక్షుడు నెమిలయ్య అధ్యక్షతన జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లులు హాజరయ్యారు. సినిమా హాలు సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం గురునాథం అధ్యక్షతన జయహో బీసీ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్థాయి బీసీ నాయకులు, నాయులు పాల్గొన్నారు.



గోనాకు నియామకపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ ఉగ్ర

టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోనా

కనిగిరి, జనవరి 25 : టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా గోనా ప్రతాప్ నియమితులయ్యారు. ఈ మేరకు అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి నియామకపత్రాన్ని అందచేశారు. ఉగ్ర మాట్లాడుతూ యువకుడు, ఉత్సాహవంతుడైన గోనా ప్రతాప్ నియామకం అభినందనీయమన్నారు. తనకు అవకాశం ఇప్పించిన డాక్టర్ ఉగ్రకు గోనా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, టీడిపి సీనియర్ నాయకులు భేరి పుల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేలైన్ భూముల పరిశీలన

పామూరు, జనవరి 25 : నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్ భూములను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. మండలంలోని రావిగుంటపల్లి, ఇనిమెర్ల, నర్రమారెళ్ల గ్రామాల్లో రైల్వేలైన్ నిర్మాణం కోసం సేకరించిన భూములను ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్‌తో కలిసి పరిశీలించారు. రైల్వేలైన్ అలైన్‌మెంట్ గురించి తెలుసుకొన్నారు. భూములిచ్చే రైతులతో మాట్లాడారు. భూములు కోల్పోయిన రైతులకు రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ ప్రకారం పరిహారం అందిస్తామని జేసీ తెలిపారు. రైల్వేలైన్ పనులు వేగవంతంగా సాగుతున్నాయని త్వరలో ఇక్కడ కూడా ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆవుల సురేష్, వీఆర్వో రఫిఅహ్మద్, సర్వేయర్ అమరన్ పాల్గొన్నారు.



అడుదాం ఆంధ్రాలో అపశ్రుతి

● కబడ్డీ ఆడుతూ కిందపడిన మంత్రి నాగార్జున
● విరిగిన కుడిచేతి రెండు వేళ్లు
● చీమకుర్తి ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యసేవలు

చీమకుర్తి, జనవరి 25: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. కబడ్డీ ఆడుతూ కింద పడి మంత్రి నాగార్జునకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా చీమకుర్తి ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో గురువారం నియోజకవర్గ స్థాయి పోటీల ఫైనల్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేయటానికి ఆయన హాజరయ్యారు. ఒకప్పుడు కబడ్డీలో యూనివర్సిటీ స్థాయి క్రీడాకారుడైన మంత్రి నాగార్జున గతాన్ని నెమరువేసుకుంటూ ఆటగాళ్లను ఉత్సాహపరచటానికి ఫైనల్ పోటీలో సరదాగా ఆడారు. రైడింగ్‌కి వెళ్లిన మంత్రి నాగార్జున పాయింట్ తీసుకొచ్చే క్రమంలో జారి కిందపడటంతో కుడిచేతికి ఉంగరాలు పెట్టుకున్న రెండు వేళ్లకు గాయమైంది. వెంటనే తేరుకున్న అంగరక్షకులు, క్రీడాకారులు మంత్రిని పైకి లేపారు. వెంటనే సమీపంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు రెండు వేళ్లకు ఫ్రాక్చర్ అయినట్లు గుర్తించి తగు వైద్యసేవలు అందించారు. తదుపరి నాగార్జున విశ్రాంతి నిమిత్తం ఒంగోలుకు తరలివెళ్లారు. పలువురు ముఖ్య నాయకులు నాగార్జునకు ఫోన్‌చేసి పరామర్శించారు.



పొందూరులో పొగాకు తోటలను పరిశీలిస్తున్న టుబాకో బోర్డు అధికారులు

పక్వానికి వచ్చిన ఆకులనే తుంచాలి

పొందూరు(టంగుటూరు), జనవరి 25 : పూర్తిగా పక్వానికి వచ్చిన పొగాకు ఆకులను మాత్రమే తుంచి అల్లి బ్యారన్‌లో అమర్చాలని టంగుటూరు పొగాకు వేలం కేంద్రం సూపరింటెండెంట్ అట్లూరి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని పొందూరులో గురువారం పొగాకు రైతులకు అవగాహనా కార్యక్రమం జరిగింది. క్యూరింగ్‌లో మెలకువలను వివరించారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులు టార్పాలిన్ పట్టలను తీసుకుపోవాలని కోరారు. కార్యక్రమంలో ఐటీసీ శాస్త్రవేత్త వెంకటేశ్వరావు ఐటీసీ ప్రతినిధి వెంకట్రావు, పొగాకు బోర్డు క్షేత్ర సహాయకుడు ఏబీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

జేసీ శ్రీనివాసులు



కనిగిరిలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు, పీసీపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కనిగిరి, జనవరి 25 : ఓటు వేయడం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కుగా వినియోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కే.శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వ హైస్కూల్‌లో గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జేసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మెరుగైన సమాజం కోసం ఓటే సరైన ఆయుధం అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేస్తే సరైన నాయకుడు ఎన్నిక అవుతారన్నారు. నోటు తీసుకుని ఓటు వేయడం ప్రజాస్వామ్యానికి చేటు అన్నారు. విజ్ఞతతో ఓటు వేస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండలంలోని తుమ్మకుంట గ్రామానికి చెందిన నడిపంల్లి అంగన్‌వాడీ కార్యకర్త కొండమ్మకు బెస్ట్ అవార్డు ప్రకటించి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఇర్విన్, తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీవో మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, సీఐ శివరామకృష్ణారెడ్డి, సీడీపీవో ఇవాంజిలిన్, ఎంఈవో యానారాయణరెడ్డి, హెచ్ఎం సంజీవి పాల్గొన్నారు.

పామూరు : ఓటు వజ్రాయుధం లాంటిదని, 18 ఏళ్ల నిండిన యువతీయువకులు ఓటు హక్కును పొందాలని డిప్యూటీ తహసీల్దార్ పీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామస్వామి, వీఆర్వోలు పాల్గొన్నారు.

పీసీపల్లి : ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ప్రవీణకుమార్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని పెదయిర్లపాడులో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని బస్టాండు కూడలిలో ఓటర్లు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ2 అర్.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుభాన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

దర్శి : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ గుత్తా శోభన్‌బాబు, ఎంఈవో కె రఘురామయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముండ్లమూరు : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎన్నికల అధికారి లోకేశ్వరరావు కోరారు. నాయుడుపాలెం పంచాయతీ తమ్మలూరులో ఓటర్ల జాబితాను పరిశీలించారు. కార్యక్రమం లో వీఆర్వో బ్రహ్మతేజ, దేవకాంత్ ఉన్నారు.

తాళ్లూరు : తాళ్లూరులో తహసీల్దార్ కేపీ ప్రసాద్ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డీటీ ఇమ్మానియేల్‌రాజు, వీకే జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఎలక్షన్ ఆపరేటర్ సుజాత, భవానీ, అధ్యాపకులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.



వైసీపీని గద్దె దించుదాం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు
- గంటంవానిపల్లెలో బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ



భవిష్యత్తుకు గ్యారెంటీ పత్రాలు ఇస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, జనవరి 25: పదే పదే మాయ మాటలు చెప్పే అబద్దాల వైసీపీని గద్దె దించుదామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని గంటవానిపల్లెలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిర్వీర్యమ య్యాయన్నారు. అంతేగాక సామాన్యుల నడ్డి విరిచే విధంగా ధరలు పెరిగాయన్నారు. ప్రతి గ్రామంలో కనిపిస్తున్న సిమెంట్ రోడ్లు టీడీపీ హయాంలోనే ఏర్పాటు చేశారన్నారు. రానున్న ఎన్నికల అనంతరం టీడీపీ ప్రభుత్వం వస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండ పూర్తి, మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతేగాక మహిళలకు ఆర్‌టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు సిలెండర్లు ఉచితంగా ఇస్తారన్నారు. కుటుంబంలో ఎంతమంది ఆడపిల్లలున్నా ఒక్కొక్కరికి నెల నెలా రూ.1500లు, ఏడాదికి రూ.15,000లు అందజేసి తోడ్పాటు అందించనున్నట్లు తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా రూ.20,000లు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రజలు టీడీపీకి మద్దతుగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అనంతరం బాబుష్యూరిటీతో కూడిన బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఎలకపాటి చంచయ్య, దేసు నాగేంద్రబాబు, బట్టు సుధాకర్ రెడ్డి, ఆర్ సుబ్బరత్నం, షేక్ ఇస్మాయిల్, ప్రకాశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



రాయవరంలో బాబుష్యూరిటీ బాండ్లు అందజేస్తున్న నాయకులు

కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి

కొనకనమిట్ల : రానున్న ఎన్నికల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా సమష్టిగా కృషి చేయాలని, టీడీపీ మార్కాపురం ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని చినారికట్ల, పెదారికట్ల గ్రామాల్లో గురువారం బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టనున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మోరబోయిన బాబురావు, చప్పిడి రామలింగయ్య టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని రాయవరం గ్రామంలో గురువారం 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ నాయకుడు రోహిత్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు జవ్వాజి రామానుజులరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసీపీ అరాచకాలను వివరించారు. సైకో ప్రభుత్వం పోవాలి సైకిల్ ప్రభుత్వం రావాలన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందుల నారాయణరెడ్డిని గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోనికి వస్తే అమలయ్యే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్ : అన్ని రంగాలలో విఫలమైన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మీ అన్నారు. స్థానిక 3వ వార్డు డ్రైవర్స్ కాలనీలో 'బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మీ మాట్లాడుతూ ప్రజలను అన్ని విధాలుగా ఇబ్బందులు పెడుతూ జగన్ ప్రభుత్వం సాగిస్తుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ-జనసేన కూటమిని ప్రజలు ఆదరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ, అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, కౌన్సిలర్ నాలి కొండయ్య, పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు మర్రి రూన్సీ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

మొక్కుబడిగా ఉద్యోగుల శిక్షణ



శిక్షణ పొందుతున్న సచివాలయ ఉద్యోగులు

మార్కాపురం రూరల్ జనవరి 25: మార్కాపురంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు భూముల రిజిస్ట్రేషన్‌లపై శిక్షణ కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహించారు. గ్రామ వార్డు సచివాలయాల వద్ద ఇక నుంచి భూముల, స్థలాల రిజిస్ట్రేషన్ నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా సచివాలయ ఉద్యోగులకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే ఆ కార్యాలయంలో శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా మీటింగ్ హాలు లేదు. దీంతో కంప్యూటర్ వద్ద నలుగురు ఉద్యోగులను నిలబెట్టి మొక్కుబడిగా శిక్షణ ఇచ్చి పంపించేస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి అర్థమైనా కాకపోయినా, సచివాలయ ఉద్యోగులు వచ్చి సంతకాలు చేసి కార్యాలయంలో కనిపించి వెళుతున్నారు. మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం మార్కాపురం, పెద్దారవీడు, దోర్నాల మండలాలకు సంబంధించిన సచివాలయ ఉద్యోగులకు శిక్షణ నిర్వహించారు. గురువారం 41 మంది సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చినట్లుగా సబ్‌రిజిస్ట్రార్ తెలిపారు.

బాలికలే దేశానికి గర్వకారణం



మాట్లాడుతున్న జేవీవీ నాయకుడు స్వరూపారెడ్డి

గిద్దలూరు, జనవరి 25 : పట్టణంలోని రాజు పారా మెడికల్ కళాశాల ఆవరణలో జాతీయ బాలికాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు పి.స్వరూపారెడ్డి మాట్లాడుతూ బాలికలే దేశానికే గర్వకారణమన్నారు. బాలికలు తమ హక్కుల గురించి తెలుసు కోవాలని పేర్కొన్నారు. లింగవివక్షతను రూపుమాపేందుకు మహిళ సాధికారిత కోసం పోరాటం అనేది బాలిక దినోత్సవ లక్ష్యమన్నారు. వారం రోజులపాటు వీటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నో చట్టాలు ఉన్నప్పటికీ బాలికలకు రక్షణ కల్పించలేక పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ కె.రాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

నారాయణరెడ్డికి గౌరవ డాక్టరేట్



గిద్దలూరు, జనవరి 25 : ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు బి.ఎస్. నారాయణరెడ్డి గౌరవ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. నైజీరియా దేశానికి చెందిన సమారిటన్ జియోలాజికల్ సెమినార్‌లో రాష్ట్రానికి చెందిన మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతంలో గౌరవ డాక్టరేట్‌కు సంబంధించి ముఖాముఖి నిర్వహిం చారు. ఆన్‌లైన్ ద్వారా నారాయణరెడ్డికి ఈ సంస్థలు గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తూ ఉత్తర్వులు ఇచ్చాయి. మూడు దశాబ్దాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయనకు డాక్టరేట్ ఇచ్చినట్లు ఆయా సంస్థలు ప్రకటించాయి.

నేడు వక్తృత్వ పోటీలు

గిద్దలూరు, జనవరి 25 : చైతన్య వేదిక 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో ఈ నెల 26న సాయంత్రం 6 గంటలకు 'యువతపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు చైతన్యవేదిక కార్యదర్శి ఎస్.పి.డి.పుష్పరాజ్, సాంస్కృతిక విభాగం కార్యదర్శి గుర్రాల విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. విజేతలకు ఆకర్షణీయ బహుమతులు అందజేస్తామన్నారు.

సామాజిక మరుగుదొడ్లు ప్రారంభం



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న సర్పంచ్

పెద్ద దోర్నాల, జనవరి 25: స్థానిక ఆర్‌టీసీ బస్టాండులో నూతనంగా నిర్మించిన సామాజిక మరుగుదొడ్లను సర్పంచి చిత్తూరి హారిక బుధవారం ప్రారంభించారు. యాత్రికులకు ఎంతో ఉపయుక్తమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మోహన్‌రావు, వైసీపీ మండల కన్వీనర్ ఘంటా వెంకటరమణారెడ్డి, నాయకులు జోగి వెంకట నారాయణ, వై వెంకటేశ్వర రెడ్డి, ఆర్ పుల్లారావు, ఉపాధ్యాయులు కిరణ్ కిశోర్ కుమార్, ఎం వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కంభంలో మహిళ ఓటర్లే అధికం

కంభం, జనవరి 25 : కంభం మండలంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తం 37860 మంది ఓటర్లకు గాను 19269 మంది మహిళ ఓటర్లు, 18608 మంది పురుష ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళల సంఖ్యే ఎక్కువన్నారు. కంభం పంచాయతీలో పురుషులు 5889, మహిళలు 5951 మొత్తం 11842 ఓట్లు ఉన్నాయి. కందులాపురంలో పురుషులు 3630, మహిళలు 3935, మొత్తం 7560 ఓట్లు, జంగంగుంట్లలో పురుషులు 872, మహిళలు 899, మొత్తం 1771 ఓట్లు, ఎల్.కోటలో పురుషులు 566, మహిళలు 528, మొత్తం 1094 ఓట్లు, సూరేపల్లిలో పురుషులు 133, మహిళలు 138, మొత్తం 277 ఓట్లు, లింగోజీపల్లిలో పురుషులు 448, మహిళలు 440, మొత్తం 888 ఓట్లు, రావిపాడులో పురుషులు 1418, మహిళలు 1386, మొత్తం 2805 ఓట్లు, హెచ్.గూడెం పురుషులు 494, మహిళలు 500, మొత్తం 994 ఓట్లు, చిన్నకంభంలో పురుషులు 785, మహిళలు 847, మొత్తం 1632 ఓట్లు, దర్గాలో పురుషులు 408, మహిళలు 423, మొత్తం 831 ఓట్లు, పెద్దనల్లకాల్వలో పురుషులు 483, మహిళలు 529, మొత్తం 1012 ఓట్లు, యర్రబాలెంలో పురుషులు 931, మహిళలు 919, మొత్తం 1850 ఓట్లు, లింగాపురంలో పురుషులు 472, మహిళలు 491, మొత్తం 963 ఓట్లు, నర్సిరెడ్డిపల్లిలో పురుషులు 505, మహిళలు 326, మొత్తం 631 ఓట్లు, తురిమెళ్ళలో పురుషులు 1774, మహిళలు 1937, మొత్తం 3711 ఓట్లు ఉన్నాయి.

ఐసీడీఎస్ అధికారులకు బాలుడి అప్పగింత



బాలుడిని అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ అధికారులు

గిద్దలూరు, జనవరి 25 : తిరుపతి రైలులో అనుమానాస్పదంగా తిరుగుతున్న 9 ఏళ్ల బాలుడిని టికెట్ కలెక్టర్ (టీసీ) గమనించి గిద్దలూరు ఆర్‌పీఎఫ్ పోలీసులకు అప్పగించాడు. తన పేరు ఎం.డి.అలీ, తండ్రి పేరు మమోహి, తల్లి పేరు సాజిద, తమది గుంటూరని ఆ బాలుడు చెప్పాడు. దీంతో ఆర్‌పీఎఫ్ పోలీసులు తాత్కాలికంగా ఐసీడీఎస్ అధికారులకు అప్పచెప్పి వివరాల కోసం గుంటూరు ప్రాంతంలో ఆరా తీస్తున్నారు. ఆర్‌పిఎఫ్ అధికారులు తిరుపతిరావు, పిచ్చిరెడ్డిలు వివరాలు వెల్లడించారు.

అనారోగ్యంతో వార్డు సభ్యుడు మృతి

త్రిపురాంతకం, జనవరి 25: అనారోగ్యంతో బాధపడుతున్న మిరియంపల్లి గ్రామ పంచాయతీ ఆరో వార్డు సభ్యుడు అంగిరేకుల రాజులు(65) గురువారం మృతి చెందారు. గత పంచాయితీ ఎన్నికల సమయంలో గ్రామంలోని ఆరోవార్డుకు సభ్యుడిగా రాజులు ఎన్నికయ్యాడు. కాగా గ్రామ సర్పంచ్ ఆర్.సుధాకర్, పలువురు నాయకులు రాజులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మాంసం అమ్మకాలపై నిషేధం

గిద్దలూరు, జనవరి 25 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో 26న శుక్రవారం మాంసం అమ్మకాలపై నిషేధం విధిస్తున్నట్లు కమిషనర్ రామక్రిష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. చికెన్, మటన్, చేపలు, ఇతరత్రా జంతువులు, పక్షుల మాంసం విక్రయాలను నిషేధించినట్లు తెలిపారు. ఉత్తర్వులను ఉల్లంగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెలిగొండపై ప్రజలను మభ్యపెడుతున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 25: ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకురేందుకే ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్ పూర్తి అయిందని ప్రజలను మభ్యపెడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దగ్గుపాటి సోమయ్య అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో సోమయ్య మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదిలోనే పూర్తి చేసి నీరు ఇస్తామన్నారని 2022-23 డిసెంబర్‌కు పూర్తి చేస్తామని 2024 ఫిబ్రవరిలో జాతికి అంకితం చేస్తామని నాలుగేళ్లుగా తేదీలు మారుస్తూ కాలం వెల్లబుచ్చుతున్నారన్నారు. రెండో టన్నెల్ తవ్వడం మాత్రమే పూర్తి అయిందని, లైనింగ్ పనులు మిగిలి ఉన్నాయన్నారు. ప్రాజెక్టు పనులన్ని అసంపూర్తిగా ఉన్నాయని, పూర్తి అయిందని చెప్పటం ఎంతవరకు సబబు అన్నారు. ముంపు గ్రామాల వారికి ఆర్‌ఆర్ ప్యాకేజీ వెంటనే చెల్లించాలన్నారు. అఖిల పక్ష రాజకీయ పార్టీల ప్రతినిధులను తీసుకెళ్లి రెండో స్వరంగం పనులు ఎలా పూర్తి చేశారో చూపించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీకేఎం రఫి, రాజు, నన్నెన తదితరులు పాల్గొన్నారు.

చెన్నయ్య హుండీ ఆదాయం లెక్కింపు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 25: స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి హుండీల ఆదాయం గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వామి హుండీలలో 3నెలల కాలంలో రూ.7.86388 వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు, ఆలయ సిబ్బంది, రాజ్యలక్ష్మీ మహిళా భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ కేడర్‌కు ఇంటిగ్రేటెడ్ శిక్షణ

కొమరోలు, జనవరి 25: కొమరోలులోని మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి నివాసంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు టీడీపీ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు తెలిపారు. మండల స్థాయి క్లస్టర్ పరిధిలోని యూనిట్, బూత్, కుటుంబ సాధికార సారధులకు శిక్షణ ఉంటుందన్నారు. వీరు శిక్షణకు విధిగా హాజరు కావాలన్నారు.

బ్యాడ్మింటన్‌లో పూసలపాడు విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న రవికుమార్

బేస్తవారపేట, జనవరి25 : 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు నియోజకవర్గ స్థాయిలో గురువారం గిద్దలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఫైనల్‌లో పూసలపాడు సచివాలయ పరిధిలోని విద్యార్థులు డబుల్స్ మహిళ బ్యాడ్మింటన్ జట్టు గిద్దలూరు రూరల్ విద్యార్థులపై పూసలపాడుకు చెందిన ఎండేలా రజిత, కర్నాటి పుష్పంజలి విజయం సాధించారు. అందుకు సచివాలయ కార్యదర్శులు కె.మనోరాజ్, పి.రమేష్‌బాబు, ఎం.రమణయ్య, జె.రంగస్వామిలు విద్యార్థులను అభినందించారు.

కార్మికులకు సంక్రాంతి కానుక ఇవ్వాలి

పొదిలి, జనవరి 25 : సమ్మె ఒప్పందం మేరకు కార్మికులకు సంక్రాంతి కానుక అందించాలని గురువారం స్థానిక పాతపంచాయతీ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె ఒప్పందం మేరకు జీవో నెంబరు 12ప్రకారం సంక్రాంతి కానుక 1000 రూపాయలను అందజేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా సమ్మెలో ఉన్న జీతాలను కూడా ఇంతవరకు జమచేయలేదన్నారు. పెంచిన జీతాలపై జీవో ఇచ్చి సకాలంలో అందించాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ పాల్గొన్నారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారేతీరావ్‌కు వినతిపత్రం అందజేశారు.

వెలిగొండ నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

సబ్ కలెక్టరేట్ వద్ద నిర్వాసితుల ధర్నా



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నిర్వాసితులు

మార్కాపురం రూరల్ జనవరి 25: వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసి తులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ నిధులు వెంటనే ఇవ్వాలని కోరుతూ ఆ గ్రామాల నిర్వాసితులు గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందో ళన చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం డివిజన్ నాయకులు గాలి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ 2005వ సంవత్సరంలో వెలుగొండ ప్రాజెక్టు క్రింద పదకొండు ముంపు గ్రామాలుగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందులో సుమారు పదివేల మంది నిర్వాసితులుగా మారారని అన్నారు. 2005వ సంవత్సరం నుండి ఇప్పటి వరకు సుమారు 600 మంది నిర్వాసితులు వివిధ కారణాలతో చనిపోయా రన్నారు. ప్యాకేజీ సకాలంలో ప్రభుత్వం అందిం చకపోవడంతో నిర్వాసిత భార్యాభర్తలు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. మరికొందరు గ్రామంలో ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతా లకు వలస వెళ్లి జీవనం సాగిస్తు న్నారని అన్నారు. ఈ పరిస్థితులలో వెలుగొండ ప్రాజెక్టు పూర్తయిందని త్వరలో జాతికి అంకితం చేయనున్నారని ప్రకటనలు వస్తున్నాయన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం గ్రామాలను వదిలి త్యాగం చేసిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రాజెక్టు ప్రారంభించే ముందు నిర్వాసి తులకు ఆర్‌ఆర్ ప్యాకేజీని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం వెంటనే నిర్వాసితులకు నిధులు చెల్లించాలని కోరారు. గొట్టిపడియ, అక్కచెరువు, గుండంచర్ల, కాటంరాజుతాండ అర్హులైన నిర్వాసితులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బొగ్గు రామిరెడ్డి, గాలిరెడ్డి, ముంపు గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఫించనర్ల సమస్యలను పరిష్కరించాలి



కంభం, పొదిలిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

కంభం, జనవరి 25 : రాష్ట్ర ప్రభుత్వం ఫించనర్ల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరుతూ కంభం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఇబ్రహీం మాట్లాడుతూ 11వ పీఆర్‌సీలో 2022 సంవత్సరం తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను తిరిగి అంతకు ముందు ఉన్నవిధంగా కొనసాగించాలన్నారు. 70 సంవత్సరాలు నిండిన వారికి 10శాతం, 75 సంవత్సరాలు నిండిన వారికి 15శాతం పెండింగ్‌లో ఉన్న డిఆర్ బకాయిలను విడుదల చేయాలన్నారు. 11వ పీఆర్‌సీ అరియర్స్ చెల్లించాలని, హెల్త్‌కార్డుల ద్వారా అన్ని వైద్యశాలల్లో అన్ని వ్యాధులకు వైద్యం అందించాలన్నారు.

పొదిలి : ఇచ్చిన జీవోలు, సమస్యలు అమలు చేయకపోవడం అన్యాయమని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏ బాదుల్లా అన్నారు. రాష్ట్ర పిలుపు మేరకు పెన్షనర్లు గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. వృద్ధాప్యంలో కూడా పెన్షన్‌లు సకాలంలో ఇవ్వకుండా మనోవేదనకు గురి చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇంతవరకు పరిష్కారం కాని 11వ పీఆర్సీ, 2022 జనవరి 1వ తేదీ నుంచి తగ్గించిన అడిషనల్ క్వాంటం‌ను తిరిగి యథావిధిగా గతంలోలాగే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 70సంవత్సరాల దాటిన వారికి గత ప్రభుత్వం 10శాతం ఇస్తే వైసీపీ ప్రభుత్వం దాన్ని 7శాతానికి కుదించడం దారుణమన్నారు. 75 సంవత్సరాలు నిండిన వారికి 15శాతం ఇచ్చి పాతపద్ధతిని కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 11వపీఆర్సీ ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డు ద్వారా అన్ని గుర్తింపు పొందిన హాస్పిటల్స్‌లో కార్పొరేట్ వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ పరిధిని రెండులక్షల నుండి 5లక్షలకు పెంచాలన్నారు. అంతే కాకుండా ప్రతినెల 1వ తేదీన పెన్షన్‌లు అందజేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి షేక్ మదార్‌వలి తదితర పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా అలీబేగ్



సుపరిచితులైన అలీబేగ్ నియామకం పట్ల పార్టీ నాయకులేగాక వివిధవర్గాల ప్రముఖులు అభినందనలు తెలిపారు.

మార్కాపురం రూరల్, జనవరి 25: మార్కాపురం వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, విద్యావేత్త మీర్జా షంషీర్ అలీబేగ్ నియమితులయ్యారు. ఆమేరకు మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి చిరంజీవి ఉత్తర్వులు జారీచేశారు. చైర్మన్‌తో పాటు 11మంది డైరక్టర్ల నియామకం పూర్తయ్యింది.. మార్కాపురం నియోజకవర్గంలో పలు విద్యాసంస్థలను నిర్వహిస్తున్న ఏ1 గ్లోబల్ విద్యాసంస్థల అధినేత అయిన అలీబేగ్ నియోజకవర్గంలో సుపరిచితుడు. వైసీపీలో ఆరంభం నుంచి చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఒకదశలో రాష్ట్రస్థాయి చైర్మన్ పోస్టుకు ఆయన పేరును పరిశీలించారు. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డితో పాటు పార్టీలోని కొందరు సీనియర్ నాయకులు కూడా ఆయన పేరును సిఫార్సుచేశారు. అయితే చైర్మన్ పదవి అవకాశం చివర్లో మిస్ కావటంతో ప్రత్యామ్నాయంగా ఏయంసీ చైర్మన్ పదవికి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సిఫార్సు చేశారు. వైసీపీ నాయకుడిగానే కాక విద్యాసంస్థల అధినేతగా

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



మార్కాపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, వై.పాలెంలో విద్యార్థుల ర్యాలీ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 25: ప్రజా స్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని సబ్ కలెక్టర్ రాహుల్ మీన అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాతబస్టాండ్‌లోని గడియార స్తంభం సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి ఓటర్స్ డే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రవీంద్ర, తహసీల్దార్ మంజునాథరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం ప్రిన్సిపాల్ సీహెచ్ రాజాబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.వి.కృష్ణారెడ్డి ఓటు హక్కు ప్రాముఖ్యత వివరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

కంభం, జనవరి 25 : గురువారం ఓటర్ల దినోత్సవంలో భాగంగా కంభం మండల తహసిల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో కందులాపురం సెంటర్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేయించుకోవాలని అన్నారు.



పొదిలిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

ఓటు ప్రతి ఒక్కరి హక్కు

కొమరోలు : ఓటు అనేది ప్రతి ఒక్కరి హక్కు అని తహసీల్దార్ రమాదేవి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కొమరోలులో ర్యాలీ నిర్వహించి అనంతరం సమావేశంలో పాల్గొన్నారు.ఈసందర్భంగా తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు.

త్రిపురాంతకం : మండలంలోని అన్ని గ్రామాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఎస్సెస్పీ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద అధికారులు, ఉద్యోగులు, ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కు, విలువ, వినియోగంపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఈలు జి.నీలిమ, కె.శివన్నారాయణ, ఎస్‌ప మల్లీశ్వరి, నాసరయ్య, రసూల్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

పెద్ద దోర్నాల : ఓటు హక్కు, వినియోగంపై రెవెన్యూ అధికారులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ. ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వీ నాగేశ్వరరావు, సిబ్బంది రఘు పాల్గొన్నారు.

పొదిలి : జాతీయ ఓటర్లదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తహశీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వంలో ఘనంగా నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండి అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం నుండి పెద్దబస్టాండ్, చిన్నబస్టాండ్ మీదుగా అవగాహన ర్యాలి నిర్వహించారు. అనంతరం విద్యాసంస్థ అధినేత బెల్లంకొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హత కలిగిన విద్యార్థులతో ఎలాంటి ప్రలోబాలకు, డబ్బు వ్యామోహానికి లోనుకాకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు.

బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీస్ (ఎఇఆర్) అవార్డుకు ఎంపిక

గిద్దలూరు టౌన్ : గిద్దలూరు తహసిల్దార్‌గా పనిచేస్తున్న సీతారామయ్యకు బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీస్ (ఎఇఆంర్) అవార్డుకు ఎంపికయ్యారు. ఓటర్ల జాబితాలో ప్రతిభ కనపరచిన వారికి ఈ అవార్డును అందించనున్నారు. విజయవాడలో జరుగనున్న కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా తహసిల్దార్ సీతారామయ్య ఈ అవార్డు అందుకోనున్నారు.

ఎర్రగొండపాలెం : అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని, ఓటు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎర్రగొండపాలెం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి సువర్ణమ్మ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భగా ఎర్రగొండపాలెంలో గురువారం ఓటర్సు దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ప్రతి పౌరుడు ఓటు విలువ తెలుసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రవీంద్రారెడ్డి, ఎంఈవో పి.అంజనేయులు, ఎంఈవో 2 మల్లికార్జుననాయక్, డీటీసీ శ్రీనివాసరావు, ఎలక్షన్ సిబ్బంది ప్రసాదు, వెంకట సుబ్బయ్య, బ్రహ్మయ్య, పాఠశాలల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

గంగమ్మకు నిరంతర అర్చన

తాళ్లూరు, జనవరి 25 : గుంటిగంగ భవానీ అమ్మవారి దేవస్థానంలో ప్రతి రోజు అర్చన, అష్టోత్తర, సహస్రనామ పూజలు అందుబాటులో ఉంటాయని దేవస్థాన చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఈవో పీ కార్తీక్ గురువారం తెలిపారు. గతంలో బ్రాహ్మణ అర్చక నియాకంలో నెల కొన్న వివాదాన్ని గ్రామపెద్దలు, ప్రస్తుత పూజారులు విజయ లక్ష్మి, బాలరాజు, వాహన పూజారి కామేశ్వరరావులతో చర్చించడం జరిగిందన్నారు. బ్రాహ్మణ అర్చకుడు గుడి అంతరాయలంలోకి పంపి పూజలు చేసేందుకు అంగీకారం కుదిరిందన్నారు. అంగీకార పత్రాన్ని సహాయ కమిషనర్‌కు అందజేశారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు లేకుండా విధులు నిర్వహిస్తామని, నిబంధలకు లోబడి ఉంటామని పూజారులు లిఖిత పూర్వక హామీ ఇచ్చారు. దీంతో బ్రాహ్మణ అర్చక నియామకంలో వివాదం సమసిపోయింది.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చర్చి దగ్ధం

కురిచేడు, జనవరి 25: కురిచేడు మండలం ఆవుల మంద పంచాయతీ రామాంజనేయ కాలనీలో గురువారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చర్చి దగ్ధమయింది. మధ్యాహ్న సమయంలో అందరూ పొలాలకు వెళ్లారు. ఆ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చర్చికి మంటలు అంటుకుని కాలిపోయింది. ఈ ప్రమాదంలో వాయిద్య పరికరాలు, కుర్చీలు తగులబడ్డాయి. రూ.30వేల ఆస్తి నష్టం జరిగినట్లు పాస్టర్ తెలిపారు.

వైసీపీని వీడిన 30 కుటుంబాలు

» ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన తుమ్మకుంట బీసీలు


ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన తుమ్మకుంట గ్రామస్థులు

కనిగిరి, జనవరి 25 : వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో గురువారం మండలంలోని తుమ్మకుంట గ్రామానికి చెందిన బీసీ వర్గాలువారు పెద్ద ఎత్తున చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ జగన్‌రెడ్డి అసమర్థ పాలనపట్ల ప్రజలు విసుగుచెందారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మి భారీగా టీడీపీలో చేరుతున్నారన్నారు. వైసీపీ పాలనలో అణగారినవర్గాల వారిని నానా ఇబ్బందులకు గురి చేశారన్నారు. కనిగిరి ప్రాంతంలో వైసీపీ పాలనతో పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు. టీడీపీ పాలనలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని ఉగ్ర గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజా సంక్షమాన్ని కాంక్షించి 5 ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. తాగు, సాగు నీటి ఇబ్బందులు తొలగించి, ఉపాధి, పరిశ్రమలు కల్పనకు కృషి చేస్తానన్నారు. ట్రిపుల్ ఐటీ, నడికుడి రైల్వేలైన్ సాధిస్తానన్నారు. వరుసగా పార్టీలో చేరుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి సముచిత స్థానం ఉటుందన్నారు. అందరూ ఐక్యతతో పార్టీ విజయానికి శ్రమించాలని ఉగ్ర కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

కనిగిరి మండలంలోని తుమ్మకుంట గ్రామానికి చెందిన బీసీ వర్గాలు 30 కుటుంబాల వారు వైసీపీని వీడారు. వారంతా ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. చేరిన వారిలో ఈర్ల వెంకటేశ్వర్లు, ఈర్ల శ్రీను, ఇండ్లా బాలకృష్ణ, గోగు ఆంజనేయులు, చెన్నకేశవులు, రంగయ్య, చిన్నయ్య, గురప్పడు, బ్రహ్మయ్య, నాగయ్య, సుబ్బయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు. వారందరికీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు టీడీపీ అండ


సభలో మాట్లాడుతున్న నెమిలయ్య

కురిచేడు, జనవరి 25: బీసీలకు అండగా తెలుగు దేశం పార్టీ ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య అన్నారు. కురిచేడు మండల అధ్యక్షుడు నెమిలయ్య అధ్యక్షతన జయహో బీసీ సదస్సు జరిగింది. కార్యక్రమానికి పార్లమెంట్ అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం, దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లులు హాజరయ్యారు. సినిమాహాలు సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం గురునాథం అధ్యక్షతన జయహో బీసీ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్థాయి బీసీ నాయకులు, నాయులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోనా


గోనాకు నియామకపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 25 : టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా గోనా ప్రతాప్ నియమితులయ్యారు. ఈ మేరకు అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి నియామకపత్రాన్ని అందచేశారు. ఉగ్ర మాట్లాడుతూ యువకుడు, ఉత్సాహవంతుడైన గోనా ప్ర తాప్ నియామకం అభినందనీయమన్నారు. తనకు అవకాశం ఇప్పించిన డాక్టర్ ఉగ్రకు గోనా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, టీడిపి సీనియర్ నాయకులు భేరి పుల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆంజనేయస్వామి గుడిలో పూజలు చేస్తున్న బూచేపల్లి కుటుంబ సభ్యులు

సేవ చేసే భాగ్యాన్ని కల్పించండి

ఎన్నికల ప్రచార ప్రారంభ కార్యక్రమంలో బూచేపల్లి

దర్శి జనవరి 25 : దర్శి నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ సేవ చేసే భాగ్యం కల్పించాలని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎంపికయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఆయన పోటీ చేస్తున్నందున ఎన్నికల ప్రచారం గురువారం ప్రారంభించారు. తొలుత ముసీ నది వద్ద ఆంజనేయస్వామి గుడిలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి ఆయన సతీయణి నందిని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి బైక్ ర్యాలీతో రాజంపల్లి, కొత్తరెడ్డిపాలెంలోని వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి దర్శి చేరుకున్నారు. దర్శిలో వైఎస్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. 20 సంవత్సరాలుగా బూచేపల్లి కుటుంబాన్ని ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మెన్ కేవీ రెడ్డి, సొసైటీ చైర్మెన్ చెన్నారెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హాజరుకాని మద్దిశెట్టి వర్గీయులు

బూచేపల్లి ఎన్నికల ప్రచార కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ వర్గీయులు హాజరుకాలేదు. టికెట్ రాకపోవడంతో ఎమ్మెల్యే మద్దిశెట్టి అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. ఆయన కొద్ది రోజుల్లో అనుచరులతో సమావేశమై భవిషత్ కార్యాచరణ ప్రకటిస్తారని సన్నిహితులు చెప్తున్నారు. అందువల్లే బూచేపల్లి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొనలేదని చెప్తున్నారు.

ముండ్లమూరు : మన ఊరికి మన శివన్న అనే కార్యక్రమం చేపట్టి ఎన్నికల ప్రచారాన్ని శివప్రసాద్‌రెడ్డి పులిపాడులో గురువారం ప్రారంభించారు. తనను గెలిపిస్తే ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఆయనవెంట జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ ఉన్నారు. పులిపాడు ఎస్సీ కాలనీకి చెందిన బొందలపాటి లాజర్ అనే దివ్యాంగుడి పరిస్థితి చూసిన శివ ప్రసాదరెడ్డి మూడు చక్రాల స్కూటీని ఇస్తానని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాశిరాజుకు రూ.20వేల సాయాన్ని అందజేశారు. అంతకుముందు గ్రామ సర్పంచి ముక్కముళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బూచేపల్లికి ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు తాతపూడి రత్నంరాజు, వైస్ ఎంపీపీ బంకా నాగిరెడ్డి, మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, సచివాలయ కన్వీనర్ మేడికొండ జయంతి, సర్పంచ్‌లు నాగేంద్రం పిచ్చయ్య, గీతాంజలి, గురవయ్య, చెంచయ్య, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

తాళ్లూర : శివప్రసాద్‌రెడ్డి చేపట్టిన మన ఊరికి మన శివన్న ప్ర చార కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి గురువారం బైక్ ర్యాలీగా శ్రేణులు తరలి వెళ్లారు. పార్టీ కన్వీనర్ తూము వెంకటసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదనరెడ్డి, కోటరామిరెడ్డి, మోషే, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షు డు ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు వెంకటరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు కరిముల్లా దూరంగా ఉన్నారు. దర్శిలో జరిగిన బైక్ ర్యాలీలో ప్రమాదవశాత్తు జారి పడి మాధవరం మాజీ సర్పంచ్ కోట పెద్దిరెడ్డి గాయపడ్డారు. విషయం తెలుసుకున్న బూచేపల్లి గురువారం పెద్దిరెడ్డిని పరామర్శించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

దొనకొండ, జనవరి 25 : బహుజన ఉద్యోగుల సంఘం దర్శి నియోజకవర్గ నూతన క్యాలెండర్‌ను జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా బహుజన ఉద్యోగుల సంఘం విద్యాపరంగా నిరంతరం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కొనసాగుతున్న సంఘం అని తెలిపారు. కార్యక్రమంలో బహుజన ఉద్యోగుల సంఘం సీనియ ర్ నాయకులు అట్లూరి రామారావు, వి శ్రీనివాసనాయక్, కె కోటేశ్వరరావు, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

జేసీ శ్రీనివాసులు


కనిగిరిలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు, పీసీపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కనిగిరి, జనవరి 25 : ఓటు వేయడం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కుగా వినియోగించు కోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కే.శ్రీనివాసు లు అన్నారు. ప్రభుత్వ హైస్కూల్‌లో గురువా రం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జేసీ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మెరుగైన సమాజం కోసం ఓటే సరైన ఆయుధం అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వే స్తే సరైన నాయకుడు ఎన్నిక అవుతారన్నారు. నోటు తీసుకుని ఓటు వేయడం ప్రజాస్వామ్యానికి చేటు అన్నారు. విజ్ఞతతో ఓటు వేస్తేనే అ భివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండలంలోని తుమ్మకుంట గ్రామానికి చెందిన నడిపంల్లి అంగన్‌వాడీ కార్యకర్త కొండమ్మకు బెస్ట్ అవార్డు ప్రకటించి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఇర్విన్, తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీవో మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, సీఐ శివరామకృష్ణారెడ్డి, సీడీపీవో ఇవాంజిలిన్, ఎంఈవో యా నారాయణరెడ్డి, హెచ్‌ఎం సంజీవి పాల్గొన్నారు.

పామూరు : ఓటు వజ్రాయుధం లాంటిదని, 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటు హక్కును పొందాలని డిప్యూటీ తహసీల్దార్ పీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామస్వామి, వీఆర్వోలు పాల్గొన్నారు.

పీసీపల్లి : ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ప్రవీణకుమార్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని పెదయిర్లపాడులో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని బస్టాండు కూడలిలో ఓటర్లు, విద్యా ర్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ2 ఆర్.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుభాన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

దర్శి : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ఆర్డీ గుత్తా శోభన్‌బాబు, ఎంఈవో కె రఘురామయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముండ్లమూరు : ఓటు హక్కును ప్రతి ఒ క్కరూ వినియోగించు కోవాలని ఎన్నికల అధికారి లోకేశ్వరరా వు కోరారు. నాయుడు పాలెం పంచాయతీ తమ్మలూరులో ఓటర్ల జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్‌వో బ్రహ్మతేజ, దేవకాంత్ ఉన్నారు.

తాళ్లూరు : తాళ్లూరులో తహసీల్దార్ కేపీ ప్రసాద్ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించా రు. డీటీ ఇమ్మానియేల్‌రాజు, వీకే జూనియ ర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఎలక్షన్ ఆపరేటర్ సుజాత, భవానీ, అధ్యాపకులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

ఎన్నికలకు సమాయత్తం కావాలి

పామూరు, జనవరి 25 : సార్వత్రిక ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. జీవైఆర్ భవన్‌లో పామూరు, సీఎస్‌పురం శ్రేణుల సమావేశం మస్తాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ బీజేపీ, వైసీపీ పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయన్నారు. ఆ రెండు పార్టీలనూ ఎన్నికల్లో గద్దె దింపాలన్నారు. ఎన్నికలకు ముందు జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. వెలిగొండ పూర్తి చేసినట్లు అబద్ధ ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. కనిగిరి నుంచి సీపీఐ అభ్యర్థి బరిలో ఉంటారని తెలిపారు. సమావేశంలో సయ్యద్ మౌలాలి, ఎస్డీ యాసీన్, ప్రభాకర్, ఎస్‌కే, పెద్దమస్తాన్, సుబ్బారావు, నరసింహులు, రమేష్, ఇండ్లా నరసింహారావు, వెంకట్‌రెడ్డి, ఆకుల మోహన్‌రావు, సూరిబాబు, అబ్బిశెట్టి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ మహిళా నేత దీనమ్మ మృతి

దర్శి, జనవరి 25 : నగర పంచాయతీ టీడీపీ కౌన్సిలర్ ఇత్తడి దినకర్ తల్లి టీడీపీ మహిళా నేత ఇత్తడి దీనమ్మ (82) మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పి చ్చయ్య ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న గర పంచాయతీ వైస్ చైర్మన్‌లు జీ స్టీవెన్, తలారి కోటయ్య, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షు డు సంగా తిరుపతిరావు, పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, క్లస్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, నా యకులు రంగా, కల్లూరు సుబ్బు, కె శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, అనిల్ పాల్గొన్నారు.


దీనమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న పాపారావు

టీడీపీ ఆరు పథకాలతో భవిష్యత్

పామూరు, జనవరి 25 : టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన ఆరు పథకాలతో అందరికీ బంగారు భవిష్యత్ కలుగుతుందని బూత్ కన్వీనర్ పోతురాజు వెంకటనారాయణ తెలిపారు. దూబగుంట పంచాయతీ వెంకటాపురం గ్రామంలో బాబు ష్యూ రిటీ..భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కనిగిరి అభివృద్ధి కోసం డాక్టర్ ఉగ్రను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పత్తి మస్తాన్, బాబు, ఆదినారాయణ పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగుతో లాభం

తాళ్లూరు, జనవరి 25 : వర్షాధారంగా సాగు చేసే వరిగె పంట 80-85రోజుల్లో చేతికి వస్తుందని వ్యవసాయాధికారి బీ ప్రసాదరావు తెలిపారు. తాళ్లూరు, కొత్తపాలెం గ్రామాల్లో సాగులో ఉన్న వరిగె పంటను గురువారం పరిశీలించారు. ఈ పంట సాగులో ఖర్చు, శ్రమ, నష్టం తక్కువగా ఉంటుందన్నారు. దీంతో రైతుకు నికర ఆదాయం వస్తుందన్నారు. వాణిజ్య పంటలను, సంప్రదాయ పంటలను ఒక సీజన్‌లో మార్చి చిరు ధాన్యాలను సాగు చేపట్టాలని తెలిపారు. కనుమరుగవుతున్న చిరు ధాన్యాలైన వరిగ, సామ, ఊదలు, అరికలను రైతులతో సాగు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, వీఏఏ నాయక్, రైతులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ భూముల పరిశీలన

పామూరు, జనవరి 25 : నడికుడి - శ్రీకాళాహస్తి రైల్వేలైన్ భూములను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. మండలంలోని రావిగుంటపల్లి, ఇనిమెర్ల, నర్రమారెళ్ల గ్రామాల్లో రైల్వేలైన్ నిర్మాణం కోసం సేకరించిన భూములను ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్‌తో కలిసి పరిశీలించారు. రైల్వేలైన్ అలైన్‌మెంట్ గురించి తెలుసుకొన్నారు. భూములిచ్చే రైతులతో మాట్లాడారు. భూములు కోల్పోయిన రైతులకు రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ ప్రకారం పరిహారం అందిస్తామని జేసీ తెలిపారు. రైల్వేలైన్ పనులు వేగవంతంగా సాగుతున్నాయని త్వరలో ఇక్కడ కూడా ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆవుల సురేష్, వీఆర్వో రఫిఅహ్మద్, సర్వేయర్ అమరన్ పాల్గొన్నారు.


ఉత్తమ అధికారిగా ఈఆర్వో


అవార్డును అందజేస్తున్న కలెక్టర్

దర్శి, జనవరి 25 : దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా గురువారం కలెక్టర్ దినేష్‌కుమార్ ఈ అవార్డును లోకేశ్వరరావుకు అందజేశా రు. నియోజకవర్గంలో ఓటర్ల జాబితా రివిజన్ కార్యక్రమంలో ఎంతో పారదర్శకంగా నిర్వహించినందుకు ఆయనకు ఈ అవార్డు లభించింది. ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఓటర్ల చేర్పులు, మార్పులు తొలగింపుల ప్రక్రియను ఆయన సమర్థవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు ఉత్తమ అధికారులుగా సీనియర్ అసిస్టెంట్ నర్సింహారావు, బీఎల్ వో అనిత ఎంపికయ్యారు.

బైక్, స్టీల్ దుకాణాల్లో చోరీ

రూ.50వేల అపహరణ


రేకు కట్ చేసిన దొంగలు

కనిగిరి, జనవరి 25 : బైక్ షోరూంతో పాటు స్టీల్ సిండికేట్ దుకాణంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు రూ.50వేలను అపహరించిన ఘటన గురువారం వెలుగుచూసింది. షాపుల నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి షాపులు మూసివేసి వెళ్లారు. గురువారం ఉదయం నారాయణస్వామి స్టీల్ సిండికేట్ షాపును తీశారు. లోపలికి వెళ్లి చూడగా దుకాణం పై కప్పు రేకులను కట్టర్‌తో కట్ చేసి ఉంది. క్యాష్ కౌంటర్ చూడగా అందులో నగదు లేదు. ఈ షాపు వె నుకు వైపున చిన్న సందులో నుంచి పక్కనే ఆనుకుని ఉన్న హీరో బైక్ షోరూం గేటును కట్ చేసి షోరూంలోకి ప్రవేశించారు. అందులోకి ప్రవేశించిన దొంగలు బీరువాను తెరిచి విఫలమయ్యారు. క్యాష్ కౌంటర్‌లోని రూ.40వేలు నగదు పోయినట్లు తెలిపారు. దాదాపుగా రెండు షాపుల్లో రూ.50వేల నగదు దొంగిలించినట్లు యజమానులు తెలిపారు. ముం దుగా రెక్కీ నిర్వహించి ఈ చోరీలకు పాల్పడినట్లు యజమానులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. షాపుల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించ గా, రోడ్డుపై నలుగురు వ్యక్తులు పెద్ద కట్టర్ పట్టుకుని 10 నిమిషాలు వేచి ఉన్నట్లు తెలుస్తుంది. వారిలో ఇద్దరు బైకుపై ఉండగా మిగతా ఇద్దరు ఎమ్మెల్యే నివాసానికి సమీపంలో ఉన్న సిమెంట్ ఒరలు స్థలంలో నుంచి స్టీల్ సిండికేట్‌లోకి, ఆదుకాణం వెనుక వైపు ఉన్న గోడకు రంధ్రం చేసి షోరూంలోకి ప్రవేశించారు. మూడు నెలలుగా షాపులు, హోటల్‌లో చోరీలు జరుగుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దొంగతనాలపై తమకు ఎ టువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మాధవరావు తెలిపారు.

ఎస్‌ఐ సురేష్‌కు ఉద్యోగోన్నతి

పామూరు, జనవరి 25 : పామూరు ఎస్‌ఐ కే సురేష్ సీఐగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్‌ను వైసీపీ నాయకులు కలిసి సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు సీహెచ్ సుబ్బయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్, షేక్ చాంద్ బాషా, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, దరిశి రాము, ఉప సర్పంచ్‌లు, సాయికిరణ్, రామసుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు షేక్ అబ్దులా తదితరులున్నారు.



మందడం శిబిరంలో నినాదాలు చేస్తున్న రాజధాని మహిళలు

అమరావతి.. సమర భేరి

- జగన్‌పై విరుచుకుపడిన అఖిలపక్ష నేతలు
- వెలగపూడి, మందడం వేదికగా నేతల హెచ్చరికలు
- మూడు నెలల్లో సైతాను పాలన అంతం
- ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి
- 'అమరావతి సమర శంఖారావం' సభలో నేతల భరోసా

అమరావతి అన్నదాతల మహాపోరాటం గురువారానికి 1500 రోజులకు చేరింది. ఈ సందర్భంగా రాజధాని గ్రామాలైన వెలగపూడి, మందడం గ్రామాల్లో నిర్వహించిన సభలు దిగ్విజయంగా జరిగాయి. అమరావతి నిర్మాణం సాకారమయ్యే వరకు పోరాటం సాగిస్తామని రైతులు, మహిళలు ప్రతినబూనారు. రాజధానివాసులను పట్టి పీడిస్తున్న జగన్ రాక్షస పాలనను అంతమొందిస్తామని సవాలు చేశారు. అమరావతిని నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్న జగన్, వైసీపీ పార్టీకి అఖిలపక్ష నేతలు హెచ్చరికలు చేశారు. సరిగ్గా 81 రోజుల్లో ప్రభుత్వం గాలికిపోతుందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు అండగా ఉంటుందన్న కారణంగా వామపక్ష నేతలు బీజేపీపై విరుచుకుపడ్డారు. ప్రజలందరి ఉమ్మడి శత్రువుగా పరిణమించిన జగన్‌ను గద్దె దింపేంత వరకూ తమ పోరాటం ఆగేది లేదని ఆయా పార్టీల నేతలు అమరావతి సమర శంఖం పూరించారు.



మందడం సభలో శాసనమండలి చైర్మన్ షరీఫ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు, రాజధాని రైతులు, పలువురు మహిళలు, పక్కన పూలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం



మందడం సభలో ప్రసంగిస్తున్న దేవినేని ఉమ, వేదికపై టీడీపీ నేతలు, వివిధ పార్టీల నాయకులు, రాజధాని రైతులు



న్యాయదేవత విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న టీడీపీ నేతలు



తుళ్లూరు దీక్షా శిబిరం వద్ద అమరావతి ఉద్యమం 1500వ రోజు అంకెతో దీపాలు వెలిగించి అమరావతి వెలుగు కార్యక్రమం చేస్తున్న మహిళలు, రైతులు

తుళ్లూరు/గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజధాని ఉద్యమం 1500 రోజులకు చేరుకున్న సందర్భంగా ఆయా గ్రామాల్లో గురువారం సభలు నిర్వహించారు. అమరావతి జేఏసీ నేత పువ్వాడ సుధాకర్ అధ్యక్షతన వెలగపూడి శిబిరం వద్ద మొదలైన సభలో వేలాదిమంది రైతులు, మహిళలు, దళిత, బహుజనులు పాల్గొన్నారు. తొలుత అమరావతి అమరవీరులు 277 మందికి సభలో నివాళులు అర్పించారు. ఇటీవల మృతి చెందిన దళిత జేఏసీ నేత గడ్డం మార్టిన్‌లూథర్ చిత్రపటానికి తొలుత నివాళులు అర్పించారు. అనంతరం అమరావతి ఉద్యమ నినాదభేరి చేశారు. అనంతరం ప్రాసమణి ప్రసంగంతో సభ ప్రారంభమైంది. అమరావతి ఉద్యమాన్ని, రైతులు, మహిళల త్యాగపూరిత పోరాటాన్ని తన ప్రాసలతో ఆయన శ్లాఘించారు. ప్రభుత్వ దుర్మార్గాలను ఎండగట్టారు. రాజధాని ఉద్యమ గాయకుడు రమణ తన పాటలతో ఆకట్టుకున్నారు. రాజధాని గ్రామాల మహిళలు పలువురు కోలాట ప్రదర్శనతో అలరించారు.

అమరావతి ఉద్యమం సువర్ణ లిఖితం..

1500 రోజులుగా అమరావతి రైతులు సాగిస్తున్న ఉద్యమం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అమరావతిలోనే జగన్ పతనం మొదలైందన్నారు. ఫ్యాక్షనిస్టులకే వణుకు పుట్టించిన వీర నారీమణులు అమరావతి మహిళలన్నారు. ఒక్కసారి పోలీసులు లేకుండా అమరావతి రా.. జగన్ మా అమరావతి మహిళలు చాలు అంటూ హెచ్చరించారన్నారు. ఒక మోసగాడు, నయవంచకుడు రాష్ట్రాన్ని నాశనం చేస్తుంటే ప్రశ్నించలేని దద్దమ్మ ఎమ్మెల్యేలు బల్లలు చరిచారని, ఇప్పుడు వారికి తగిన శాస్తి జరిగి వారినే తరుముతున్నాడన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వం మారుతుంది.. నూరు శాతం అమరావతే రాజధాని అని తేల్చి చెప్పారు. సీపీఎం నేత బాబూరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వానికి ఆక్సిజన్ ఇస్తోందే మోదీ ప్రభుత్వమన్నారు. అమరావతి విషయంలో జగన్, మోదీలిద్దరూ నిందితులేనన్నారు. ఇరువురినీ గద్దె దించేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు. పోలీసులు, లాఠీల దౌర్జన్యాలను ఢీకొని నిలబడిన అమరావతి రైతులకు మాజీ మంత్రి దేవినేని ఉమ అభినందనలు తెలిపారు. ప్రపంచ రాజధానిగా అమరావతిని చంద్రబాబు తీర్చిదిద్దుతారని హామీ ఇచ్చారు. అమరావతి రైతులే స్టార్ క్యాంపెయినర్లుగా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ అందరి ఉమ్మడి శత్రువుగా పరిణమించిన జగన్‌ను సాగనంపడానికి కలిసి కట్టుగా పోరాడాలన్నారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం మూడు రాజధానుల బిల్లును మండలిలో నిలువరించి జగన్ కుట్రను భగ్నం చేశామన్నారు. హిందూ మహాసభ సభ్యుడు వెలగపూడి గోపాలకృష్ణ మాట్లాడుతూ 81 రోజుల సమయమే మిగిలి ఉందని, బీజేపీ, సీపీఐ, సీపీఎంలు సిద్ధాంతాలను పక్కనపెట్టి రాష్ట్రం కోసం కలిసి చంద్రబాబును గెలిపించాలని వేడుకున్నారు.



అమరావతి రైతులకు మద్దతు తెలుపుతున్న అఖిలపక్ష నేతలు



వెలగపూడి శిబిరంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

అమరావతిపై అసత్య ప్రచారాలు

వెలగపూడి శిబిరంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ సైకో జగన్ మీద మొట్టమొదట తిరుగుబాటు బావుటా ఎగరవేసింది అమరావతి రైతులేనన్నారు. అమరావతి భూములు నిర్మాణానికి పనికిరావని మద్రాసు ఐఐటీ ఇచ్చినట్లు ఫోర్జరీ లేఖలు చూపించి అమరావతిపై సైకో అసత్య ప్రచారాలు చేయించారన్నారు. వరద వస్తే ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తకుండా అమరావతిని ముంచాలని చూసిన దుర్మార్గుడన్నారు. నన్నపనేని రాజకుమారి సభలో కన్నీటి పర్యంతమయ్యారు. వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వం.. అమరావతి పునరుత్తేజం పొందుతుంది.. గెలుస్తుందన్నారు. మందడం సభలో శాసనమండల మాజీ చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ మూడు రాజధానుల బిల్లును మండలిలో ఆమోదం పొందడానికి జగన్‌రెడ్డి అనేక ప్రలోభాలు చేశారన్నారు. అమరావతిని కాపాడటంలో టీడీపీ ఎమ్మెల్సీల పాత్ర ఎంతో గొప్పదన్నారు. కేవలం రాజకీయ కక్ష, చంద్రబాబు పేరు వినబడకూడదని, అమరావతిని రూపుమాపడానికి సీఎం జగన్‌రెడ్డి కుట్ర చేశారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా అదే జీవితమా అన్నంతగా ప్రభుత్వ వేధింపులు సాగాయన్నారు. వీటన్నింటికీ పరిష్కారం టీడీపీ- జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడమేనన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమరావతి పోరాటం తుది దశకు వచ్చిందన్నారు. మంచి రోజులు రాబోతున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లా డుతూ గొర్రె కసాయిని నమ్మినట్లు మోదీ, అమిత్‌షాలను నమ్మవద్ద న్నారు. దళిత జేఏసీ నేత పోతుల బాలకోటయ్య మాట్లాడుతూ తనకు ఏ రాజకీయాలు లేవని తన జాతి రాజధాని కోసం 34 శాతం భూమిలిచ్చిందని అందుకే ఉద్యమం చేస్తున్నానన్నారు. పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ జగన్ అధికారంలో పోతే పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి నేత కొలికిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ రాయలసీమ, ఉత్తరాంధ్ర, దళిత, గిరిజన, బహుజన, మైనార్టీ, కాపు, చివరికి రెడ్లకు కూడా జగన్ ద్రోహం చేశారన్నారు. సభలో విజయవాడ పార్లమెంటు ఇన్‌చార్జి కేశినేని శివనాథ్(చిన్ని), కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనురాధ, మైనార్టీ నేత ఫరూక్ షిబ్లి, బుచ్చిరామ్‌ప్రసాద్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ లీగల్ సెల్ గొట్టిపాటి రామకృష్ణ, హైకోర్టు న్యాయవాదులు చిగురుపాటి రవీంద్ర, లక్ష్మీనారాయణ, ఉమేశ్‌చంద్ర, రజని, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ, ఉండవల్లి శ్రీదేవి భర్త శ్రీధర్, టీడీపీ నాయకులు నిమ్మల శేషయ్య, కనపర్తి శ్రీనివాసరావు, దళిత బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేళం భాగ్యారావు, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా విజయ్, హైకోర్టు న్యాయవాదులు మహిళా జేఏసీ నేతలు రాయపాటి శైలజ, కంభంపాటి శిరీష, దళిత జేఏసీ నేతలు పులి చిన్నా, చిలకా బసవయ్య, హైదరాబాద్ సీబీఎన్ ఫోరం అధ్యక్షుడు అమర్, అమరావతి రైతు జేఏసీ నేతలు ధనేకుల రామారావు, గొర్రెని స్వరాజ్యరావు, ఆలూరి శ్రీనివాసరావు, జమ్ముల శ్యాంకిశోర్, బెల్లంకొండ నరసింహారావు, కట్టా రాజేంద్ర, బెజవాడ రమేష్, కారుమంచి నరేంద్ర, గద్దె భాను, సత్తెనపల్లి జేఏసీ మహిళానేత ఎం. శారద పాల్గొన్నారు.




మందడం శిబిరంలో మద్దతు తెలుపుతున్న సీపీఐ, బీజేపీ, టీడీపీ నాయకులు

అమరావతి ఉద్యమంపై పాటల సీడీని విడుదల చేస్తున్న చిగురుపాటి తదితరులు

నేతల తిరుగుబాటు..
వైసీపీలో ఉలికిపాటు

- టీడీపీలో చేరేందుకు సిద్ధమైన నేతల సస్పెన్షన్
- తొలుత అధిష్ఠానం చర్చలు.. ససేమిరా అనడంతో వేటు



అద్దంకి, జనవరి 25: అద్దంకి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు పలువురు తిరుగుబావుటా ఎగరవేయడంతో వైసీపీ అధిష్ఠానం ఉలికిపాటుకు గురైంది. సంతమాగులూరు మండలానికి చెందిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ అట్లా చిన వెంకటరెడ్డి తన వర్గం నేతలతో కలిసి టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. వైసీపీ అద్దంకి ఇన్‌చార్జ్‌గా పాణెం హనిమిరెడ్డి బాధ్యతలు తీసుకునే సమయంలో తమ వర్గానికి సరైన గుర్తింపు ఇవ్వలేదని నెల క్రితం చినవెంకటరెడ్డి తన వర్గీయులతో నరసరావుపేటలో సమావేశమైన విషయం తెలిసిందే. సంతమాగు లూరు మండల బాధ్యతలు తమ వర్గానికి అప్పగించాలని, లేదంటే భవిష్యత్ ప్రణాళిక రూపొందించుకుంటామని అప్పట్లో అల్టిమేటం ఇచ్చారు. అయితే దీనిని అంతగా పట్టించుకోని వైసీపీ నాయకత్వం మొక్కుబడిగా చర్చలు జరిపినట్లు సమాచారం. దీంతో కినుక వహించిన ఆయన తన వర్గీయులతో నాలుగు రోజుల క్రితం అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను కలిశారు. ఎంపీపీ యలమంద, పది మంది ఎంపీటీసీలు, 12 మంది సర్పంచ్‌లతో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరేందుకు చినవెంకటరెడ్డి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న అధిష్ఠానం చినవెంకటరెడ్డితో పాటు మిగిలిన నేతలపై ఒత్తిడి చేసి వైసీపీని వీడకుండా ఉండేలా తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. అయితే, తాము నిర్ణయించుకున్న విధంగానే టీడీపీలో చేరేందుకు వారు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో పార్టీని వీడుతున్న వారిని వైసీపీ అధిష్ఠానం సస్పెండ్ చేసింది. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ అట్లా చినవెంకటరెడ్డి, సంతమాగులూరు ఎంపీపీ యర్రబర్ల యలమంద, పాతమాగులూరు మాజీ సర్పంచ్ జిర్రా విజయబాబు, పుట్టావారిపాలెం సర్పంచ్ సన్నిబోయిన గురుబ్రహ్మం, సంతమాగులూరు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు అట్లా పెదవెంకటరెడ్డిని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు గురువారం వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సోదరులు.. సై

- చీరాల నుంచి పోటీ చేస్తామన్న ఆమంచి బ్రదర్స్
- అన్న బహిరంగంగా.. తమ్ముడు అంతరంగికంగా ప్రకటనలు
- జనసేన పాదయాత్రలో స్వాములు.. అనుచరులతో కృష్ణమోహన్

వేటపాలెం(చీరాల), జనవరి 25: చెరో పార్టీలో ఉన్న ఆమంచి సోదరులు స్వాములు(శ్రీనివాసరావు), కృష్ణమోహన్ చీరాల నుంచి పోటీ చేస్తామని ఎవరికివారే ప్రకటించుకుంటున్నారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి, చీరాల బాధ్యుడు ఆమంచి స్వాములు వేటపాలెం మండలం పందిళ్లపల్లి నుంచి దేశాయిపేట వరకు గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల స్వాములు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చీరాల నుంచి జనసేన తరఫున తాను పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. అంతకు రెండురోజుల ముందు పర్చూరు వైసీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ముఖ్య అనుచరులతో నిర్వహించిన అంతరంగిక సమావేశంలో పార్టీ, ఇండిపెండెంట్ అనేది పక్కన పెడితే తాను వచ్చే ఎన్నికల్లో చీరాల నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. ఆ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కూడా వారికి సూచించినట్లు అనుచరగణం చెప్తోంది. సోదరుల పోటీ ప్రకటనలపై రాజకీయవర్గాలతో పాటు సామాన్య జనాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. పర్చూరులో కృష్ణమోహన్ వైసీపీ కాడి కిందపడేసినట్లేనని, అధిష్ఠానం ఏం నిర్ణయం తీసుకుంటుందోనని ఆమంచి అనుకూల, వ్యతిరేక వర్గాల్లో వ్యాఖ్యానిస్తున్నారు. ఇక స్వాములు తాజా ప్రకటనపై ఆ పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మిత్రపక్షమైన టీడీపీ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య స్వాముల పాదయాత్రకు గైర్హాజరయ్యారు. కొండయ్య అందుబాటులో లేనందున రాలేదని స్వాములు చెప్పారు. అయితే, కొండయ్య స్థానికంగానే రోజంతా చీరాల పరిధిలోనే ఉన్నారు. ఇరుపార్టీల అధిష్ఠానాల నుంచి ఏ నిర్ణయం వెలువడక ముందే తానే అభ్యర్థినని స్వాములు చేపట్టిన పాదయాత్రలో పాల్గొంటే తాను కూడా ఆయనతో ఏకీభవించినట్లవుతుందనే ఉద్దేశంతో కార్యక్రమంలో కొండయ్య పాల్గొనలేదని సమాచారం. స్వాములు ప్రకటన ఆయన వ్యక్తిగతమని జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రియాజ్ తెలిపారు. అయితే, నెలన్నర క్రితమే నాదెండ్ల మనోహర్ చీరాల సీటు తనకేనని చెప్పారని స్వాములు సన్నిహితులకు చెప్తున్నారు. మొత్తం మీద ఎప్పటి మాదిరిగానే చీరాల రాజకీయం రసకందాయగా మారింది.

బుల్లెట్ కన్నా శక్తివంతమైనది ఓటు

- ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ రంజిత్‌బాషా



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు బుల్లెట్ కన్నా శక్తివంతమైనదని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలోని డాక్టర పివి.నాథ్ ఆడిటోరియంలో గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి సభలో ప్రసంగించారు. ఓటుహక్కుతో భవిష్యత్ నిర్ణయించుకునే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. 17 ఏళ్లు దాటిన వారందరూ ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 18 ఏళ్లు దాటిన 15 వేల మంది పౌరులకు నూతనంగా ఓటు హక్కు కల్పించామన్నారు. 86 శాతం ఓటు హక్కు వినియోగించుకోవడంతో జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉన్నాయన్నారు. జిల్లాలోని 1510 పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంప్ వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. ఏఎస్పీ పి.మహేష్ మాట్లాడుతూ ఓటు ఆవశ్యకత, గోప్యతనన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఓటు వేయనివారికి ప్రశ్నించే హక్కు ఉండదన్నారు. దశబ్దాలుగా ఓటుహక్కు వినియోగించుకుంటున్న వృద్ధులు, దివ్యాంగులను సన్మానించారు. ఎన్నికల అధికారులు, అధ్యాపకులు, సచివాలయ ఉద్యోగులను సత్కరించి ధ్రువీకరణపత్రాలను అందజేశారు. నూతనంగా ఓటుహక్కు పొందిన వారికి గుర్తింపుకార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీ శ్రీధర్, ఆర్డీవోలు గంధం రవీందర్, పి.సరోజని, హేలాషారోను, వ్యవసాయకళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, తహసీల్దార్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఓట్లపై.. డౌటు!



- ఫాం7ల ద్వారా తొలగించిన ఓట్లు 46,191
- జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫాం7లు 62,052
- తిరస్కరించినవి 15,861
- ఒక్క పర్చూరులోనే దాదాపు 12,000కు పైగా ఓట్ల తొలగింపు
- ఓటర్ల జాబితాను జల్లెడ పడుతున్న టీడీపీ

బాపట్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఓటర్ల తుదిజాబితా ప్రచురణను సోమవారం విడుదల చేసిన సంగతి తెలిసిందే. రాజకీయ పార్టీలన్నీ ఓటర్ల జాబితా వడపోతపై దృష్టి పెట్టాయి. అర్హత ఉండి తీసేసిన ఓట్లకు సంబంధించి ఇప్పటికే పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఫాం7లకు సంబంధించి పెద్దఎత్తున వివాదం నడిచిన సంగతి తెలిసిందే. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మొదలైన గతేడాది జనవరి నుంచి డిసెంబరు 9 వరకు జిల్లావ్యాప్తంగా వచ్చిన ఫాం7 దరఖాస్తులు 62,052కాగా వాటిలో ఆమోదించినవి 46,191గా ఉన్నాయి. 15,861 దరఖాస్తులను వివిధ కారణాలతో యంత్రాంగం తిరస్కరించింది. ఇక ఫాం6లకు వచ్చేసరికి మొత్తం 72,250 రాగా ఇందులో 9,628 దరఖాస్తులు ఆమోదం పొందలేదు. అదేవిధంగా ఫాం8లు 49,990 వస్తే ఇందులో 3,058 తిరస్కరించారు. మొత్తంగా తొలి నుంచి వివాదం నడచిన పర్చూరులో ఫాం7ల ద్వారా గణనీయంగా ఓట్లు తొలగించినట్లు తేటతెల్లమవుతోంది. కానీ వీటిలో 75శాతం వరకు మరణించిన వారినే తొలగించినవని, మిగిలినవి మాత్రమే నివాస ప్రాతిపదికన తొలగించినవని అధికారులు చెబుతున్నారు.

పర్చూరులోనే గణనీయంగా...

ఫాం7లకు సంబంధించి తొలగించిన ఓట్లలో ఒక్క పర్చూరులోనే దాదాపు 12,000 ఉండడంతో పాలకపార్టీ చేసిన కుట్రల వల్లే పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించబడ్డాయని టీడీపీ ఆరోపిస్తోంది. ఫాం7ల ద్వారా తొలగించిన ఓట్లలో 35 శాతం ఇక్కడే ఉండడం, మిగిలిన 5 నియోజకవర్గాల్లో కలిపి 34,191 ఉండడం ఫాం7లద్వారా లబ్ధి పొందాలని చూసిన పాలకపార్టీ ప్రయత్నాలు ఫలించాయేమోనన్న అనుమానాన్ని టీడీపీ వ్యక్తం చేస్తోంది.

కేసులు నమోదు చేసినా...

పర్చూరు నియోజకవర్గ ఈఆర్‌వో ఫిర్యాదు మేరకు మొత్తం 22మంది ఫాం7 దొంగలపై కేసులు నమోదు చేయగా, మరో 25 మందిపై పోలీసులు వారి విచారణ ఆధారంగా కేసులు పెట్టారు. అయినప్పటికీ ఫాం7ల విషయంలో అధికార పార్టీ తన కుట్రలు ఆపలేదని తాజాగా విడుదల చేసిన తుది ప్రచురణను పరిశీలిస్తే అర్థమవుతోంది. ఫాం7 ద్వారా తొలగించిన అత్యధిక ఓట్లు ముసాయిదా జాబితా విడుదలైన గతేడాది అక్టోబరు 27 నుంచి డిసెంబరు 9 వరకు జరిగిన సవరణ ప్రక్రియలోనే ఉన్నాయి. వీటిలో ఎక్కువ శాతం యంత్రాంగం తిరస్కరించిన వాటి స్థానంలో మళ్లీ ఫాం7 దొంగలు వాటిని దరఖాస్తు చేశారని, ఈ ఓట్లే ప్రస్తుతం తొలగించబడ్డాయని టీడీపీ ఆరోపిస్తోంది.

మళ్లీ అభ్యంతరాలు లేవనెత్తుతాం...

ఆయా నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాను జల్లెడ పట్టే కార్యక్రమం ఇప్పటికే టీడీపీ చేపట్టింది. అర్హత కలిగి తీసేసిన ఓట్ల వివరాలతో మళ్లీ అభ్యంతరాలను లేవనెత్తుతామని, అవసరమైతే ఆధారాల సహా ఎన్నికల కమిషన్‌ను కలుస్తామని కూడా టీడీపీ నేతలు చెబుతున్నారు. ముఖ్యంగా పర్చూరు నియోజకవర్గంలో ప్రతి బూత్‌లో పరిశీలిస్తామని, అవకతవకలు వెల్లడైతే యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తామని చెబుతున్నారు.

ఇంకా పెండింగ్‌లో దరఖాస్తులు..

గతేడాది డిసెంబరు9 వరకు మాత్రమే వచ్చిన దరఖాస్తులతో ప్రస్తుతం తుది ప్రచురణ విడుదలైంది. ఆ తర్వాత వచ్చిన దాదాపు 2,000 ఫాంలకు సంబంధించి ప్రస్తుతం కసరత్తు మొదలైంది. ఈసీకి సంబంధించిన వెబ్‌సైట్ తుది ప్రచురణ విడుదలయ్యే వరకు ఫ్రీజ్‌లో ఉంది. అది బుధవారమే తిరిగి పనిచేయడం ప్రారంభమవడంతో యంత్రాంగం పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించింది. వీటితో అనుబంధ ప్రచురణ విడుదల చేస్తామని యంత్రాంగం చెబుతోంది. మరోవైపు కొత్త ఓట్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ తదితర ప్రక్రియ అంతా గతంలో మాదిరిగానే జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందు తుది ప్రచురణకు అనుబంధంగా సప్లిమెంట్‌ను ప్రచురిస్తామని అప్పటివరకు కొత్త ఓటు నమోదుతో పాటు ఫిర్యాదులను స్వీకరిస్తామని యంత్రాంగం చెబుతోంది.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, జనవరి 25: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం లక్ష తములపాకులతో పూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం పూజలు నిర్వ హించారు. 11 ఆవృత్తములుగా వేదపండితులు, అర్చకులు లక్ష తమల పాకులతో పూజ నిర్వహించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన శ్రీన్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, కుటుంబసభ్యులు వ్యవహరించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు.





రాష్ట్రంలో అరాచకం, విధ్వంసమే!

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజం

పర్చూరు, జనవరి 25: వైసీపీ ప్రభుత్వంలో అక్కా చెల్లెమ్మలకు అసరా కరువైందని, టోకరాగానే మిగిలిందని, రాష్ట్రంలో అభివృద్ధి తప్ప అరాచకం, విధ్వంసమే కొనసాగుతుందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజమెత్తారు. ఈమేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నాడు అధికారం కోసం, నేడు అధికారంలోకి వచ్చాక కల్లబొల్లి మాటలతో మహిళలను నిట్టని లువునా మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉంటే 79 లక్షల మందికే ఆసరా అంటూ సకాలంలో డ్వాక్రా రుణాలను చెల్లించిన 75శాతం మహిళలకు టోకరా వేయటం మోసం కాదా అని ఏలూరి సాంబశివరావు ప్రశ్నించారు.

నిత్యావసర వస్తువుల ధరలు, అప్పులు, పన్నుల చార్జీలతో ఒక్కో కుటుంబంపై రూ.8లక్షల భారం మోపా రన్నారు. మద్యపాన నిషేధమని చెప్పి అధికారం లోకి వచ్చాక నాసిరకం మద్యంతో మహిళల మంగళసూత్రాలను బలిగొం టున్నారని ఆరోపించారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు అడ్డాగా రాష్ట్రాన్ని మార్చారని మండిపడ్డారు. రానున్న ఎన్ని కల్లో మహిళలు సంఘటితంగా అహంకార, విధ్వంస ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు.

వైసీపీకి నీలం శామ్యూల్ మోజెస్ రాజీనామా

చీరాల, జనవరి 25: వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నీలం శామ్యూల్ మోజెస్ పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధ్యక్షుడికి తన రాజీనామా లేఖను పంపినట్టు తెలిపారు. పలు అంశాలలో తగిన రీతిలో స్పందన లేకపోవటంతో పార్టీ పదవికి రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పారదర్శక పాలన టీడీపీ, జనసేనతోనే సాధ్యం

వేటపాలెం(చీరాల), జనవరి 25: రాష్ట్రంలో అరాచకపాలన సాగుతుందని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, చీరాల నియోజకవర్గ బాధ్యుడు ఆమంచి స్వాములు(శ్రీనివాసరావు) అన్నారు. సహజ వనరులను కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలంటే టీడీపీ, జనసేన పార్టీల కూటమి గెలుపు అనివార్యమని ఆయన పేర్కొన్నారు. గురువారం వేటపాలెం మండలం పందిళ్లపల్లి నుంచి దేశాయిపేట వరకు స్వాముల పాదయాత్ర చేపట్టారు. మార్గమధ్యమంలో ఎన్టీఆర్, డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. వేటపాలెం సెంటర్లో నాయకులు, కార్యకర్తలు స్వాములను గజమాలతో స్వాగతించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున చీరాల నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రియాజ్, పర్చూరు, ఎస్ఎన్ పాడు నియోజకవర్గాల పార్టీ బాధ్యులు విజయ్‌కుమార్, కె.బాబు, కార్యదర్శి గూడూరి శివరామ ప్రసాద్, ఆమంచి రాజేంద్ర, టీడీపీ కార్యకర్తలు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వాములను గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు, అభిమానులు

ప్రమాదవశాత్తు కాలువలో పడి యువకుడి మృతి

బల్లికురవ, జనవరి 25: మండలంలోని పెదఅంబడిపూడిలో గురువారం బైకుపై పొలం వెళ్లివస్తున్న గుంటుపల్లి ఈశ్వరరావు(33) అనే యువకుడు ప్రమాదవశాత్తు రోడ్డు మార్జిన్‌లో ఉన్న కాలువలో పడి మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. అంబడిపూడి గ్రామానికి చెందిన గుంటుపల్లి సింగయ్య రెండో కుమారుడు ఈశ్వరరావు పొలం పనులకై కొమ్మినేనివారిపాలెం వైపు వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో ఒక్కసారిగా బైకు మార్జిన్‌లోని నీటి గుంటలోకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అవివాహితుడు అయిన యువకుడి మృతదేహాన్ని వెంటనే నీటిలో నుంచి బంధువులు బయటకు తీశారు. రోజు మాదిరిగానే పొలం పనులకు వెళ్లిన తమ కుమారుడు విగత జీవిగా ఉండటం చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. యువకుడి మృతితో అంబడిపూడి బీసీ కాలనీలో విషాద ఛాయలు అలుముకొన్నాయి.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

చినగంజాం, జనవరి 25: భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గాయాలు పాలైన సంఘటన స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పుపల్లెపాలెంకు చెందిన దండప్రోలు దుర్గాప్రసాద్, అతని భార్య రమాదేవి భవననిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. సోపిరాల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న గృహం వద్ద కొద్దిరోజులుగా పనిచేస్తున్నారు.

గురువారం ప్లాస్టింగ్ చేస్తున్న సమయంలో దుర్గాప్రసాద్ పరంజాపై నుంచి జారి కిందగల సోపిరాల టౌన్ ఫీడర్ 11 కేవీ విద్యుత్ తీగలపై పడ్డారు. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్‌కు కుడి కాలు, ఎడవ చేయికి తీ వ్ర గాయాలయ్యాయి. గాయపడిన అతనిని తోటి కార్మికులు ప్రైవేటు వాహనంలో నరసరావు పేట ప్రైవేటు వైద్యశాల కు తరలించారు. దుర్గాప్రసాద్ ప్రమాదానికి గు రైన సమయంలో అతని భార్య రమాదేవి కూడా అక్కడే పనిచేస్తుంది.

నేడు ఎమ్మెల్యే ఏలూరి జన్మదిన వేడుకలు

మార్టూరు, జనవరి 25: తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు 47వ జన్మదిన వేడుకలను శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లుచేశారు. ఉదయం 10 గంటలకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మార్టూరులోని పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం ద్విచక్రవాహనాలపై ర్యాలీగా మార్టూరులో తూర్పు బజారున వినాయకుని విగ్రహం వద్దకు చేరి అక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడినుంచి పడమర బజారు గుండా ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం ఏలూరికి జన్మదిన శుభా కాంక్షలను తెలియచేస్తూ కేక్ కట్ చేస్తారు. మధ్యాహ్నం భారీగా అన్నదానం ఏర్పాటుచేశారు. జన్మదిన కార్యక్రమాలకు ఏలూరి అందుబాటులో ఉండరని పార్టీ నాయకులు తెలిపారు. మండలంలోని ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వలపర్ల గ్రామంలో కొమ్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తమ అధికారి అవార్డు

చీరాల, జనవరి 25: మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని చీరాల నియోజకవర్గంలో ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారిగా గుర్తించారు. గురు వారం బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా రామచంద్రారెడ్డి అవార్డు అందుకున్నారు. ఈసంద ర్భంగా పలువురు అభినందించారు.

ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలి

చినగంజాం, జనవరి 25: ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని తహ సీల్దార్ పాలపర్తి పార్వతి అన్నారు. నూతనంగా ఓటు కలిగిన యవతీయువకులు తమ ఓటును వినియోగించుకోవాలని చెప్పారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం వద్ద నుంచి మండల సముదాయ కార్యాల యాల ఎదురుగా గల ఆర్అండ్బీ రోడ్డు వరకు రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ విద్యార్థిను లు, అధికారులు, ఉపాధ్యాయులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశా రు. తహసీ ల్దార్ కార్యాలయంలో ఓటు కలిగిన సీనియర్ సీటిజన్స్ మార్కాపురం వెంకటసుశీల, తెలిమల్లి సుశీలను తహసీల్దార్ సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ అధికారులు, గ్రామ రెవె న్యూ అధికారులు, వీఆర్ఏలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం

చీరాల, జనవరి 25: ఎన్నికలలో ప్రతి ఓటు కీలకం, అందుకు సం బంధించిన బాధ్యులు సమన్వయంతో అడుగులు వేస్తే సత్ఫలితాలు వస్తాయని ఇంటిగ్రేటెడ్ శిక్షణకు హాజరైన బాధ్యులకు శిక్షకులు చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఉదయం, సాయంత్రం రెండు విభాగాలుగా నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్లు, బూ త్ ఇన్చార్జులకు శిక్షణ ఇచ్చారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రధానంగా పోలింగ్ రోజు అనుసరించాల్సిన విధి, విధా నాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ పరిధిలోని ట్రైనర్స్ గ్లోరి ఎనెట్, బేతపూడి సురేష్, సుబ్బారాయుడు, దయాబాబు, నాగినేని రామకృష్ణ, నక్కల శ్రీనివాసరావు, ఆట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.























అద్దంకి పోలీసుల రూటే సప'రేటు'

- చోరీలలో సొత్తు రికవరీ అయితేనే కేసులు నమోదు
- చేతులు తడిపితేనే ఇసుక రవాణాకు రైట్.. రైట్
- బెల్ట్‌షాపులలో పట్టుబడ్డ మద్యం కేసులలోనూ కక్కుర్తి
- పెద్ద మొత్తంలో బాటిళ్ళు పట్టుబడినా.. కేసులో మాత్రం సింగిల్ డిజిట్ దాటదు!

అద్దంకి, జనవరి 25: అద్దంకి పోలీసుల తీరే వేరేగా ఉంటుందన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల చోటుచేసుకుంటున్న పలు సంఘటనలు అద్దంకి పోలీసుల తీరును తేటతెల్లం చేస్తున్నాయి. అద్దంకి పట్టణంలో తరచూ మోటార్‌సైకిళ్ళ దొంగతనాలు, ఇతర చిల్లర దొంగతనాలు జరుగుతున్నాయి. అయితే పోలీస్ స్టేషన్ లో నమోదు అవుతున్న కేసులు మాత్రం అత్యల్పం మాత్రమే. కేసులు నమోదు చేస్తే రికవరీ చేయాల్సి వస్తుందన్న భయంతో అసలు కేసులే నమోదు చేయటంలేదని పలువురు బాధితులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, పొరపాటున ఎక్కడైనా దొంగలు దొరికి, సొత్తు రికవరీ అయితే మాత్రం ఆగమేఘాల మీద కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల ఓ దొంగతనం కేసుకు సంబంధించి సొత్తు చోరిగిన మొత్తం కాకుండా కొద్దిమేర మాత్రమే రికవరీ అయిందని, అంతవరకే చోరీ జరిగినట్లు ఫిర్యాదు తీసుకోవటం కూడా పలువిమర్శలకు తావిచ్చింది. ఫిర్యాదుదారడు మొత్తుకున్నా పోలీసులు మాత్రం వినిపించుకోకుండా వారి పంథా లోనే కేసు నమోదు చేశారని బాధితుడు వాపోయాడు.

అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుండి ఇసుక రవాణా నిలిచిపోవటం అద్దంకి పోలీసులకు కాసుల పంట కురిపిస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. మామూళ్లు పుచ్చుకుంటే మాత్రం రాత్రి సమయాలలో ఇసుక రవాణా కు రైట్ రైట్ చెబుతున్నారని, అలా కాకపోతే మాత్రం కేసులు నమోదు చేస్తున్నారని పలువురు ఇసుక రవాణాదారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల చోటుచేసుకున్న పలు సంఘటనలను ఉదహరిస్తున్నారు. ఇటీవల వరుసగా రెండు రోజులపాటు ఇసుక ట్రాక్టర్‌లను పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో కొన్నింటిపై మాత్రమే కేసులు నమోదు చేసి మిగిలిన వాటిని వదిలివేయటం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఇసుక ట్రాక్టర్ ను పట్టుకోవటంతో ఓ గ్రామ వైసీపీ నాయకుడు నియోజకవర్గ కీలకనేత చేత ఫోన్ చేయించినట్లు సమాచారం. కీలక నేత చెప్పినందున ఎలాంటి కేసు లేకుండా వదిలివేస్తారని భావించాడు. తీరా చూస్తే కీలకనేత చేత ఫోన్ చేయించిన



అద్దంకి పోలీస్ స్టేషన్

గ్రామస్థాయి నాయకుడు ట్రాక్టర్ పై కేసు నమోదు కాగా, ఎలాంటి సిఫార్సులు లేకుండా పోలీసులను కలిసి చేతులు తడిపిన ఇసుక రవాణాదారుల ట్రాక్టర్‌లపై ఎలాంటి కేసులు లేకుండా వదిలివేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న అధికార పార్టీ కీలక నేత ఆఘమేఘాల మీద పోలీస్ అధికారిని పిలిపించి ప్రశ్నించినట్లు సమాచారం.

ఇక బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నప్పటికి పోలీస్ అధికారులు మాత్రం తమకు కేసులు అవసరమైనప్పుడు మాత్రమే దాడులు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దాడులలో పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్ళు పట్టుబడ్డా కేసులో మాత్రం అత్యల్పంగా సింగిల్ డిజిట్ తోనే సరిపెడుతున్నట్లు తెలుస్తుంది. బుధవారం రాత్రి అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో పోలీసులు దాడి చేసి పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. 46 మద్యం బాటిళ్ళు పట్టుబడ్డట్లు తొలుత ప్రకటించిన పోలీసులు కొద్దిసేపటికే మాట మార్చేశారు. కేవలం 8 బాటిళ్ల మద్యం మాత్రమే పట్టుబడినట్టు కేసు నమోదు చేశారు. దీనికి ప్రతిఫలంగా పెద్ద మొత్తంలో చేతులు మారుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇలా అన్ని విధాలుగా అద్దంకి పోలీసులు తమ రూటే సపరేట్ అన్నవిధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల నూతనంగా అద్దంకి పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు తీసుకున్న సీఐ అయినా మార్పు తీసుకు వస్తారా లేక పాత పద్ధతినే కొనసాగనిస్తారా అని పలువురు గుసగుసలాడుతున్నారు.

ఆడుదాం ఆంధ్రపోటీల్లో పాల్గొనేందుకు నిరాకరణ

- ప్రభుత్వం ఇచ్చిన క్రికెట్ కిట్లను పడవేసి నిరసన వ్యక్తం చేసిన క్రీడాకారులు



ఎంపీడీవో కార్యాలయం ముందు క్రికెట్ కిట్లను పడవేసి నిరసన వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

బల్లికురవ, జనవరి 25: ఆడుదాం ఆంధ్ర పోటీలలో తమను ఆడనీయకుండా వెనక్కి పంపారని బల్లికురవ గ్రామ క్రికెట్ క్రీడాకారులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ముందు ప్రభుత్వం ఇచ్చిన క్రికెట్ కిట్లను నేలపై పడవేసి నిరసనకు దిగారు. బల్లికురవ మండల స్థాయిలో గత పది రోజుల నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పలురకాల పోటీలు జరిగాయి. క్రికెట్ ఆడేందుకు మొత్తం పది జట్లు వచ్చాయి. వాటిల్లో మూడు జట్టు విజేతలుగా నిలిచాయి. వాటిల్లో మరలా పోటీలు నిర్వహించగా బల్లికురవ జట్టు మండల స్థాయిలో విజేతగా నిలిచింది. వారికి గురువారం అద్దంకిలో నియెజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. క్రీడాకారులు పోటిల్లో పాల్గొనేందుకు అక్కడకు వెళ్లగా అక్కడ అధికారులు మీపేర్లు ఆన్‌లైన్‌లో లేవని, గతంలో నమోదయిన వారే పోటీలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. తాము మండలస్థాయిలో విజేతలుగా నిలిచామని, తీరా ఇప్పుడు వద్దంటారు ఏమిటని నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ వారికి పోటీల్లో పాల్గొనే అవకాశం ఇవ్వలేదు. దీంతో వారు బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కింద ఇచ్చిన క్రికెట్ కిట్లను నేలపై పడవేసి నిరసనకు దిగారు. కార్యాలయం ముందు పడవేసి ఉన్న సామగ్రిని చూసి అక్కడ ఉన్న పలువురు ప్రజలు ప్రభుత్వం ఇలా ప్రజాధనాన్ని వృధా చేసిందని విమర్శలు గుప్పించారు.



అద్దంకిలో ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యం



అద్దంకిలోని భవానిసెంటర్‌లో బారులు తీరిఉన్న వాహనాలు

అద్దంకి, జనవరి 25: అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలం అవుతుంది. పోలీసులు కూడా అప్పుడప్పుడు మాత్రమే హడావుడి చేయటం మినహా శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా నామ్ రహదారిలో వాహనాల రాకపోకలు బాగా పెరగటంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతుంది. దీనికితోడు భవానిసెంటర్ లో ఐదువైపుల నుంచి వచ్చే వాహనాలు రోడ్లు దాటాల్సి ఉన్నప్పటికీ ట్రాఫిక్ ఐలాండ్ లేకపోవటంతో వాహనచోదకులు అడ్డదిడ్డంగా వెళుతున్నారు. దీంతో నామ్ రహదారిపై రెండు వైపులా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోతున్నాయి. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతున్నా పోలీస్ అధికారులు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పోలీస్, మున్సిపల్ అధికారులు స్పందించి అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

జాబ్ మేళాలో 53 మందికి ఉద్యోగాలు

అద్దంకిటౌన్, జనవరి 25: కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 53 మంది విద్యార్థులు వివిధ సంస్థలలో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు తెలిపారు. మొత్తం 176 మంది అభ్యర్థులు రాగా హీరో మెట్రో కార్ప్‌కు 11 మంది, పేటీఎంలో 17 మంది, యూఐటీ యూనివర్స్‌లో 21 మందితోపాటు పలు కంపెనీలలో మొత్తం 53 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలలో ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మోహనరావు తెలిపారు.

ఎంపిక అయిన విద్యార్థులను కళాశాల జేకేసీ యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.





ఆసరా కాదు.. టోకరా!

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య ధ్వజం



చీరాల, జనవరి 25 : సీఎం జగన్ ఆసరా పేరుతో చేసేదంతా టోకరా అని, గోరంత సాయం చేసి కొండంత ప్రచారం ఆర్భాటంతో మహిళలను వంచిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి కొండయ్య ఓప్రకటన విడుదల చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో మహిళల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలతో పోలిస్తే జగన్ చేసింది గోరంత మాత్రమేనన్నారు. జగన్ ఒంటెద్దు పోకడతో చేపట్టిన చర్యలతో రాష్ట్రం అధోపాతాళానికి వెళ్లిందన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాల్సిన అవశ్యతను కొండయ్య వివరించారు.









రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

చీరాలటౌన్, జనవరి 25: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి సుమారు 50 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ఘటన చీరాల - జాండ్రపేట రైల్వే స్టేషన్ల మధ్య జరిగింది. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఈమేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వివరాలు తెలిసిన వారు చీరాల రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కొండయ్య తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేత

చీరాల, జనవరి 25: స్థానిక ఎన్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఆడుదాం అంధ్రా కార్యక్రమంలో నిర్వహించిన క్రీడాపోటీలు గురువారంతో ముగిశాయి. చీరాల అర్బన్, చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఆర్డీవో సరోజిని, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎంపీడీవో నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

చీరాల, జనవరి 25: నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి చేపట్టిన చర్యలతో సత్ఫలితాలు వస్తున్నాయని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ చెప్పారు. మండల పరిధిలోని బోయినవారి పాలెంలో రూ.2.23 కోట్లు వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, సచివాలయ భవవాన్ని గురువారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అంకాళరెడ్డి, బోయిన కేశవులు, బండారు శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తాపడి డ్రైవర్‌కు స్వల్పగాయాలు


పంగులూరు, జనవరి 25: తారులోడుతో వెళుతున్న లారీ అదుపు తప్పి ఫ్లైఓవర్‌పై రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈఘటన గురువారం ఉదయం జాతీయ రహదారిపై ముప్పవరం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. విజయ వాడ నుంచి నెల్లూరు వైపు తారు లోడుతో వెళుతున్న లారీ ఉదయం 8 గంటల సమయంలో అదుపుతప్పి ముప్పవరం ప్రధాన కూడలిలోగల ఫ్లైఓవర్‌పై గుంటూరువైపు వెళ్లే రోడ్డుపై తిరగబడింది. ఈఘటనతో గుంటూరు వైపు వెళ్ళే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను సర్వీస్ రోడ్డువైపు మళ్ళించారు. తమిళనాడు రాష్ట్రం తిరునల్‌వెళ్లి జిల్లా సీతారాంకొండన్ మండలం నాయుడు తీరు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ఇనాసిముత్తుకు స్వల్ప గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 26 జనవరి 2024

బిల్లుల చెల్లింపుల్లో 'నీరు'గార్చుతున్నారు!

- నీరు-చెట్టు పనులకు రూ.15 కోట్ల బడ్జెట్ విడుదల
- మూడు నెలల క్రితమే ఇచ్చిన ప్రభుత్వం
- కానీ బిల్లుల అప్‌లోడ్‌లో అధికారుల నిర్లక్ష్యం
- అసలు నిధులు ఇచ్చిన విషయమే తెలియని వైనం
- ఇప్పుడు సీఎఫ్ఎంఎస్ ఫేస్-2తో అప్‌లోడ్‌కు ఇబ్బందులు
- ఆర్థికంగా కుంగిపోతున్న కాంట్రాక్టర్లు

దేవుడు వరమిచ్చినా పూజారి కరునించలేదన్న సామెతలా మారింది నీరు-చెట్టు పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి. గత ప్రభుత్వంలో చేసిన పనులకు కొన్నేళ్లపాటు కోర్టుల్లో పోరాడి బడ్జెట్ తెచ్చుకున్నామన్న సంతోషం ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆవిరవుతోంది. బడ్జెట్ రాకపోవడంతోనే బిల్లులు అప్‌లోడ్ చేయలేకపోతున్నామని చెప్పే అధికారులు, నీరు-చెట్టు పనుల విషయంలో బడ్జెట్ ఇచ్చినా బిల్లులు అప్‌లోడ్ చేయడం లేదు. కనీసం బడ్జెట్ విడుదలైనట్లు కూడా అధికారులకు తెలియదంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపు మూలంగా ఇప్పటికే చితికిపోయిన కాంట్రాక్టర్లు ఇప్పుడు ఇరిగేషన్ అధికారుల తీరుతో మరింత కుంగిపోతున్నారు. ఎప్పుడో అక్టోబరులో బడ్జెట్ వస్తే ఇంతవరకు బిల్లులు అప్‌లోడ్ చేయకపోవడం వారిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.



నెల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం ప్రభుత్వంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నీరు - చెట్టు కింద 13,780 పనులు మంజూరవగా రూ.711 కోట్లతో పది వేల వరకు పనులు పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి జిల్లాలో సుమారు రూ.200 కోట్ల వరకు నీరు - చెట్టు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వంలో జరిగిన పనులు కావడంతో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ బిల్లులన్నీ పక్కన పెట్టేసింది. చిన్న చిన్న కాంట్రాక్టర్లు ఎన్ని విన్నపాలు చేసుకున్నా, నిరసనలు తెలియజేసినా పట్టించుకోలేదు. పైగా ఈ పనులపై మొదట విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆ తర్వాత కూడా బిల్లుల చెల్లింపు జరగలేదు. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు ఒక్కొక్కరుగా హైకోర్టును ఆశ్రయిస్తూ వస్తున్నారు. బిల్లులు చెల్లించాలంటూ అత్యున్నత ధర్మాసనం ఆదేశాలిస్తోంది. ఈ నేపథ్యంలో మరోసారి ఇరిగేషన్ శాఖ అధికారుల చేతనే నీరు-చెట్టు పనులను పరిశీలించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇలా పరిశీలన జరిగాక కూడా బిల్లులు ఇవ్వలేదు. మరోవైపు కోర్టు ధిక్కరణ కేసులు ఎక్కువైపోతుండటంతో ఈదఫా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ వంటి ఇతర శాఖల ఇంజనీర్లతో థర్డ్‌పార్టీ కింద విచారణ జరిపింది. ఈ అన్నీ విచారణల్లో నీరు-చెట్టు పనుల్లో అవినీతి జరిగినట్లు రుజువు కాలేదు. దీంతో కోర్టుకెళ్లిన కాంట్రాక్టర్లకు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో బిల్లులు చెల్లిస్తూ వస్తోంది.

కొత్త విధానంతో ఆలస్యం

హైకోర్టులో రిట్ పిటిషన్ల ఒత్తిడి తట్టుకోలేక పెండింగ్ ఉన్న నీరు-చెట్టు బిల్లులు చెల్లించేందుకు జిల్లాకు రూ.15 కోట్లు బడ్జెట్ విడుదల చేశారు. గతేడాది అక్టోబరులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల హెడ్‌లకు ఈ బడ్జెట్ విడుదలైంది. అయితే, బడ్జెట్ ఇచ్చినా బిల్లులు రాకపోవడంపై రాష్ట్ర ఉన్నతాధికారులు సమీక్షించిన తర్వాత గానీ జిల్లాలోని ఇంజనీర్లకు విషయం తెలియలేదని ఇరిగేషన్‌శాఖలో చెప్పుకుంటున్నారు. ఆ తర్వాత హడావిడిగా బిల్లులు అప్‌లోడ్ చేయడం ప్రారంభించారు. గత డిసెంబర్ 15వ తేదీ తర్వాత నుంచి సీఎఫ్ఎంఎస్ ఫేజ్-2 విధానం అమల్లోకి వచ్చింది. అంటే అంతకముందు వరకు బిల్లుల అప్‌లోడ్‌కు వర్క్ ఆబ్‌స్ట్రాక్ సరిపోయేది. దీంతో సులభంగా బిల్లును అప్‌లోడ్ చేసేవారు. కానీ సీఎఫ్ఎంఎస్ ఫేజ్-2 విధానంలో బిల్లుల అప్‌లోడ్‌కు చాలా నిబంధనలు చేర్చారు. వర్క్ ఆబ్ స్ట్రాక్ మాత్రమే కాకుండా ఎంబుక్‌లను కూడా డిజిటలైజ్ చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. సంబంధిత వర్క్ చేయించిన జేఈ, డీఈఈ, ఈఈల లాగిన్ల ద్వారా బిల్లును అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. ఇలా ప్రతి డాక్యుమెంట్‌నూ డిజిటలైజ్ చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో తప్పులు లేకుండా చూసుకునేందుకు చాలా సమయం పడుతోంది. దీంతో బిల్లుల అప్‌లోడ్ ఆలస్యమవుతున్నట్లు ఇంజనీర్లు చెబుతున్నారు. బడ్జెట్ విడుదలైన వెంటనే అధికారులు మేల్కొని ఉంటే సీఎఫ్ఎంఎస్ ఫేజ్-1లోనే బిల్లులు అప్‌లోడ్ జరిగిపోయి ఉండేవని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. జిల్లాకు వచ్చిన బడ్జెట్‌లో ఇప్పటివరకు సుమారు 7 కోట్ల వరకు బిల్లులు అప్‌లోడ్ చేయగా ఇంకా రూ.8 కోట్లకు అప్‌లోడ్ చేయాల్సి ఉందని సమాచారం. కాగా, కాంట్రాక్టర్లు పర్సంటేజీ ఇవ్వకపోవడంతోనే కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగా బిల్లులను అప్‌లోడ్ చేయడం లేదన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇప్పటికే పనులు చేసి ఐదేళ్లు దాటడం, పెట్టిన పెట్టుబడికి వడ్డీలు తడిసి మోపెడవడంతో నీరు-చెట్టు కాంట్రాక్టర్లు ఆర్థికంగా చితికిపోయి ఉన్నారు. కోర్టులో పోరాటం ఫలితంగానైనా బిల్లులు తెచ్చుకుందాంలే అనుకున్న వారి ఆశలకు ఇరిగేషన్ అధికారుల రూపంలో గండిపడుతోంది.

వేగంగా అప్‌లోడ్ చేస్తున్నాం

నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపునకు బడ్జెట్ విడుదలైన మాట వాస్తవమే. వీలైనంత వేగంగా బిల్లులను అప్‌లోడ్ చేస్తున్నాం. బిల్లుల అప్‌లోడ్‌కు ఇప్పుడు అన్ని రికార్డులను డిజిటలైజేషన్ చేసి జేఈ, డీఈ, ఈఈల లాగిన్‌లో ఆమోదించాల్సి ఉండడంతో కొంత ఆలస్యం జరుగుతోంది. వీలైనంత త్వరగా బిల్లులను అప్‌లోడ్ చేసి ఎవరికీ ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- నాగరాజు, ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ

సోమశిలలో 27.379 టీఎంసీలు నీరు



అనంతసాగరం, జనవరి 25: సోమశిల పూర్తి సామర్థ్యం 77టీఎంసీలు కాగా గురువారం నాటికి జలాశయంలో 27.379 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2300, ఉత్తర కాలువకు 500, దక్షణ కాలువకు 200 క్యూసెక్యూలు సరఫరా చేస్తున్నట్లు వారు తెలిపారు.



ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ

విద్యుద్దీప వెలుగుల్లో కలెక్టరేట్



గణతంత్ర వెలుగులు

- ముస్తాబైన పోలీస్ కవాతు మైదానం
- అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు



75వ గణతంత్ర దినోత్సవ నిర్వహణకు సర్వం సిద్ధమైంది. జిల్లా పాలన కేంద్రం కలెక్టరేట్‌ను విద్యుద్దీప వెలుగుల్లో నింపేశారు. జిల్లా కేంద్రం నెల్లూరులో జరిగే కార్యక్రమానికి పోలీస్ కవాతు మైదానాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. ప్రముఖులు విచ్చేస్తుండటంతో భద్రతనూ కట్టుదిట్టం చేశారు. తాము సాధించిన ప్రగతిని అతిథులకు చూపెట్టేందుకు ఆయా శాఖల అధికారులు శకటాలను సిద్ధం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించనున్నారు. కాగా, విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం జేసీ రోణంకి కూర్మనాథ్, డీఆర్వో లవన్న, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరినీ డీఎఫ్ఎండీ ద్వారా తనిఖీ చేసి లోపలకు పంపాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

- నెల్లూరు(హరనాథపురం)

నిరాడంబర నేతకు అత్యున్నత పురస్కారం

పద్మ విభూషణుడు మన వెంకయ్య!

చవటపాళెం నుంచి ఢిల్లీ స్థాయికి ఎదిగిన నేత



వినమ్రంగా స్వీకరిస్తున్నా..

అమృత కాలం దిశగా భారతదేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న ప్రస్తుత తరుణంలో భారత్ ప్రభుత్వం ప్రకటించిన పద్మ విభూషణ్ పురస్కారాన్ని వినమ్రంగా స్వీకరిస్తున్నాను. దేశంలోని రైతులు, యువత, మహిళలు సహా నవ భారత నిర్మాణంలో భాగస్వాములు అవుతున్న ప్రతి ఒక్కరికీ నా పురస్కారాన్ని సగర్వంగా అంకితం చేస్తున్నా. ఈ పురస్కారం నా బాధ్యతను మరింతగా పెంచిందని భావిస్తూ నవభారత నిర్మాణం దిశగా ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని ఆకాంక్షిస్తున్నాను. శక్తివంతమైన, ఆత్మనిర్భర భారత నిర్మాణానికి ప్రజలతో కలిసి నడుస్తానని సవినయంగా తెలియజేస్తున్నా"

నెల్లూరు (ఆంధ్రజ్యోతి/క్రైం)/వెంకటాచం, జనవరి 25 : క్రమశిక్షణ, పట్టుదల, నమ్మిన సిద్ధాంతాన్ని అంటిపెట్టుకుని ఉండటం, విలువలు పాటించడంతోనే జిల్లాకు చెందిన ముప్పవరపు వెంకయ్యనాయుడు రాష్ట్రపతి పదవి వరకు ఎదిగారు. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఆయన తన అత్త, మామలు, సోదరీమణుల ఆప్యాయత అనురాగాల మధ్య పెరిగారు. నెల్లూరులోని వీఆర్ కళాశాలలో చదివే సమయంలో వెంకయ్యనాయుడు విద్యార్థి సంఘ నాయకుడిగా ఎదిగారు. ఒక విధంగా చెప్పాలంటే ఇక్కడి నుంచే ఆయన రాజకీయాలవైపు వెళ్లేందుకు బీజం వేసింది . తొలిసారిగా వీఆర్ కళాశాల విద్యార్థి సంఘ ఉపాధ్యక్ష పదవిని చేపట్టిన వెంకయ్యనాయుడు విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేశారు. మంచి నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. వెంకయ్యనాయుడులోని చురుకుదనం, మొక్కవోని వ్యక్తిత్వం, వెనుతిరగని మనస్తత్వం తదితర లక్షణాలు అప్పట్లో ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ఉన్న దుర్గాప్రసాద్‌ను ఆకర్షించాయి. ఫలితంగా వెంకయ్యను దుర్గాప్రసాద్ మరింత క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా మార్చారు. దేశభక్తిని, ఆర్ఎస్ఎస్ భావజాలన్ని వెంకయ్యనాయుడు చిన్నతనంలోనే నరనరాన నింపుకున్నారు. వెంకయ్యనాయుడు తన రాజకీయ జీవితంలో సైద్ధాంతిక పోరాటం చేశారేతప్ప వ్యక్తులతో పోరాటం చేయలేదు. ఆయన ఏవ్యక్తిని, ఏ నాయకుడిని వ్యక్తిగతంగా విమర్శించిన దాఖలాలుల లేవు. ఈకారణం చేతనే ఆయనకు దేశవ్యాప్తంగా ప్రత్యర్థులు లేనటంలో అతిశయోక్తి లేదు.

అసెంబ్లీ టైగర్‌గా పేరు

వెంకయ్యనాయుడు చిన్నతనం నుంచి హుందాగానే రాజకీయాలు చేశారు. 1977లో ఆయన జనతాపార్టీ అభ్యర్థిగా ఒంగోలు పార్లమెంటు స్థానం నుంచి పోటీ ఓడిపోయారు. తరువాత 1978లో జనతా పార్టీ నుంచి, 1983లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1985లో జరిగిన ఎన్నికల్లో ఆత్మకూరు నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 1978 నుంచి ఆయన శాసనసభలో తన వాగ్ధాటితో అవినీతి, అక్రమాలపై చర్చిస్తూ అసెంబ్లీ టైగర్‌గా గుర్తింపు పొందారు. 1983లో విజయం సాధించిన తరువాత రాష్ట్రంలో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని నాదెండ్ల భాస్కర్‌రావు కూలదోసిన సమయంలో జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో వెంకయ్యనాయుడు అత్యంత కీలకంగా వ్యవహరించారు.

ఎన్నో సేవలు, మరెన్నో ప్రశంసలు

మారుమూల గ్రామం నుంచి అంచలంచెలుగా ఎదిగి ఉన్నత పదవులు అలంకరించిన వెంకయ్యనాయుడు రాజకీయలతోపాటు సేవా కార్యక్రమాల్లోనూ తనదైన ముద్రవేశారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అని నమ్మే వెంకయ్య కన్నతల్లిని, మాతృబాషను, జన్మభూమిని ఎప్పటికీ మరవకూడదని తరచూ చెబుతుంటారు. ఆయన మాటల్లో చెప్పటమే కాకుండా చేతల్లోనూ చేసి చూపించారు. స్వర్ణభారత్ ట్రస్టు ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్న వెంకయ్య రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంతోమంది నుంచి ప్రశంసలు అందుకున్నారు.

కుటుంబ నేపథ్యం

పూర్తి పేరు : ముప్పవరపు వెంకయ్యనాయుడు
సతీమణి : ముప్పవరపు ఉషమ్మ
సంతానం : కుమారుడు : హర్షవర్ధన్
కుమార్తె : దీపావెంకట్

బాల్యం, విద్యాభ్యాసం

1949 జూలై 1న నెల్లూరుజిల్లాలోని వెంకటాచలం మండలం చవటపాళెంలోని ఓ వ్యవసాయ కుటుంబంలో రంగయ్య నాయుడు, రమణమ్మ దంపతులకు వెంకయ్య జన్మించారు. బుచ్చిరెడ్డిపాలెం హైస్కూలులో విద్యను, వీఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఆ తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు.

నైతిక విలువలతో ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 25 : నైతిక విలువలతో ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో 14వ జాతీయ ఓటరు దినోత్సవ సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. భావితరాలకు ప్రజాస్వామ్య విలువలను అందించేలా, దేశం అత్యంత శక్తివంతంగా తయారయ్యేలా యువకులు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. ఓటు హక్కుతోనే సరైన వ్యక్తిని ఎన్నుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముందు నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు, అధికారులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జేసీ, డీఆర్వో లవన్న, ఆర్డీవో మలోల, ట్రాఫిక్ డీఎస్పీ సుభాన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

కార్పొరేషన్ కమిషనర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ అవార్డు



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న కమిషనర్ వికాస్

నెల్లూరు (సిటీ),జనవరి 25 : లోపాలు రహితంగా ఓటర్ల తుది జాబితాను రూపొందించడంలో ప్రతిభ కనపరిచినందుకు నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డును అందించింది. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సం సందర్భంగా విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి అవార్డును అందుకున్నారు. నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఈఆర్వోగా వ్యవహరిస్తున్న కమిషనర్ ఇటీవల సమ్మరీ రివిజన్ అనంతరం ముసా యిదా ఓటరు జాబితా తయారీ, అందిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి తుది జాబితా తయారీలో నాణ్యతకు ప్రాధాన్య మిస్తూ జాబితా రూపకల్పన చేసినందుకు ఈ అవార్డు కమిషనర్‌కు దక్కింది.

ఎన్నికల వేళ.. నెరవేరనున్న కల

సార్వత్రిక ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో ప్రజలను ఆకట్టుకునేందుకు జగన్ ప్రభుత్వం సిద్ధమైంది. 2019లో అధికారాన్ని చేపట్టినప్పటి నుంచి పేదోడి సొంతంటి కల టిడ్కో ఇళ్లను మూలనపడేసిన వైసీపీ ప్రభుత్వం తాజాగా మళ్లీ వాటిని పంపిణీ చేస్తామంటూ తెరపైకి తీసుకువస్తుంది. ఎప్పుడో పంపిణీకి సిద్ధమై రూపు కోల్పోయిన ఇళ్లకు రంగులు రుద్ది ఈ నెలాఖరున లబ్ధిదారులకు అందచేయాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. తొలుత 30వ తేదీ పంపిణీ చేయాలని హంగు, ఆర్భాటాలతో అంతంతా మాత్రంగా సౌకర్యాలు కల్పించిన అధికారులు ఆపై ఎప్పుడన్నది స్పష్టమైన ముహూర్తాన్ని ప్రభుత్వం ప్రకటించలేదు.

ఈ నెలాఖరుకు 'టిడ్కో' ఇళ్ల పంపిణీ?

15,570 గృహాలు అందచేసేందుకు ప్రణాళిక



అక్కచెరువుపాడు వద్ద ప్రారంభానికి సిద్ధమైన టిడ్కో కాంప్లెక్స్

నెల్లూరు(సిటీ), జనవరి 25 : నెల్లూరు నగర పరిధిలోని వెంకటేశ్వరపురం 1, 2 విడతలతోపాటు అల్లీపురం, కల్లూరిపల్లి, కొండ్లపూడి, ఇరగాళమ్మ సంఘం, అక్కచెరువుపాడు ప్రాంతాలలో టిడ్కో ఇళ్ల సముదాయాలను టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. మొత్తం 27 వేల మందికి 300, 365, 430 చ.అ విస్తీర్ణంలో ఇళ్లను నిర్మిం చారు. వాటిల్లో వెంకటేశ్వరపు తొలి ఫేజ్‌లో 4 వేల మందికి ఇప్పటికే ఇళ్లను అందచేసిన అధికారులు రెండవ ఫేజ్‌తోపాటు అల్లీపురం, కల్లూరి పల్లి, అక్కచెరువుపాడు, కొండ్ల పూడి, ఇరగాళమ్మ సంఘం ప్రాంతాలలో మిగిలిన 23 వేల ఇళ్లకు గాను 15,570 ఇళ్ల సిద్ధం చేశారు. వీటిని ఇప్పటికే గుర్తించిన లబ్ధిదారులకు అంద చేసేందుకు టిడ్కో సిద్ధమైంది. ఈ నెలాఖరున లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో టిడ్కో, కార్పోరేషన్ అధికారులు ప్రణాళిక తయారు చేశారు. మిగిలిన ఇళ్లను మరో మూడు నెలల్లో ఇవ్వనున్నట్లు టిడ్కోలో ఓ అధికారి వెల్లడించారు.

ఖరారు కాని ముహూర్తం

పేదలకు ఉచితంగా అందచేసే 300 చ.అ విస్తీర్ణం కలిగిన ఇళ్లను అత్యధికంగా సిద్ధం చేసిన అధికారులు రూ. 25 వేల డిపాజిట్‌తో అందించే సింగల్ బెడ్‌రూం, రూ.50 వేల డిపాజిట్‌తో అందించే డబుల్ బెడ్‌రూం ఇళ్లను అయినకాడికి సిద్ధం చేశారు. మొత్తంగా 15,570 ఇళ్లను ఈ నెలాఖరున పంపిణీకి కసరత్తు చేస్తున్నారు. కాగ ప్రభుత్వం నుంచి ఖచ్చితమైన ముహూర్తం ఖరారు కాకపోవడంతో కాస్త ఆందోళనలో పడిన యంత్రాంగం లబ్ధిదారులకు మాత్రం సమాచారం అందిస్తున్నారు.

ఎన్నికల వేళ హడావుడి

సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న సమయంలో పేద, మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకునేందుకు జగన్ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను ఎరగా వేస్తోందని విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. 2019లో అధికారాన్ని చేపట్టినప్పటి నుంచి టిడ్కో గృహాలపై లేని ప్రేమ హఠాత్తుగా రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా సమాధానం కూడా ఇవ్వని అధికారులు ఇప్పుడు మీకు ఇల్లు ఇస్తాం రండీ అంటూ ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నారని చెబుతున్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామప్రజలు

నీళ్లివ్వండి మహాప్రభో!

● దాహార్తి తీర్చాలంటూ ఘాట్ రోడ్డుపై బోడేనాయక్ తండావాసుల బైఠాయింపు

● నిలిచిన వాహన రాకపోకలు

పెద్ద దోర్నాల, జనవరి 25: తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బోడేనాయక్ తాండా వాసులు బుధవారం శ్రీశైలం-దోర్నాల ఘాట్‌రోడ్డుపై బైఠాయించారు. రెండు గంటలకుపైగా ధర్నా నిర్వహించారు. దీంతో ఈ రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. శ్రీశైలం, దోర్నాల రెండు వైపులా కిలోమీటరు పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. మండలంలోని బోడేనాయక్ తాండాలో కొన్ని రోజులుగా నీటి ఎద్దడి ఎక్కువైంది. గ్రామంలో డీప్‌బోరుల్లో జలాలు అడుగంటాయి. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేవారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు రెండు రోజులుగా ట్యాంకర్లతో నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రజల తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతా వ్యవసాయ కుటుంబాలు కావడంతో పశువులు, గొర్రెలు, మేకల దాహం తీర్చేందుకు నీటి అవసర ఎక్కువగా ఉంటోంది. నీటి సరఫరా చేసే గుత్తేదారుని అడిగితే బిల్లులు రాకుండా తాము ఎన్నాళ్లు నీళ్లు తోలుతామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య తీవ్రంగా ఉండడంతో అధికారుల దృష్టికి సమస్యను తీసుకుపోయినా ప్రయోజనం లేకపోవడంతో రోడ్డెక్కారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై అంకమరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి, ఎంపీడీవో నాసర్‌రెడ్డికి ఎస్సై ఫోన్ ద్వారా విషయం చెప్పారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని శుక్రవారం నుంచి రోజుకు పది ట్రిప్పులు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు ఆందోళన విరమించారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.



అభివాదం చేస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు

వైసీపీ పాలనలో రోడ్డునపడ్డ భవన నిర్మాణ కార్మికులు

● టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు ధ్వజం

● ఒంగోలు చేరిన చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర

ఒంగోలు (కార్పొరేషన్) జనవరి 25 : వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులు బజారున పడ్డారని, కార్మికుల పాలిట కరోనా జగన్మోహన్‌రెడ్డి అని తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కార్పొరేషన్ (టీఎన్‌టీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రామరాజు ధ్వజమెత్తారు. యూనియన్ ఆధ్వర్యంలో టెక్కలి నుంచి కుప్పం వరకు చేపట్టిన చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర గురువారం ఒంగోలు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక విష్ణుప్రియ ఫంక్షన్‌హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక రేట్లు పెంచేశారన్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులు, దాని అనుబంధ కార్మికులైన 126 రకాల వృత్తి పనుల వారు బజారున పడ్డారన్నారు. కరోనా వైరస్ కొందరినే ఇబ్బందిపెడితే, కార్మికుల పాలిట కరోనా మించిన వైరస్ జగన్మోహన్‌రెడ్డి అన విమర్శించారు. నేడు రాష్ట్రంలో అన్ని వర్గాల కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో, చాలీచాలని కూలీలతో అల్లాడిపోతున్నారన్నారు. కనీస రుణాలు కూడా ఇవ్వకుండా సైకో పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగినేని రామారావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలోని కార్మికవర్గం ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై టీఎన్‌టీయూసీ బస్సు యాత్ర కొనసాగుతుందన్నారు. టెక్కలి నుంచి కుప్పం వరకు కొనసాగే యాత్రలో కార్మికులను కలిసి వారి సమస్యలను గుర్తించి, రాబోయే టీడీపీ ప్రభుత్వంలో అమలు చేయాల్సిన పథకాలను చంద్రబాబుకు వివరిస్తామని తెలిపారు. అంతకు ముందు స్థానిక కర్నూలు రోడ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి బస్సు యాత్ర నగరంలో పర్యటించడంతోపాటు, టీఎన్‌టీయూసీ ప్రతినిధులు కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జోన్ ఇన్‌చార్జులు కొంగటి లెనిన్‌బాబు, పణీశ్వరరావు, అంబూరు సింధుజ, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు కొక్కెర నాగరాజు, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జెట్టి వెంకటేశ్వర్లు, మల్లయ్య, మోహన్‌రావు, పలు రంగాల కార్మికులు పాల్గొన్నారు.



పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, కలెక్టర్

నేడు గణతంత్ర దినోత్సవం

● పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో భారీ ఏర్పాట్లు

● జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న కలెక్టర్

● 537 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

ఒంగోలు(కలెక్టరేట్) జనవరి 25 : భారత 75వ గణతంత్ర దిన వేడుకలను ఒంగోలులో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం ఉదయం 9గంటలకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. వేడుకలను తిలకించేందుకు ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులు, వివిధ వర్గాల ప్రజలు రానుండటంతో అందుకనుగుణంగా అక్కడ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ శకటాలను, స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మరోవైపు లబ్ధిదారులకు ఆయా శాఖల ద్వారా ఉపకరణాలు, చెక్కులతోపాటు జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 537 మందికి పైగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

కాగా గణతంత్ర దినోత్సవం కోసం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో చేసిన ఏర్పాట్లను కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికగర్గ్‌లు గురువారం పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. వేడుకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

రేపు ఒంగోలుకు పీసీసీ చీఫ్ షర్మిల

ఒంగోలు (క్రైం) జనవరి 25 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డి శనివారం ఒంగోలులో జరగనున్న పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొననున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక గుంటూరు రోడ్డులో గల విష్ణుప్రియ ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యకర్తల సమావేశంలో షర్మిలతోపాటు పార్టీ నాయకులు కొప్పులరాజు, రఘువీరారెడ్డి, కేవీపీ రామచంద్రరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ఉన్న పార్టీశ్రేణులు విరివిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఎంత మోసం!

ఎన్నికల వేళ మాయమాటలు

లైనింగ్ లేకుండానే టన్నెళ్ల తవ్వకాలు

పనులన్నీ పూర్తయ్యాయని ప్రచారం

టీబీఎం ఇంతవరకు వెనక్కిరాలేదు

ఓట్ల కోసం వెలిగొండపై వైసీపీ ఆరాటం

మూడేళ్ల క్రితమే టన్నెల్-1 పూర్తయినా

నీటి గురించి పట్టించుకోని ప్రభుత్వం

అడుగు ముందుకు పడని పునరావాసం

ఇంకా పెండింగ్‌లోనే అనేక పనులు

వచ్చే ఎన్నికల్లో లబ్ధికోసం వైసీపీ ప్రభుత్వం వెలిగొండపై ఆరాటపడుతోంది. కీలక పనులన్నీ పెండింగ్ ఉండగా కేవలం టన్నెల్ తవ్వకాన్ని మమఅనిపించి ప్రాజెక్టును పూర్తిచేశామని అబద్ధపు ప్రచారం మొదలుపెట్టింది. నిబంధనలు పట్టించుకోకుండా భవిష్యత్ భద్రత ఆలోచించకుండా మాన్యువల్‌గా తవ్వకాలు చేపట్టి దానికే ఘనంగా ప్రచారం చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిపై చిత్తశుద్ధితో గత టీడీపీ ప్రభుత్వం నిబంధనల ప్రకారం అనేక క్లిష్ట పరిస్థితులను అధిగమించి అధిక నిధుల వ్యయంతో కీలక పనులను పూర్తిచేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిలో నీరిస్తామని జగన్‌రెడ్డి ఆర్భాటం చేశారు. కానీ మూడేళ్ల క్రితమే తొలి టన్నెల్ తవ్వకం పూర్తయినా ఇంతవరకు నీటి విడుదలపై దృష్టిపెట్టలేదు. నిర్వాసితుల పునరావాసంలో అసాధారణ జాప్యం, నిధుల కొరతే అందుకు ప్రతిబంధకాలు. కాగా ప్రస్తుతం ఎన్నికలు దగ్గరపడుతుండటంతో కృష్ణానది నుంచి నీరు తీసుకునే అవకాశం కూడా లేకపోయినా ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నా ప్రాజెక్టును ప్రారంభించే యోచన చేస్తుండటం గమనార్హం.



ఒంగోలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని సుమారు 4.47 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వం దొంగాట ప్రారంభించింది. కీలక పనులన్నీ పూర్తిచేయకుండానే ప్రాజెక్టు అంతా సిద్ధం అన్నట్లు ఆర్భాటం చేస్తోంది. వివరాల్లోకి వెళితే.. 1996 మార్చిలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. కేంద్ర అనుమతులు, పర్యావరణ, అటవీశాఖ నుంచి క్లియరెన్స్ ప్రక్రియ ఇతర కీలక సర్వేలు టీడీపీ కాలంలోనే జరగ్గా జలయజ్ఞంలో భాగంగా వైఎస్ఆర్ కొన్ని పనులు చేపట్టారు. కృష్ణానదిలో శ్రీశైలం, ఎగువన కొల్లంవాగు ప్రాంతం నుంచి 18.80 కి.మీ. దూరం ఒకటి ఏడు మీటర్లు, మరొకటి 9.2 మీటర్ల వ్యాసంతో రెండు టన్నెళ్లు తవ్వి దోర్నాల మండలం కొత్తూరు దగ్గర నీరు బయటకు తెచ్చి అక్కడి నుంచి 23.36 కి.మీ ఫీడర్ కాలువ ద్వారా నల్లమల సాగర్(రిజర్వాయర్)కు రోజుకు ఒక టీఎంసీ వంతున నింపేలా డిజైన్ చేశారు. పూర్తి నీటి సామర్థ్యం 53.85 టీఎంసీలు కాగా 43.58 టీఎంసీల లైవ్ స్టోరేజీతో రిజర్వాయర్ నిర్మాణం పూర్తయింది.

అంతా టీబీఎంతోనే..

అత్యంత కీలకమైన టన్నెళ్ల తవ్వకాలను జర్మనీ నుంచి తెచ్చిన టన్నెల్ బోర్ మిషన్ (టీబీఎం) ద్వారా చేపట్టారు. ఆ మిషన్ ద్వారా ఒకేసారి తవ్వకం, తవ్విన మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా వెలుపలకు తీసుకరావడం, పైభాగంలో సెగ్మెంట్లు(సిమెంట్ లైనింగ్) అమర్చడం చేసేలా ఏర్పాటు చేశారు. అలానే తొలి నుంచి పనులు జరుగుతూ వచ్చాయి. 2009 వరకు ఒకింత వేగంగానే జరిగిన పనులు తర్వాత మందగించి 2012 నాటికి ఆగిపోయాయి. తిరిగి 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చాక నాటి సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించారు. అప్పటివరకు కేవలం 10 కి.మీ. మాత్రమే తొలి టన్నెల్ పూర్తికాగా దాదాపు ఏడు కి.మీ టీడీపీ కాలంలో పూర్తిచేశారు. అత్యంత క్లిష్టమైన హెడ్ రెగ్యులేటరీ పనులు(తొలి టన్నెల్‌కు)తో పాటు పలు ఇతర పనులు చేశారు. రెండవ టన్నెల్ తవ్వకం కూడా 3కి.మీ.పైగా చేశారు. మొత్తంగా టీడీపీ కాలంలో 2014-19 వరకు సుమారు రూ.1,500కోట్ల వ్యయంతో పాటు నిర్వాసితుల సర్వే, ప్యాకేజీలపైనా దృష్టిసారించారు. అలా వైసీపీ ప్రభుత్వం వచ్చేనాటికి తొలి టన్నెల్ 17కి.మీ. రెండవ టన్నెల్ 11.8కి.మీ. పూర్తితోపాటు పలు ఇతర కీలక పనులు పూర్తయ్యాయి.

చిత్తశుద్ధి లేని పాలకులు

కాగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే వెలిగొండ నీరిస్తాని పాదయాత్రలో, ఎన్నికల ప్రచారంలో జగన్మోహన్‌రెడ్డితోపాటు వైసీపీ నేతలు ఊదరగొట్టారు. చిత్తశుద్ధితో పనులు, నిర్వాసితులకు పునరావాసం పూర్తిచేసి ఉంటే ఏడాదిలోపే నీరిచ్చే అవకాశం ఉండేది. ఎందుకంటే వైసీపీ వచ్చే నాటికి తొలి టన్నెల్ కేవలం 1.80 కి.మీ మాత్రమే పెండింగ్‌లో ఉంది. అయితే నిర్వాసితుల పునరావాసానికి నిధులు ఇవ్వకపోవడంతో వారిని అధికారులు తరలించలేకపోయారు. దీంతో 2021 జనవరిలోనే తొలి టన్నెల్ తవ్వకం పూర్తయినా ప్రాజెక్టులోకి కృష్ణానీటిని తీసుకురాలేకపోయారు. నిధుల ఇవ్వకపోగా నిర్వాసితుల పురావాస అంశాలను బయటకు రాకుండా ఉండేందుకు ఏటా రెండు, మూడు మహూర్తాలు పెడుతూ జూన్, ఆగస్టు, డిసెంబరులలో వెలిగొండ నీళ్లంటూ వైసీపీ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ వచ్చింది. రెండవ టన్నెల్ పనులు చేస్తున్నట్లు చూపేందుకు ప్రయత్నం చేశారు.

టీబీఎం పక్కనపెట్టి బ్లాస్టింగ్

ఈక్రమంలో టీబీఎంతో పక్కాగా చేయాల్సిన టన్నెల్ తవ్వకం పనులను మాన్యువల్‌గా తవ్వుతూ, బ్లాస్టింగ్ చేస్తూ వచ్చారు. ఆ మట్టిని బయటకు తెచ్చేందుకు రెండు, మూడు చోట్ల టన్నెల్-2 నుంచి టన్నెల్ 1లోకి భారీ రంధ్రాలను పెట్టారు. టీఎంటీ ద్వారా పైభాగంలో పెట్టాల్సి సెగ్మెంట్లు, (లైనింగ్) ఏర్పాటు పట్టించుకోకపోవడంతోపాటు మట్టి తెచ్చే టిప్పర్ల రాకపోకల కోసం టన్నెళ్ల అడుగు భాగంలో రెండు, మూడు అడుగుల ఎత్తులో రోడ్డుగా ఏర్పాటుచేశారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో చేయాల్సిన ఆ పనులను పూర్వకాలంలో కాలువలు, బావులు తవ్వినట్లు తవ్వేశారు. భవిష్యత్‌లో నీటి విడుదల సమయంలో కొండచరియలు విరిగిపడితే ఎలా అన్నది ప్రశ్నార్థకం కాక అడుగున రోడ్డులా వేయడంతో టన్నెళ్ల వ్యాసం కూడా తగ్గిపోయింది. మరోవైపు ఫీడర్ కాలువలో చాలాచోట్ల స్ట్రక్చర్లు పెండింగ్‌లో ఉండగా అనేకచోట్ల మట్టి కట్టలు కోతకు గురై లైనింగ్ చేయాల్సి ఉంది. ఇక ఏళ్ల క్రితం తవ్విన కాలువలు పూడిపోయి, చిల్లచెట్లతో నిండాయి.

నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరం

మరోవైపు నిర్వాసితుల పునరావాసం పట్టించుకున్న పాపాన పోలేదు. నాలుగేన్నరేళ్ల వైసీపీ పాలనలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. మొత్తం 11 ముంపుగ్రామాల్లో 10 వేల కుటుంబాలు నిర్వాసితులు అవుతున్నారు. అయితే పదేళ్ల క్రితం నాటి సర్వేలో 7.5వేల కుటుంబాలకు పునరావాస ప్యాకేజి ఇవ్వాల్సి ఉంటుందని గుర్తించారు. అయితే అందులో కేవలం 73 కుటుంబాలను మాత్రమే తరలించగా, తదనంతర కాలంలో 18ఏళ్లు నిండిన వారికి కూడా ప్యాకేజీ కావాలన్న డిమాండ్ వచ్చి ప్రస్తుతం నిర్వాసితుల సంఖ్య పెరిగింది. ఇందుకు సర్వేలు కూడా చేశారు. కానీ ఒక్కరికి కూడా పునరావాస ప్యాకేజి ఇవ్వలేదు. కాలనీల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న విధంగా ఉంది. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కోసం 2021 ఫిబ్రవరి రూ.1300 కోట్లతో వైసీపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది తప్ప నిధులు ఇవ్వలేదు. మొత్తం వైసీపీ ప్రభుత్వ కాలంలో కేవలం రూ.951 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. గత అంచనా ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.8,100 కోట్లు కాగా దాదాపు రూ.6వేల కోట్లు ఖర్చుచేశారు. తాజాగా అంచనా వ్యయం మరో వెయ్యి కోట్లు పెరగనుంది. అలా మరో రూ.3వేల కోట్లు అవసరం కాగా 2023-24 బడ్జెట్‌లో ప్రభుత్వం కేవలం రూ.101 కోట్లను కేటాయించింది. అలా నిధులు ఇవ్వకుండా పనులు చేయకుండా నిర్వాసితులను తరలించకుండా కేవలం టన్నుల్ తవ్వకం పూర్తయిందని ప్రచారం చేస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రాజెక్టు ప్రారంభానికి నిసిగ్గుగా సన్నాహాలు వైసీపీ ప్రభుత్వం చేస్తోంది. ఒకవేళ లైనింగ్ చేయకపోయినా టన్నెల్ ద్వారా నీరు తీసుకోవచ్చని అనుకున్న ప్రస్తుతం కృష్ణానదిలో నీరు లేదు. వచ్చే ఆగస్టు తర్వాతనే నదిలోకి నీరు వచ్చేది. అయినా ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రాజెక్టు ప్రారంభం అంటూ ప్రచారం చేస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే మూడేళ్ల క్రితమే పూర్తయిన టన్నెల్-1 ద్వారా నీరు తీసుకునే అవకాశం ఉన్నప్పుడు నిర్వాసితుల పునరావాసం, పెండింగ్ పనులు చేసేవారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

తప్పనిసరిగా ఓటు వేయాలి

రాజ్యాంగం కల్పించిన హక్కును అందరూ వినియోగించాలి


జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి పిలుపు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 25 : రాజ్యాంగం ప్రసాదించిన హక్కును, తమపై ఉన్న బాధ్యతను ఓటర్లందరూ గుర్తించి తప్పనిసరిగా ఓటు వేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఏ.భారతి పిలుపునిచ్చారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ప్రకాశం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా డీఆర్ఆర్ఎం స్కూలు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి స్వేచ్ఛగా ఓటును వినియోగించుకునే హక్కును తెలియజేసేలా కలెక్టర్ భారీ బెలూన్‌ను ఎగురవేశారు. అనంతరం ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వీక్షించారు. అనంతరం జరిగిన సభలో జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి మాట్లాడుతూ మన పాలకులను ఓటు ద్వారా మనమే ఎన్నుకునే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. బుల్లెట్ కంటే బ్యాలెట్ శక్తివంతమైందని తెలిపారు అందుకే ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల గుణగణాలను తెలుసుకొని సమర్థులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైందన్నారు. 80 ఏళ్లు పైబడిన దివ్యాంగ ఓటర్ల కోసం వారి ఇంటికి వెళ్లి అధికారులు ఓటు సేకరించేలా ఈసారి ప్రత్యేక అవకాశం కల్పించారని తెలిపారు. ఓటు హక్కు వచ్చిన నాటి నుంచి ప్రతిసారి ఓటు వేస్తున్న సీనియర్ సిటిజన్లు పి.హనుమంతరావు, సివిఎల్.సుబ్రహ్మణ్యం, రంగనాథం, జి.నరసింహరావులను ఈ సందర్భంగా సన్మానించారు. సీనియర్ సిటిజన్, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఏపీ చైర్మన్ ఎం.నాగేశ్వరరావు తొలిసారి ఓటుహక్కును వినియోగించుకోబోతున్న వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే.శ్యాంబాబు, ఏఎస్పీ నాగేశ్వరరావు, ట్రైనీ ఐఏఎస్ శౌర్యమన్ పటేల్, డీఆర్వో శ్రీలత, ఆర్డీవో విశ్వేశ్వరరావు, స్వీప్ నోడల్ అధికారి రవి, అధికారులు వసుంధర, రవికుమార్, ఉషారాణి, అర్చన, వెంకటేశ్వరరావు, వి. సుబ్బారావు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఉత్తమ పనితీరు చూపిన దర్శి ఈఆర్వోగా ఉన్న ఎంవీఎస్ లోకేశ్వరరావు, పది మంది బీఎల్‌వోలను సత్కరించారు.



కార్యక్రమాన్ని జ్యోతివెలిగించి ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి, పక్కన కలెక్టర్ దినేష్‌కుమార్

కుర్చీ నాదే!



● ఉద్యోగోన్నతి కోసం ఓ అధికారి అడ్డదారి

● పోస్టింగ్ కోసం తాడేపల్లి చుట్టూ ప్రదక్షిణలు

● డిప్యుటేషన్ సమయంలో భారీగా అక్రమార్జన

● రూ.50లక్షల సూట్ కేసుతో రాజధానిలో మకాం

పుల్లలచెరువు, జనవరి 13 : ఆయన ఓ శాఖలో చిన్నస్థాయి అధికారి. కానీ అధికార పార్టీలో మాత్రం పెద్దస్థాయిలో పలుకుబడి ఉంది. నేతల అండదండలతో వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే ఉద్యోగోన్నతి పొందారు. వాస్తవంగా ఆయనకు ఆ అర్హత లేనప్పటికీ, డిప్యుటేషన్‌పై పైస్థాయికి వెళ్లారు. ఆతర్వాత నియోజకవర్గంలో అన్నీ తానై చక్రం తిప్పాడు. నియోజకవర్గంలో నీళ్లు పారించలేకపోయినా, కాగితాల్లో మాత్రం నిధులు పారించి పెద్దమొత్తంలో వెనకేసుకున్నట్లు ఆయనపై ఆరోపణలున్నాయి. దీంతో అయ్యగారిపై అధికారపార్టీలోని సీఎం సామాజికవర్గం నేతల్లో అసంతృప్తి పెరిగింది. అయితే ప్రస్తుతం ఆయన డిప్యుటేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. ఈయనకు దన్నుగా ఉన్న నేత కూడా మరో నియోజకవర్గానికి వెళ్లారు. ఇప్పుడు అనివార్యంగా తిరిగి ఆయన కిందిస్థాయికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇన్నాళ్లూ ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న తీరుగా ఆయన వ్యవహారం నడవగా, ప్రస్తుతం అంతా మారిపోయింది. దీని నుంచి బయటపడేందుకు తాడేపల్లి పెద్దల వద్దకు పయనమయ్యాడు. ఒట్టి చేతులతో వెళితే పెద్దగా ప్రయోజనం ఉండదని గ్రహించి గట్టి చేతులతోనే ఆయన తాడేపల్లిలో పాగా వేశాడు. పైగా లౌక్యం తెలిసిన వ్యక్తి. పచ్చనోట్లను ఎలాగైన పరిచి ఉద్యోగోన్నతి పత్రంతో తిరిగి రావాలని కంకణం కట్టుకున్నాడు. రూ.50 లక్షల మేర ముట్టజెప్పేందుకు ఆయన సిద్ధపడినట్లు తెలిసింది. తన మాట వినే ప్రజాప్రతినిధి సిఫారసు ద్వారా ఉద్యోగోన్నతి పొందేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇక జిల్లాలో ఆ శాఖలో ఆయనపై ఉండే అధికారిని కూడా ఈ పాటికే ప్రసన్నం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లాకు చెందిన ఆ శాఖ ఉన్నతాధికారి కూడా భారీగా ముడుపులు అందుకొని ఆయన ఉద్యోగోన్నతికి పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన ఆ శాఖలో ఇప్పటికే పెండింగ్ బిల్లులు భారీగా ఉన్నాయి. ఒక్కసారి ఉద్యోగోన్నతి వస్తే పైవారికిచ్చే రూ.50లక్షలు కొద్దిరోజుల్లో తిరిగి సంపాదించుకోవచ్చని ఆయన ఆశలు పెట్టుకున్నట్లు తెలిసింది. అయితే ఆయనకు ఉద్యోగోన్నతి రాకుండా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని సీఎం సామాజికవర్గం నేతలు అడ్డుపడుతున్నారు. ఆ అధికారికి ఉద్యోగోన్నతి ఇవ్వొద్దని జిల్లాకు చెందిన ముఖ్యనేతకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మరి ఆ అధికారి నుంచి ముడుపులు తీసుకొని ఉన్నతాధికారులు ఉద్యోగోన్నతి ఇస్తారో, లేదో వేచిచూడాల్సిందే.

ఇతరులకు ప్రవేశం లేదు..

కీలకమైన ఆ శాఖకు ఇటీవల విజయవాడకు చెందిన ఓ మహిళా అధికారి బదిలీపై వచ్చారు. ఆమెను రెగ్యులర్ అధికారిగా నియమించారు. అయితే ఆ కుర్చీపై ఆశ పెట్టుకున్న సదరు అధికారి 26 రోజులకే ఆ మహిళా అధికారిని బలవంతంగా సెలవు పెట్టించారని ఆ శాఖ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. ఇప్పటివరకు ఆయనకు దన్నుగా ఉన్న ముఖ్యనేతే ఆమెతో సెలవు పెట్టించారని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో అక్కడ ప్రస్తుతం పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ, కొత్తవారు ఆ వైపు చూడడం లేదు. అనుమతి లేకుండా ఆ పోస్టులో చేరితే అనంతరం వివాదాలు కొనితెచ్చుకోవాల్సి వస్తుందని మిగిలిన అధికారులు కూడా జంకుతున్నారు.

పర్సెంటేజీ లేనిదే పైలు ముట్టుకోరు?

తాను ఇన్‌చార్జీగా బాధ్యతలు నిర్వహించిన కాలంలో పైసా లేనిదే పైలు ముట్టుకోరు. కార్యాలయంలోనే మధ్యవర్తులను పెట్టుకొని వారితో దర్జాగా డబ్బులు వసూలు చేయించారు. మంచి నీటి ట్యాంకర్లు, బోర్ల బిల్లులు, జలజీవన్ మిషన్‌కు కనీసం ఆయన వాటాగా 10శాతం లేనిదే పైలు కూడా చూడకుండానే కొర్రీలు పెడతారనే పేరుంది. డబ్బులు ఇస్తే మాత్రం అర్ధరాత్రి అయిన పనిపూర్తి చేసి ఇచ్చేస్తారు. నాలుగేళ్ల కాలంలో సూమారు రూ.5కోట్లకు పైగానే కుడబెట్టాడని వైసీపీ నేతలే చర్చించుకుంటున్నారు. వైసీపీ నియోజకవర్గ స్థాయి నాయకులైనా ఆయన ముందు బలాదూరే అని వారే చెప్పడం కొసమెరుపు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

పొన్నలూరు(కొండపి), జనవరి 25 : వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త కనపర్తి మనోజ్‌కుమార్ విమర్శించారు. పొన్నలూరు గ్రామంలోని జడ్పీటీసీ సభ్యుడి ఇంటికి సమీపంలోని రోడ్డులో ఏర్పడ్డ గోతిపై అడ్డుగా చిల్లకంపను వేసిన దృశ్యాన్ని ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

పార్టీ నాయకులతో కలిసి ఆయన గురువారం ఉదయం గోతివద్ద నిరసన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో జనసేన నాయకులు కర్ర తిరుమలరెడ్డి, రామరాజు, నవీన్, ప్రేమ్, భరత్, బాలు, లక్ష్మణ్, చందు, రామకృష్ణ, రవిబాబు, సంతోష్, భానుచంద్ర పాల్గొన్నారు.

నేడు డీఎస్సీ నోటిఫికేషన్

● జిల్లాలో 730 ఖాళీలు

ఒంగోలు(విద్య), జనవరి 25 : ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసేందుకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ ప్రకటించి టీచర్ పోస్టులన్నీ భర్తీచేస్తామని ఉదరగొట్టిన విషయం తెలిసిందే. ఆచరణలో మాత్రం అడుగు ముందుకు వేయలేదు. ప్రస్తుతం తీరా ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో మరికొన్ని రోజుల్లో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో డీఎస్సీ ప్రకటనకు శ్రీకారం చుట్టడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు నోటిఫికేషన్ జారీచేస్తే ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం వచ్చాకే నియామకాలు చేపట్టే అవకాశం ఉంది. జిల్లాలో ప్రస్తుతం 730 ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. గరిష్ఠంగా సెకండరీ గ్రేడ్ తెలుగు 240 ఖాళీలు ఉన్నట్లు అంచనా. ఎస్‌జీటీ ఉర్దూ, వివిధ సబ్జెక్టుల స్కూలు అసిస్టెంట్, ఇతర పోస్టులు సమారు 500 ఖాళీలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అయితే శుక్రవారం ప్రకటించే నోటిఫికేషన్‌లో ఎన్ని ఖాళీలు ప్రకటిస్తారో తెలాల్సి ఉంది.

ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన పీటీసీ సీఐ

● అభినందించిన ప్రిన్సిపల్ ఏఆర్ దామోదర్

ఒంగోలు (క్రైం) జనవరి 25 : పోలీసు శాఖలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీసు మెడల్‌కు పీటీసీ సీఐ అద్దంకి వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి చేతులమీదుగా ఆ మెడల్‌ను త్వరలో అందుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి వెంకటేశ్వర్లును పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ ఏఆర్ దామోదర్ అభినందించారు. గురువారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయనను శాలువతో సత్కరించారు. పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరి ఉద్యోగోన్నతిపై ఇనస్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఇండియన్ పోలీసు మెడల్‌కు ఎంపిక కావడం అభినందనీయమని పలువురు అధికారులు తెలిపారు.

రైతు బాంధవుడు గొట్టిపాటి

● వర్ధంతి సభలో టీడీపీ నాయకుల వెల్లడి



కావలి : మాట్లాడుతున్న బొల్లినేని రామారావు

కావలి, జనవరి 25: సోమశిల ఉత్తర (గొట్టిపాటి కొండపనాయుడు) కాలువ సాధన కోసం పోరాడిన మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి కొండపనాయుడు రైతు బాంధవుడని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, కావలి టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడులు పేర్కొన్నారు. కొండపనాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం గొట్టిపాటి 22వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా పట్టణ ఏరియా వైద్యశాల వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేసి, ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ట్రస్ట్ బాధ్యతలు నిర్వహిస్తున్న జ్యోతి బాబూరావు అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమంలో కొండపనాయుడు మనుమళ్లు కంచర్ల రమాధర్‌నాయుడు, బొబ్బూరు శ్రీరాములు, సురేష్, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, జనసేన నేత అళహరి సుధాకర్, బీజేపీ నేత కందుకూరు వెంకటసత్యనారాయణ, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, మన్నవ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

జలదంకి : కావలి మాజీ ఎమ్మెల్యే దివంగత గొట్టిపాటి కొండపనాయుడు వర్ధంతిని గురువారం జలదంకి, గట్టుపల్లి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. జలదంకి టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పీ .మధు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వర్గీయ గొట్టిపాటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలుగురైతు మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. గట్టుపల్లిలో ఉన్న గొట్టిపాటి విగ్రహానికి కాకర్లట్రస్ట్ ఛైర్మన్ కాకర్ల సురేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పచ్చా పెంచలయ్యనాయుడు, కంచర్ల వినోద్‌నాయుడు, మాలకొండయ్యనాయుడు, శ్రీహరి, మునగాల తిరుమలరెడ్డి, సురే శేషారెడ్డి, డాక్టర్ పి.వి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన పోవాలి - తెలుగుదేశం రావాలి

వింజమూరు: ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే అరాచక పాలన పోవాలని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు అన్నారు. మండల టీడీపీ కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి ఆధ్వర్యంలో ఉత్తర హరిజనవాడలో ప్రజాదీవెన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను అందజేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చల్లా శ్రీనివాసులు, దంతులూరి వెంకటేశ్వరరావు, మంచాల శ్రీనివాసులు, గురజాల వాసు, జి.సుదర్శనరెడ్డి, కొండపల్లి వెంకటేశ్వర్లు, షేక్ ఖాజావలి, యారం కృష్ణయ్య, చావా మహేంద్ర, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధర్మప్రచార వారోత్సవాలు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దుత్తలూరు (ఉదయగిరిరూరల్), జనవరి 25: మండలం లోని నర్రవాడలో ఉన్న శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి ఆలయంలో గురువారం ధర్మ ప్రచార వారోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణం నిర్వహించడంతో పాటు వడ్డిపాళెం, నర్రవాడ, గుదేవారిపాళెం, ఉలవవారిపాళెంలో గ్రామోత్సవం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భవిత కేంద్రం సందర్శన

కందుకూరు, జనవరి 25: పట్టణంలోని కోటకట్టువీధి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని రాష్ట్ర ప్రత్యేక విద్య అసిస్టెంట్ కో ఆర్డినేటర్ జీ మల్లికార్జున గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందుతున్న విద్యాబోధన, వారం వారం ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రాన్ని తనిఖీచేసిన రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎంఈవో కూనం సుబ్బారెడ్డితో సమావేశమయ్యారు.

నాయీబ్రాహ్మణ సంక్షేమమే టీడీపీ ధ్యేయం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఉదయగిరి, జనవరి 25: నాయీబ్రాహ్మణ సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని నెల్లూరు పార్లమెంట్ నాయీబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు ఆళ్లూరు శ్రీహరి అన్నారు. గురువారం ఉదయగిరి నియోజకవర్గ సాధికార సమితి జిల్లా కమిటీ సభ్యుడు ఘైదుకూరు వెంకటసుబ్బయ్య, తాళ్లూరు రమణయ్య, పార్లమెంట్ కార్యదర్శిగా ఈదర శ్రీనివాసులును నియమించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణులు ప్రసాద్, వెంకట్ పాల్గొన్నారు.

కరసేవకులకు సన్మానం

వరికుంటపాడు, జనవరి 25: విశిష్ట సేవలు అందించిన కరసేవకులకు గురువారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. వరికుంటపాడుకు చెందిన అంద్రా పరంధామిరెడ్డి, అంద్రా సావిత్రి నివాసాలకు వెళ్లి వారిని శాలువాలతో సన్మానించడంతో పాటు జ్ఞాపికలను అందజేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రహదారి భద్రత నియమాలు పాటించండి



కావలి రూరల్ : లారీ డ్రైవర్లకు సేఫ్టీకోన్‌లు అందచేస్తున్న టోల్‌ప్లాజా మేనేజర్

కావలి రూరల్, జనవరి 25: రహదారి భద్రతలు పాటించినప్పుడే సురక్షితంగా గమ్యం చేరవచ్చని ముసునూరులోని సింహపూరి ఎక్స్ ప్రెస్ వే టోల్ ప్లాజా మేనేజర్ గణేష్ పేర్కొన్నారు. గురువారం 35వ జాతీయ భద్రతా మాసోత్సవాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం నేరమని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే 108, 1033 నెంబర్లకు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చన్నారు. అనంతరం లారీడ్రైవర్లకు సేఫ్టీ కోన్‌లు, కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా రేసీ మేనేజర్ శ్రీమన్నారాయణ, రూరల్ హైవే మొబైల్ పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరు : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎస్కేఎండీ రఫీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీఆర్ ఆక్స్‌ఫర్డ్ కాలేజీ నుంచి ఏరియా హాస్పటల్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ హనీఫ్, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరక్టర్లు జి. బాలభాస్కరరావు, బి. నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా వికసిత్ భారత్ కార్యక్రమం

● అధికారులపై బీజేపీ నేతల ఆగ్రహం



ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులు

అనంతసాగరం, జనవరి 25: మండలంలోని గౌరవరంలో గురువారం వికసిత్ భారత్ కార్యక్రమం తూతూ మంత్రంగా నిర్వహించడం పట్ల బీజేపీ నాయకులు అధికారులను నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు వికసిత్ భారత్ కార్యక్రమం చేపట్టగా ప్రజలకు సమాచారం ఇవ్వకుండానే కార్య క్రమాన్ని ఎలా నిర్వహిస్తున్నారని ఎంపీడీవో మధుసుదన్‌రావును ప్రశ్నించారు. ప్రజలందరికీ తెలియపరిచి కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయులురెడ్డి, బుచ్చిరెడ్డి అల్లంపాటి రమణారెడ్డి తదితరులు డిమాండ్ చేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వల్లూరు రాజేష్

మండల కేంద్రంలో గురువారం బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడిగా వల్లూరు రాజేష్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కర్నాటి ఆంజనేయులురెడ్డి, అల్లంపాటి రమణారెడ్డి, బుచ్చిరెడ్డి, నాగరాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఏఈఆర్‌వోగా కందుకూరు కమిషనర్



కలెక్టరు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్

కందుకూరు, జనవరి 25: ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్‌వో)గా కందుకూరు మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ గురువారం జిల్లా కలెక్టరు హరినారాయణన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఇటీవల జరిగిన ఓటర్ల నమోదులో అత్య. దికమందిని నమోదు చేసేందుకు ఆయన ఈ అవార్డు అందుకున్నారు. పట్టణంలోని 111వ నెంబరు పోలింగ్ బూత్ బీఎల్వో ప్రవీణ్‌కు ఉత్తమ బీఎల్వోగా అవార్డు లభించింది. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.





యానాదులకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలి : కేసీ



యానాదులతో మాట్లాడుతున్న కేసీ పెంచలయ్య

సంగం, జనవరి 25: జిల్లాలోని యానాదులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలని యానాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెసి పెంచలయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన సంగం మండలంలోని వంగల్లు యానాది కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటికీ వెళ్లి యానాదుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాదులకు ఎమ్మెల్యే సీటు కేటాయించిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని, లేకపోతే కోవూరు నుంచి యానాదుల సంఘం తరపున తాను పోటీ చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్రబాబు, మహిళా అధ్యక్షురాలు ఉష, స్థానిక నాయకులు యల్లంపల్లి శ్రీనయ్య, ఇండ్ల శ్రీనయ్య, మల్లిక వెంకటేశ్వర్లు, యాకసిరి వెంకటరమణయ్య, కొమరగిరి కృష్ణయ్య, ఇండ్ల పేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఏఎన్ఎం శివకుమారి పై చర్యలు తీసుకోవాలి

కావలి, జనవరి 25: ఆశావర్కరు సుల్తాన్‌బీపై చేయిచేసుకున్న ఏఎన్ఎం శివకుమారిపై చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్స్(సీఐటీయూ) యూనియన్ అధ్యక్షురాలు వసుంధరాదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అడిషనల్ డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగి శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు. వసుంధరాదేవి మాట్లాడుతూ బుధవారం ఎమ్పీడీవో ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్ సుల్తాన్‌బీని ఏఎన్ఎం శివకుమారి అసభ్యకరంగా మాట్లాడి కొట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పీ. పెంచలయ్య, యూనియన్ నాయకులు గాయత్రి, అన్నమ్మ పాల్గొన్నారు.

ఏఎస్ పేట ఎస్ఐగా ప్రసాద్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ఏఎస్ పేట, జనవరి 25: ఏఎస్ పేట మండల ఎస్ఐగా గురువారం ప్రసాద్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలపై దృష్టి సారిస్తానని, ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షాలు తెలపారు.

దివ్యాంగులకు ఉచిత బస్ పాస్‌ల పంపిణీ

సీతారామపురం, జనవరి 25 : మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గురువారం దివ్యాంగుల సంక్షేమ సంఘం, అఖిల భారత సేవాసంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ మండలంలోని 40 మంది దివ్యాంగుల బస్‌పాస్‌లకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని, జిల్లా కోఆర్డినేటర్ వేణుగోపాల్ దివ్యాంగులకు టీషర్ట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి, ఎంఈవో మస్తాన్‌వలి, వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

వరికుంటపాడు, జనవరి 25: క్రీడలు ప్రతి ఒక్కరిలో మానసిక ఆరోగ్యం నింపుతాయని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ బాదం నారాయణరెడ్డి, ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. గురువారం నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా గణేశ్వరాపురం జట్టు ఖోఖో ఆటలో రన్నర్‌గా నిలవడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

కందుకూరు, జనవరి 25: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కదిరి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాజగోపాలబాబు, ఎస్. తిరుపతిస్వామి, అనూష, ఇంద్రజ, రామాంజనేయులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు ఓరుగంటి వెంకటేశ్వరరావు, మస్తాన్‌వలి, చుండూరి బాబూరావు, హజరత్, బీవీ కాశీరత్నం, పరుచూరి ఉషశిరీష, టి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ టీ ప్రసాద్ తెలిపారు. గురువారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు హైసూల్ నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.అనంతరం స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద మానవహారం నిర్వహించారు.ఎంఈవో-2 శివకుమార్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా నిర్వహణ

వలేటివారిపాలెం : మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అధికారులు మొక్కుబడిగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలోనూ, ఎస్సీ కాలనీలోని రామాలయం వద్ద తూతూమంత్రంగా ప్రతిజ్ఞ చేసి మ.మ అనిపించారు. మండలంలో 46 పోలింగ్ కేంద్రాలు ఉన్నా ఏ ఒక్క పోలింగ్ కేంద్రంలోనైనా ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించలేదు. అంతేకాకుండా ఎక్కడా కూడా సీనియర్ ఓటర్లను పిలిచి సత్కరించలేదు. ర్యాలీలు నిర్వహించలేదు. ఓటర్లకు అవగాహన కల్పించలేదు.

ఆత్మకూరు : ప్రతి ఒక్కరూ ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అసెస్టింట్ కలెక్టర్ సంజనా సిన్హా, ఆర్డీవో కె మధులత అన్నారు. పట్టణ సమీపంలోని ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సిటిజన్లను ఘనంగా సన్మానించారు. ముందుగా మున్సిపల్ బస్టాండ్ సెంటర్ నుంచి బీఎస్ఆర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వీఆర్‌వోలు, వీఆర్ఏలు, బీఎల్‌వోలు, పాల్గొన్నారు.

● దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే..

కాగా దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని బీజేపీ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో నూతన ఓటర్లకు దేశ ప్రధాని నరేంద్రమోడీ లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి ఓటు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాలం బుజ్జిరెడ్డి, కంది మల్లి కార్జునరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు పి క్రిష్ణ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టి, బస్టాండు సముదాయంలో మావనహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యత తదితర అంశాలపై తహసీల్దారు పి క్రిష్ణ వివరించారు. సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీ విజయ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మర్రిపాడు : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దారు ఆనందరావు స్థానిక హైస్కూల్ విద్యార్థులతో గురువారం బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం వద్ద సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేంద్ర, వీఆర్‌వోలు ఉన్నారు.

ఉదయగిరి : మండలంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్నికల అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ర్యాలీలు నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఉదయగిరి తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ సిటిజన్లను సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్‌వో సానా శ్రీనివాసులురెడ్డి, సర్వేయర్ రవి పాల్గొన్నారు.

వింజమూరు : జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి బంగ్లా సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : సీనియర్ సిటిజన్లను సన్మానించిన అధికారులు



ఉదయగిరి : సీనియర్ సిటిజన్లను సత్కరించిన ఎన్నికల అధికారి ప్రేమ్‌కుమార్



వలేటివారిపాలెం : ఎంపీడీవో కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పేదలకు శుభ్రమైన నీరు అందించడమే లక్ష్యం



తాగునీటిని అందిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

బిట్రగుంట, జనవరి 25: పేదలకు శుభ్రమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా వీపీఆర్ ఫౌండేషన్ పనిచేస్తున్నదని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలంలోని నాగులవరం, బంగారుపాలెం, జువ్వలదిన్నె గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను గురువారం స్థానికులతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా జిల్లాలో 2017 నుంచి ఇప్పటి వరకు 130 మినరల్‌వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. కావలి నియోజకవర్గంలో 17 ప్లాంట్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో సర్పంచు రామారావు, వైసీపీ మండల కన్వీనర్ వీర రఘు, జడ్పీటీసీ ఎం కీర్తన, నాయకులు నలగట్ల శ్రీనివాసులురెడ్డి, బత్తల వినోద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సర్వాయపాలెంలోనూ...

కావలి : కావలి రూరల్ మండలం సర్వాయపాలెంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమృతధార వాటర్ ప్లాంట్‌ను గురువారంఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఫారం-7 దుర్వినియోగంపై ఫిర్యాదు

లింగసముద్రం, జనవరి 25: మండలంలోని చినపవనిలో ఫారం-7 దరఖాస్తులను దుర్వినియోగం చేశారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని యూనిట్ ఇన్‌చారిజ సోంపల్లి మనోహర్, మరికొందరు గురువారం కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరికి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 11న గ్రామంలోని 70, 71, 72 పోలింగ్ బూత్‌లలో 49 ఓట్లను తొలగించేందుకు ఆన్‌లైన్‌లో ఫారం-7 దరఖాస్తులు పెట్టారని తెలిపారు.వీటిలో 22 ఓట్లను గుడ్లూరు మండలం పొట్లూరుకి చెందిన షేక్ యాసిన్ అనే వ్యక్తి ఫారం-7లను దరఖాస్తు చేశారన్నారు. ఫారం-7 దరఖాస్తులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాసులు, ఎం మహేష్, పి బుచ్చయ్య చౌదరి, పి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో క్రీడాకారిణికి అనారోగ్యం

ఉలవపాడు, జనవరి 25: మండలంలోని కరేడు టెంకాయచెట్లపాలెంకు చెందిన వాయల రోహిణి కందుకూరులో జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో గురువారం అనారోగ్యానికి గురైంది. నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని తీవ్ర అనారోగ్యానికి గురైంది.దీంతో నిర్వాహకులు ఆమెను కందుకూరులోని ఓ వైద్యశాలకు తీసుకెళ్ళారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి వెంటనే రోహిణిని ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలకు తరలించి, తన స్వంత ఖర్చులతో మెరుగైన చికిత్స చేయించారు. సాయంత్రానికి డిశ్చార్జ్ చేశారు.

టీడీపీ వెంటే బీసీలు : నూకసాని



మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

గుడ్లూరు, జనవరి 25 : టీడీపీ వెన్నంటే బీసీలు నిలుస్తున్నారని, ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన జయహో బీసీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ పాలనకు చరమగీతం పాడేందుకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. అంతకుముందు ఎన్టీఆర్, అంబేద్కర్, పూలే చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు చెంచల బాబు, కుసుమకుమారి. చిలకపాటి మధు, నాగరాజు, మద్దసాని కృష్ణ, గద్దగుంట శ్రీనివాసులు, ఉమ్మడిప్రోలు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ స్థానంలో కడనూతల కబడ్డీ జట్టు

బిట్రగుంట, జనవరి 25: బోగోలు మండలం కడనూతల మహిళా కబడ్డీ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కావలిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో దగదర్తి జట్టు హాజరు కాకపోవడంతో కడనూతలలోని గడ్డం అమృత జట్టును పోటీలకు పంపారు. డివిజనల్ స్థాయికి వచ్చిన అమృత జట్టుకు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి నగదు బహుమతి అందచేశారు. కావలి డీఎస్పీ వెంకటరమణ పోటీల్లో పాల్గొన్న మహిళలు కళ్యాణి, తనూజ, భవాని, అక్షయ, అనుపమలను అభినందించారు.

కావలిటౌన్ : స్థానిక జెడ్పీ మైదానంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో గురువారం ఫైనల్స్ జరిగాయి. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆర్డీవో శీనా నాయక్, డీఎస్పీ వెంకటరమణలు పాల్గొన్నారు. కబడ్డీ ఫైనల్స్‌లో కావలి మండలం, అల్లూరు మండలం జట్లు తలపడగా, కావలి విన్నర్‌గా, అల్లూరు రన్నర్‌గా నలిచాయి. వాలీబాల్ విన్నర్‌గా కావలి మండలం, రన్నర్‌గా బోగోలు మండలం జట్లు నిలిచాయి. క్రికెట్ విన్నర్‌గా కావలి మండలం, రన్నర్‌గా అల్లూరు జట్లు నిలిచాయి. పోటీల నోడల్ ఆఫీసర్ ఎండీవో కృష్ణారెడ్డి, కన్వీనర్ పీడీ చిరంజీవి పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కుందుర్తి కామయ్య, జనిగర్ల మహేంద్ర యాదవ్, పందిటి కామరాజు, వడ్లమూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రమణయ్య

కావలిటౌన్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కావలి తాలూకా పింఛనర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాయలం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య మాట్లాడుతూ పింఛనర్లకు చెల్లించాల్సిన డీఆర్, పీఆర్సీ అరియర్స్‌లు వెంటనే చెల్లించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధి రూ. 2లక్షల నుంచి రూ. 5లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో సాయిసింగ్, వెంకయ్య పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కాలేజీల అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్



కందుకూరు, జనవరి 25: ఏపీ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలల నిర్వహణలో మెరుగైన ప్రమాణాలు నెలకొల్పటంతోపాటు, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామన్నారు.

దివ్యాంగుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

కావలి, జనవరి 25: దివ్యాంగుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని కావలి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం దివ్యాంగులు మాలేపాటితో సమావేశమై తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం మాలేపాటి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో చంద్రబాబును సీఎంగా చేసుకుంటే దివ్యాంగులకు టీడీపీ చేదోడు వాదోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మన్నవ వెంకట్రావు, పలువురు దివ్యాంగుల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఐసీలో సత్తాచాటిన విద్యార్థినులు

బిట్రగుంట, జనవరి 25: బోగోలు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు పీ.సుహిత, బీఎస్. దివ్యదర్శినిలు నేషనల్ సైన్స్ ఇన్నోవేషన్ ఛాలెంజ్(ఎన్ఎస్ఐసీ)లో తమ సత్తాచాటి పతకాలు, ప్రశంసాపత్రాలు పొందారు. ఈనెల 23, 24 తేదీల్లో బెంగళూరులో జరిగిన పోటీల్లో వారు ప్రతిభ చూపారని జిల్లా గురుకుల పాఠశాల సమన్వయకర్త టీ హేమలత గురువారం తెలిపారు. విద్యార్థినులు ప్రోత్సాహం అందించిన ప్రిన్సిపాల్ పద్మావతి, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయిని లావణ్యను ఆమె అభినందించారు.

బీజేపీలో చేరిన ఉన్నం భాస్కరరావు

కందుకూరు, జనవరి 25: స్థానిక ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు బీజేపీలో చేరారు. గురువారం విజయవాడలో ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా నాయకులు వంశీధర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, తోగంటి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు చుండి మురళీధర్, మాల్యాద్రినాయుడు, శ్రీధర్, మన్నేపల్లి వరప్రసాదరావు, వైకుంఠం తదితరులు ఉన్నారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

అల్లూరు, జనవరి 25 : గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో జ్యోతిలు గురువారం తెలిపారు. శుక్రవారం జరగనున్న వేడుకల్లో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. ఉదయం 8 గంటలకు జెండాను ఎగురవేస్తామన్నారు.

విద్యార్థుల రక్తదానం

కావలిటౌన్, జనవరి 25 : విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్ పర్యవేక్షణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అభయం, సేవియర్స్ సంస్థల సహకారంతో 80మంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. ప్రిన్సిపాల్స్ డాక్టర్ దత్తాత్రేయశర్మ, సురేష్‌లు రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో ఈడీ ఎన్ శేషయ్య, విట్స్ ఛైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, ఇలీంద్ర వెంకటేశ్వర్లు, నూనె మోహన్ పాల్గొన్నారు.

28న ఉచిత లివర్ స్క్రీనింగ్ క్యాంప్



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్‌నాయుడు

కావలిటౌన్, జనవరి 25: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పీఎస్సార్ ట్రస్ట్ హాస్పిటల్‌లో ఈనెల 28న ఉచిత లివర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రభాకర్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చెన్నైకి చెందిన గ్లెనిగల్ హెల్త్ సిటీ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. నేడు అనేకమంది లివరు కేన్సర్‌తో బాధ పడుతున్నారని, లివర్ సమస్యలు సామాన్యంగా బయటపడవని తెలిపారు. రోగం ముదిరిపోయినప్పుడు మాత్రమే బయటపడుతుందన్నారు. ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.